


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 176

శుక్రవారం 15-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ దాదాపు రూ. 8,480 కోట్ల వ్యయంతో
17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం అందులో భాగంగా..


నేడు 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం..

వచ్చే విద్యా సంవత్సరంలో మరో ఐదు మెడికల్ కాలేజీలు, ఆ తర్వాత ఏడాదికి మిగతా ఏడు కాలేజీలలో అకడమిక్ తరగతులు ప్రారంభించనున్న జగనన్న ప్రభుత్వం..

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో 5 మెడికల్ కాలేజీల్లో అకడమిక్ తరగతుల ప్రారంభం..
నేడు విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రారంభించి, వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాల, మచిలీపట్నం లలో 4 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూడా విజయనగరం మెడికల్ కాలేజీ ప్రాంగణం నుంచి ప్రారంభించనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన రాష్ట్రంలో 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఏర్పాటు కాగా, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో మరో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు..
ఇప్పటికే ఉన్న 2,185 ఎంబీబీఎస్ సీట్లకు అదనంగా మరో 2,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో..
మెడికల్ పీజీ సీట్ల సంఖ్య నాలుగేళ్లలో 966 నుంచి 1,767 కు పెంచిన జగనన్న ప్రభుత్వం..

① గవర్నమెంట్ మెడికల్ కాలేజీ - విజయనగరం



② గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, రాజమహేంద్రవరం






③ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ-ఏలూరు



④ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ - మచిలీపట్నం



⑤ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ - నంద్యాల



ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా వేగంగా అడుగులు ముందుకు వేస్తున్న జగనన్న ప్రభుత్వం..



మల్టీ/సూపర్ స్పెషాలిటీ అధునాతన వైద్యసేవలను ఉచితంగా అందుబాటులోకి తెస్తూ..
ప్రతి మెడికల్ కాలేజీలో రూ. 500 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణాలు..

- 8.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీచింగ్ హాస్పిటల్ ..
- 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ..
- 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హాస్టళ్లు, సిబ్బంది వసతి, క్రీడా ప్రాంగణాలు.. అత్యాధునిక సాంకేతికతతో లాబొరేటరీలు, డిజిటల్ లైబ్రరీ, సీసీ టీవీల ఏర్పాటు..

మరిన్ని వివరాల కోసం త్రిప్పి చూడండి

శ్రీమతి. విడదల రజిని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 15 సెప్టెంబర్ 2023 ఉదయం 10 గంటలకు విజయనగరం మెడికల్ కాలేజీని ప్రారంభించి మరో 4 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అదే ప్రాంగణం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్‌లో వీక్షించవచ్చు.

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

దేశానికే దిక్సూచిగా వైద్య ఆరోగ్య రంగంలో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు..

2024-25 లో ప్రారంభించే 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు


① పులివెందుల


② పాడేరు


③ మార్కాపురం


④ ఆదోని


⑤ మదనపల్లె



2025-26 లో ప్రారంభించే 7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు


① పార్వతీపురం


② నర్సీపట్నం


③ పాలకొల్లు



④ అమలాపురం


⑤ బాపట్ల


⑥ పిడుగురాళ్ల


⑦ పెనుకొండ

గిరిజన ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు


① సీతంపేట


② పార్వతీపురం


③ రంపచోడవరం


④ బుట్టాయిగూడెం


⑤ దోర్నాల

3 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు



① శ్రీపద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్, తిరుపతి


② మానసిక ఆరోగ్య కేంద్రం, కడప


③ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, పలాస

వైద్య రంగంలో కేవలం సంస్కరణలపై ఈ 50 నెలల్లో జగనన్న ప్రభుత్వం చేసిన, చేస్తున్న వ్యయం..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	46,12,892	9,194
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	19,74,040	1,190
డా. వైఎస్సార్ కంటి వెలుగు	1,13,35,651	127
104 సర్వీసులు	2,84,81,484	619
108 సర్వీసులు	35,50,644	589
తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్	3,27,289	71
"నాడు-నేడు" లో భాగంగా (అంచనా వ్యయాలు) 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం		8,480
ఇప్పటికే ఉన్న 11 మెడికల్ కళాశాలల ఆధునికీకరణకు		3,820
మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం (సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయగూడెం, దోర్నాల, కడప)		518
డా. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ (భవన నిర్మాణం, మరమ్మతులకు)		1,692
సి.హెచ్.సీలు, ఏరియా ఆసుపత్రుల నిర్మాణం, అభివృద్ధి పనులు		1,223
వైఎస్సార్ పెన్షన్ కానుక (దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు)	52,426	1,415
పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్		80
కరోనా సమయంలో ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సౌకర్యాలు		426
అంగన్‌వాడీలలో గ్రోత్ మోనిటరింగ్ పరికరాలు		44
మొత్తం వ్యయం దాదాపు రూ. 29,488 కోట్లు		

వైద్య ఆరోగ్య రంగంలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు..

డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ & ఆరోగ్య ఆసరా

- "డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ" పథకం ద్వారా క్యాన్సర్ తో సహా 3,257 వైద్య ప్రక్రియలకు ఉచితంగా చికిత్సలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వం... గతంలో ఇవి కేవలం 1,059 ప్రక్రియలకే పరిమితం..
- వైద్యం ఖర్చు రూ.1,000 దాటిన అన్ని చికిత్సలకు వర్తింపు.. ఆదాయ పరిమితిని 5 లక్షలకు పెంచడంతో రాష్ట్రంలోని దాదాపు 90 శాతం కుటుంబాలు ఇప్పటికే ఆరోగ్యశ్రీ పరిధిలో..
- అన్ని రకాల కాన్సర్ చికిత్సలు, పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు ఉచితంగా రెండు చెవులకూ కాక్లియర్ పరికరాలు వంటి అనేక సేవలు ఆరోగ్యశ్రీ ద్వారా..
- ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్న రోగి పూర్తిగా కోలుకొని తిరిగి పనుల్లోకి వెళ్లే వరకు వారి జీవనోపాధికి ఎలాంటి లోటు లేకుండా రోజుకు రూ. 225 చొప్పున నెలకు రూ. 5,000 వరకు.. డాక్టర్ల సూచన మేరకు ఎన్నిరోజులైనా "వైఎస్సార్ ఆరోగ్య ఆసరా" భృతి..

104, 108, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు

- ఆపత్కాలంలో ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేలా 1,704 వాహనాలు 104, 108 సేవల కోసం కొనుగోలు.. తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్‌తో కలిపి 2,204 వైద్య వాహనాలు అందుబాటులో..

WHO/GMP ప్రమాణాలు కలిగిన మందులు

- అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో WHO/GMP ప్రమాణాలు కలిగిన 562 మందులు అందుబాటులో ఉండేలా చర్యలు..

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం - ప్రివెంటివ్ కేర్‌లో నూతన అధ్యాయం

- గతంలోలా వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మీ ఊరిలోనే ఉచిత వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం.. ప్రతి మండలానికి ఒక పీహెచ్ సీ, ప్రతి పీహెచ్ సీలో ఇద్దరు డాక్టర్లు ఒక 104 వాహనంతో అనుసంధానం..
- ఒక డాక్టర్ పీహెచ్‌సీలో ఉంటే మరో డాక్టర్ తనకు కేటాయించిన గ్రామాల్లో డా॥ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌తో అనుసంధానం చేసుకుని వైద్యసేవలు అందిస్తారు..

వైద్య సిబ్బంది నియామకం

- వైద్య ఆరోగ్య శాఖలో ఏ ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదనే లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన ఖాళీల భర్తీ.. ఇప్పటి వరకు 53,126 మంది వైద్య సిబ్బంది నియామకం.. ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసేందుకు మెడికల్ రిక్రూట్ మెంట్ బోర్డు ఏర్పాటు..
- జాతీయస్థాయిలో 61 శాతం స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉంటే మన రాష్ట్రంలో అది కేవలం 3.96% మాత్రమే.. జాతీయస్థాయిలో నర్సుల పోస్టులు 27 శాతం భర్తీ కాకుండా వదిలేస్తే.. మన రాష్ట్రంలో 100% పోస్టుల భర్తీ..

"నాడు - నేడు" (ఆసుపత్రులు)

- రూ. 16,852 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు సమూలంగా మార్చి, పేదవాడికి కూడా ఆధునిక వైద్య సేవలు..
- ఇప్పటికే ఉన్న 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో - రూ. 3,820 కోట్ల వ్యయంతో NABH & NMC మార్గదర్శకాలకనుగుణంగా అప్‌గ్రేడ్.. అందుబాటులో అత్యాధునిక వైద్య పరికరాలు.. రూ. 756 కోట్లతో వివిధ మల్టీ స్పెషాలిటీ కోర్సుల్లో 630 పీజీ సీట్లు పెంపు..

వైఎస్సార్ పెన్షన్ కానుక (దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు)

- దీర్ఘకాలిక రోగులకు వ్యాధి తీవ్రతను బట్టి రూ.3,000 నుండి రూ.10 వేల వరకు పెన్షన్లు.. నెలనెలా మొదటి తారీఖున వారి గడప వద్దనే..

డా.వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ & అర్బన్ హెల్త్ క్లినిక్స్

- 2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున రాష్ట్రంలో మొత్తం 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్ లు.. 24 గంటలూ అందుబాటులో ఏఎన్ఎం, ఆశా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్.. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో.. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసే సెంటర్స్ గా డా. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్..
- పట్టణ ప్రాంతాల్లో 542 అర్బన్ పీహెచ్ సీలు..

ప్రతి ITDA పరిధిలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

- గిరిజనుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రతి ITDA పరిధిలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉండేలా రూ. 246.30 కోట్లతో సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయిగూడెం, దోర్నాలలో 5 గిరిజన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ల నిర్మాణం..

పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ & కడపలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

- ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం పలాసలో రూ. 80 కోట్లతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ యూనిట్ల నిర్మాణం దిశగా వేగంగా అడుగులు..
- రూ. 272 కోట్లతో కడపలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, క్యాన్సర్ ఆసుపత్రి, మానసిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం దిశగా వేగంగా అడుగులు..

క్రిటికల్ కేర్

- హృద్రోగ బాధితుల కోసం విశాఖపట్నం, గుంటూరు, కర్నూలులో 3 వైద్య హబ్ ల ఏర్పాటు.. వచ్చే ఏడాది నుంచి 177 సి హెచ్ సీలు, ఏరియా ఆసుపత్రుల్లో హృద్రోగ బాధితులకు వైద్య సేవలు..
- గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, కడప, కాకినాడ, అనంతపురంలో 6 క్యాన్సర్ కేర్ సెంటర్లు ఏర్పాటు దిశగా అడుగులు..

శ్రీమతి. విడదల రజిని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 176
శుక్రవారం 15-9-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'


జోరు కొనసాగించేందుకు...
సూపర్‌–4 చివరి మ్యాచ్‌లో నేడు బంగ్లాదేశ్‌తో భారత్‌ ఢీ - 13లో


సరికొత్త శిఖరంపై నిఫ్టీ
ఇంట్రాడేలో సెన్సెక్స్‌ కొత్త రికార్డు సెన్సెక్స్‌ 52 పాయింట్లు పైకి.. - 13లో


అది దురంహకార కూటమి
ప్రతిపక్ష ఇండియా కూటమిని దురంహకార కూటమిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు.
వివరాలు 6లో ▶


ఎన్‌జేడీజీతో అనుసంధానం
జాతీయ జ్యుడీషియల్‌ డేటా గ్రిడ్‌తో సుప్రీం కోర్టు కేసుల వివరాలు అనుసంధానించినట్లు సీజేఐ జస్టిస్‌ చంద్రచూడ్‌ తెలిపారు.
వివరాలు 6లో ▶


నిఫాపై నిరంతర నిఘా
ప్రాణాంతక నిఫా వైరస్‌ వ్యాప్తిని కట్టడి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కేరళ ప్రభుత్వం ప్రకటించింది.
వివరాలు 6లో ▶


మూడొంతుల మంది ఇంటికే..
తాను అధ్యక్షుడినైతే అమెరికా ప్రభుత్వంలోని ముప్పావు వంతు ఉద్యోగులను ఇంటికి పంపిస్తానని రిపబ్లికన్‌ నేత రామస్వామి అన్నారు.
వివరాలు 6లో ▶

వరల్డ్‌ క్లాస్‌ విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో ఇక రోజూ టోఫెల్‌ ట్రైనింగ్‌.. ప్రత్యేకంగా ఒక పీరియడ్‌

నిత్యం శిక్షణతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగవుతాయి: సీఎం జగన్‌

- ప్రభుత్వ పాఠశాలల ప్రొఫైళ్లను సంపూర్ణంగా మారుద్దాం
- ఐబీ సిలబస్‌ను దశలవారీగా ప్రవేశపెట్టేందుకు ప్రణాళిక రూపొందించాలి.. రెండో విడత ట్యాబ్‌ల పంపిణీకి సిద్ధం కావాలి
- డివైజ్‌ల వినియోగంపై సచివాలయాల డిజిటల్‌ అసిస్టెంట్లతో శిక్షణ
- జూనియర్‌ కాలేజీలుగా అప్‌గ్రేడెడ్‌ హైస్కూళ్లలో ఐఎఫ్‌పీ సహా అన్ని సౌకర్యాలుండాలి
- నాడు–నేడు రెండో విడత పూర్తయిన స్కూళ్లలోనూ డిసెంబర్‌ కల్లా ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌ టీవీలను సమకూర్చాలి
- తొలివిడత ముగిసిన చోట ఇప్పటికే 4,804 స్కూళ్లలో 30,213 ఐఎఫ్‌పీలు.. 6,515 స్కూళ్లలో స్మార్ట్‌ టీవీలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రొఫైళ్లను సంపూర్ణంగా మారుద్దామని అధికార యంత్రాంగానికి సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రైవేట్‌ స్కూళ్ల కంటే ఉన్నతంగా తీర్చిదిద్దుదామన్నారు. ఈ క్రమంలో ఇంగ్లిష్‌ మీడియం, డిజిటల్‌ తరగతి గదులు, నాడు–నేడు పనులతోపాటు ఇంటర్నేషనల్‌ బాకలారియేట్‌ (ఐబీ) సిలబస్‌ను అందుబాటులోకి తేవడం, నిత్యం టోఫెల్‌ శిక్షణా తరగతులను నిర్వహించడం ద్వారా ప్రభుత్వ స్కూళ్లను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణల అమలు, పురోగతిపై సీఎం జగన్‌ గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టోఫెల్‌ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం వారంలో 3 రోజుల పాటు మూడు తరగతుల చొప్పున శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు పేర్కొనగా
మిగతా 3వ పేజీలో ▶

వైద్య విద్యలో వందేళ్ల రికార్డు

ఒకేసారి ఐదు నూతన మెడికల్‌ కాలేజీలు అందుబాటులోకి
ఒక్కోచోట 150 చొప్పున అదనంగా 750 సీట్లు అందుబాటులోకి
నేడు విజయనగరం నుంచి ప్రారంభించనున్న సీఎం జగన్‌
రూ.8,480 కోట్లతో మొత్తం 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు
11లో

చంద్రబాబు పాత్ర సుస్పష్టం

'స్కిల్‌' ప్రాజెక్టులో సీమెన్స్‌ ప్రమేయమే లేదు

- ఆ సంస్థ పేరుతో బురిడీ కొట్టించారు
- సీఎం హోదాలో బాబు డిజిటల్‌ సంతకాలే సాక్ష్యం.. అగ్రిమెంట్‌లో తేదీ, లెటర్‌ నంబర్‌ కూడా లేదు
- థర్డ్‌ పార్టీకి ప్రభుత్వ సొమ్ము ఇవ్వొద్దన్న నిబంధనలు బేఖాతరు
- నాలుగు లేయర్లలో డబ్బుల పంపిణీ జరిగినట్టు ఆధారాలు.. ఏపీ సీఐడీ అడిషనల్‌ డీజీ సంజయ్‌ వెల్లడి
- ఈ కుట్ర పుణేలో వెలుగులోకి : ఏపీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

11లో


మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్‌ డీజీ సంజయ్, ఏఏజీ పొన్నవోలు

- రూ.కోటి విలువను రూ.250 కోట్లకు పెంచారు.. ఈ స్కామ్‌ ఫైళ్లను సెక్రటేరియట్‌లో తగులబెట్టారు

మదింపు బూటకం.. నివేదిక నాటకం

ఫ్యాక్ట్‌ చెక్‌

'స్కిల్‌' ప్రాజెక్ట్‌ను తాము పరిశీలించలేదన్న 'సీఐటీడీ'
- రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌ అని మేం నిర్ధారించలేదు
- రూ.371 కోట్ల విడుదలకు అనుమతించ లేదు
- సీఐడీ దర్యాప్తులో వెల్లడించిన సీఐటీడీ
- కేవలం పత్రాలు సమర్పించి పరిశీలించమన్నారు
- అప్పటికే నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల

- వివరాలు 14లో

న్యూస్‌రీల్‌

మద్యం కుంభకోణంలో కవితకు మళ్లీ ఈడీ నోటీసులు



ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. శుక్రవారం లేదా శనివారం విచారణ కోసం ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి రావాలని ఆదేశించింది. ఎమ్మెల్సీ కవితకు దర్యాప్తు సంస్థలు నోటీసులు జారీ చేయడం ఇది నాలుగోసారి. కాగా, తనకు పంపినవి ఈడీ నోటీసులు కాదని.. అవి మోదీ నోటీసులు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు.
వివరాలు 9లో ▸

హైదరాబాద్‌లో మరో డ్రగ్‌ కలకలం



హైదరాబాద్‌లోని మాదాపూర్‌ విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్‌ లివింగ్‌ అపార్ట్‌మెంట్‌లో దొరికిన తీగను లాగుతుంటే టాలీవుడ్‌ డ్రగ్‌ డొంక కదులుతోంది. తెలంగాణ స్టేట్‌ నార్కోటిక్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ వింగ్‌ అధికారులకు గత నెల 31న అక్కడి సర్వీస్‌ ఫ్లాట్‌లో చిక్కిన వారిలో ఫిల్మ్‌ ఫైనాన్సియర్‌ కె.వెంకట రమణారెడ్డి ఉండగా... గురువారం పట్టుబడిన వారిలో 'డియర్‌ మేఘ' చిత్ర దర్శకుడు అనుగు సుశాంత్‌ రెడ్డి ఉన్నారు.
వివరాలు 9లో ▸

రాష్ట్ర పండుగగా విశ్వకర్మ జయంతి



ప్రతి ఏడాది సెప్టెంబర్‌ 17న నిర్వహించుకునే విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో నంబర్‌ 24ను విడుదల చేసింది. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని అన్ని ప్రభుత్వ శాఖలకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తూ బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము గురువారం ఉత్తర్వులిచ్చారు.
వివరాలు 5లో ▸

ఇదండీ సంగతి



ముసుగు తీసిన చంద్రసేనాని

ఇన్నేళ్లూ చంద్రబాబు చాటున ఒదిగిన పవన్‌ కళ్యాణ్‌

- బాబు అరెస్టుతో పాత బంధానికి కొత్త రంగు
- 2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ పొత్తంటూ కొత్తపాట
- 2014 నుంచి గెస్ట్‌ రాజకీయ నేతగా బాబు చెంతనే..
- ఏనాడూ చంద్రబాబు తప్పులను ప్రశ్నించని పవన్‌
- 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చేందుకు బయటకొచ్చి నాటకం.. వైఎస్సార్‌సీపీ చేతిలో చావుదెబ్బ తినడంతో మళ్లీ లోపాయికారి బంధం
- ఇప్పుడు ఒంటరిగా పోటీ చేస్తే వైఎస్సార్‌సీపీని ఆపలేమని బెంబేలు.. బీజేపీ కూడా తమ వెంట వస్తుందని ఆశిస్తున్నామంటూ సన్నాయి నొక్కులు
- తాము అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదలమని హెచ్చరిక
- రాజమండ్రి జైల్లో బాబుతో 40 నిమిషాలపాటు ములాఖత్‌


చంద్రబాబుతో ములాఖత్‌ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న పవన్‌. చిత్రంలో టీడీపీ నేత నారా లోకేశ్‌

8లో

విడిపోతేనే కదా మళ్లీ కలవడానికి?
టీడీపీ, జనసేన పొత్తుపై సజ్జల ఎద్దేవా

ప్యాకేజీ కోసమే పొత్తు
పవన్‌పై మంత్రి చెల్లుబోయిన వేణు ధ్వజం

డ్రామాకు తెరపడింది
వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జక్కంపూడి

అది ములాఖత్‌ కాదు.. మిలాఖత్‌
మాజీ మంత్రి పేర్ని నాని

8లో

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపెయిన్‌

5 దశల్లో కార్యక్రమం అమలు
శుక్రవారం నుంచి ఇంటింటికీ వాలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు
కార్యక్రమంపై ప్రజలకు పూర్తి వివరాలు
ఆరోగ్యశ్రీ కార్యక్రమంపైనా అవగాహన
ఆ తర్వాత ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వ సిబ్బంది ఆరా.. ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు
ప్రజలకు వివిధ రకాల పరీక్షలు, మందులు
అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు తరలింపు



- వివరాలు 9లో

అప్పులు తీర్చేస్తున్నారు



ప్రభుత్వ తోడ్పాటుతో సకాలంలో రుణాలు చెల్లించేస్తున్న రైతులు
10లో

- గడువులోగా చెల్లించే రైతులకు సర్కారు సున్నా వడ్డీ రాయితీ
- ఫలితంగా మొండి బకాయిలు తగ్గుముఖం
- 2019–20లో వ్యవసాయ రుణాల్లో ఇవి 3.57 శాతం
- 2022–23 నాటికి అవి 2.60 శాతానికి తగ్గుదల.. మరోవైపు.. రైతులకు ఏటా వ్యవసాయ రుణాల మంజూరు పెరుగుదల

కొనసాగుతున్న అల్పపీడనం

రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌ తీరాలపై కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ మీదుగా పయనించనుంది. వీటి ఫలితంగా రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో కొన్ని చోట్ల, రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తీర ప్రాంతాల్లో గంటకు 40–45, గరిష్టంగా 55 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.

రాక్షస మూక

లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిన 'ద రెసిస్టెన్స్‌ ఫ్రంట్‌'
ఉగ్రమూకకు పాక్‌ సైన్యం, 'ఐఎస్‌ఐ' అండదండలు
భారత భద్రతా సిబ్బంది, జమ్మూకశ్మీర్‌ మైనార్టీలపై టీఆర్‌ఎఫ్‌ గురి
6లో


Greenchef®
FESTIVE DHAMAAKA
700 WATTS
1.8 LITRES
5 YEAR WARRANTY
EXTRA STAINLESS STEEL COOKING PAN FREE
SPECIAL LAUNCH PRICE
₹2,599
(MRP: ₹5,399)
STARC RICE COOKER
SPECIAL PRICE ₹2,199 (MRP: ₹3,499)
FREE TAWA 280 MM
CLASSIC STAINLESS STEEL COOKER 2 IN 1 COMBO
3L COOKER + 2L PAN
SPECIAL PRICE ₹3,099 (MRP: ₹5,698)
FREE TAWA 280 MM
CLASSIC CURVE STAINLESS STEEL COOKER COMBO
3L COOKER + 5L COOKER
SPECIAL PRICE ₹2,299 (MRP: ₹4,499)
750 WATTS
5 YEAR WARRANTY
2 YEAR WARRANTY
AVAILABLE IN 2 COLOURS:
GLOSSY MIXER GRINDER
USER-FRIENDLY JAR HANDLES
FINEST QUALITY 22G STAINLESS STEEL JAR SET
UNBREAKABLE ABS BODY
SPECIAL PRICE ₹2,699 (MRP: ₹4,499)
JUMBO BURNER FOR FASTER COOKING
2 YEAR WARRANTY
ORBIT DOUBLE BURNER GLASSTOP
INNOVATIVE LEGS FOR FIRMER GRIP
TOUGHENED GLASS FOR DURABILITY
BAKELITE KNOB
SPECIAL PRICE ₹4,999 (MRP: ₹12,990)
900 m³/hr SUCTION POWER
AKENO BK 60CM CHIMNEY
BAFFLE FILTER FOR SMOKE-FREE COOKING
STURDY & DURABLE MOTOR WITH WIDE RANGE OF AIR FLOW
SPECIAL PRICE ₹9,999 (MRP: ₹16,999)
1350 m³/hr SUCTION POWER
FREE KETTLE WITH EVERY CHIMNEY
BLACK PEARK PRO 60CM CHIMNEY
MOTION SENSOR
3-SPEED TOUCH
FILTER-LESS TECHNOLOGY
SPECIAL PRICE ₹499 (MRP: ₹1,999)
1.5 LITRES
1 YEAR WARRANTY
SWIFT STAINLESS STEEL KETTLE
MIRROR STAINLESS STEEL BODY
360° ROTATING BASE
CONVENIENT BUTTON SWITCH
AUTO SWITCH OFF
SPECIAL PRICE ₹1,399 (MRP: ₹2,799)
6 MONTHS WARRANTY
FIRST TIME IN INDIA
1 YEAR WARRANTY
IGNITE INDUCTION COOKTOP
KEEP WARM TECHNOLOGY
ANTI-MAGNETIC WALL
PRESET TIMER
AUTOMATIC VOLTAGE REGULATOR
Toll Free Number 1800 103 7477
Missed Call Service +91 7848992244
greenchef.in
Follow us on
PROUDLY MADE IN INDIA
KRISHNA DISTRIBUTOR: Sri Tejasri Sai Agencies, Raja: 9440184707, Rangarao (ASM): 9440629413,
Trinadh Reddy (ASM): 9959955782
FOR TRADE & CORPORATE ENQUIRES: Babji (SBH): 9030036003

21 నుంచి శాసనసభ, మండలి సమావేశాలు

గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్.. కీలక బిల్లులకు ఆమోదం



సాక్షి, అమరావతి: ఈ నెల 21వ తేదీ నుంచి శాసనసభ, శాసనమండలి సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. 21వ తేదీ ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆదేరోజు శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై.. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే అంశాలపై చర్చించాలనే విషయాన్ని ఖరారు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను శాసనసభలో బిల్లుల రూపంలో ప్రవేశపెట్టి చట్ట సవరణలు చేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఈ సమావేశాల్లోనే వ్యవసాయ పరిస్థితులు తదితర అంశాలను చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది.

'కాణిపాకం' బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం



సాక్షి, అమరావతి/యాదమరి(చిత్తూరు జిల్లా): ఈ నెల 18 నుంచి జరగనున్న కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం వైఎస్ జగన్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశ్ ఆహ్వానించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం వారు సీఎంను కలిసి ఆహ్వానపత్రిక, స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. వేద పండితుల వేదాశీర్వచనం అందజేశారు.

సీఎంను కలిసిన ఏపీజీఈఎఫ్ నూతన కార్యవర్గం



సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ని ఏపీజీఈఎఫ్ నూతన కార్యవర్గం కలిసింది. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎంను కలిసిన వారిలో ఏపీజీఈఎఫ్ గౌరవ చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, కో చైర్మన్ చల్లా చంద్రయ్య, సెక్రటరీ జనరల్ అరవపాల్, కార్యవర్గ సభ్యులు, ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహా తదితరులున్నారు.

వరల్డ్ క్లాస్ విద్య

▶ మొదటి పేజీ తరువాయి

ఇకపై ప్రతి రోజూ టోఫెల్ శిక్షణకు ఒక పీరియడ్ కేటాయించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. తద్వారా విద్యార్థులు క్రమంగా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్‌ను ప్రవేశపెట్టడంపై సంపూర్ణ మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. దశలవారీగా ఐబీ సిలబస్‌ను అమలు చేసేందుకు పూర్తి స్థాయిలో అధ్యయనం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం అనుసరిస్తున్న సిలబస్‌ను ఐబీతో అనుసంధానిస్తూ ఈ ప్రక్రియ సజావుగా, సులభంగా జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



విద్యాశాఖలో సంస్కరణల అమలు, పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ట్యాబ్‌ల పంపిణీ..

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు, తరగతి ఉపాధ్యాయులకు రెండో విడత ట్యాబుల పంపిణీకి సిద్ధం కావాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లతో డివైజ్‌ల వినియోగంపై విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలి. నాడు–నేడు రెండో దశ పనులు పూర్తయిన అన్ని పాఠశాలల్లో కూడా డిసెంబర్ కల్లా ఐఎఫ్‌పీ బోర్డులు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు పూర్తి కావాలి. జూనియర్ కాలేజీలుగా మార్చేందుకు గుర్తించిన హైస్కూళ్లలో ఐఎఫ్‌పీ సహా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి.

అత్యంత నాణ్యంగా ఆహారం..

మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా పౌష్టికాహారాన్ని అందించేందుకు అధికంగా నిధులు వెచ్చిస్తున్నాం. ఆరోగ్యకరమైన, రుచికరమైన మెనూ తీసుకొచ్చాం. రాగిజావ అందిస్తున్నాం. వీటిల్లో ఏ ఒక్కటీ క్వాలిటీ తగ్గకూడదు. విద్యార్థులకు పెట్టే భోజనం నూటికి నూరుశాతం నాణ్యతగా ఉండాల్సిందే. పాఠశాలల్లో విద్యార్థులు తినే భోజనంపై ప్రతి రోజూ అధికారుల పర్యవేక్షణ మరింత మెరుగ్గా ఉండాలి. ఈమేరకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) పాటించాలి. బలహీనంగా, రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నిత్యం పౌష్టికాహారం, సమయానికి మందులు అందేలా చర్యలు తీసుకోవాలి.

ఫలించిన స్పెషల్ డ్రైవ్

ప్రాథమిక విద్యలో 100% పిల్లలు బడిలోనే..

రాష్ట్రంలో చిన్నారులను విద్యవైపు నడిపించేలా చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ సత్ఫలితాలను ఇచ్చిందని అధికారులు సమీక్షలో ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తెచ్చారు. ప్రాథమిక విద్యలో నూటికి నూరు శాతం పిల్లలు బడిలోనే ఉన్నారని వివరించారు. సీనియర్ సెకండరీ విభాగంలో 96.94 శాతం మంది, హయ్యర్ సెకండరీ విభాగంలో 74.9 శాతం స్కూళ్లలోనే ఉన్నట్టు తెలిపారు. అమ్మఒడి పథకంతోపాటు 10, 12వ తరగతులు ఫెయిల్ అయిన విద్యార్థులకు రీ అడ్మిషన్, స్కిల్ సెంటర్లలో చేర్పించి వారికి ఓపెన్ స్కూల్ అడ్మిషన్, వలంటీర్లు, సచివాలయాల ద్వారా నిర్వహించిన ప్రచారంతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు ప్రస్తుతం 83,52,738 మంది విద్య అభ్యసిస్తున్నట్టు వెల్లడించారు. తొలి విడతగా నిర్దేశించుకున్న మేరకు 4,804 స్కూళ్లలో 30,213 ఐఎఫ్‌పీ ప్యానళ్లు, 6,515 స్కూళ్లలో స్మార్ట్ టీవీలను బిగించామని అధికారులు వివరించారు. ఇప్పటికే ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల వినియోగింపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు.

91.33 శాతం మంది ఇంగ్లీషు మీడియంలోనే పరీక్షలు

ఐఎఫ్‌పీ ప్యానళ్లు ఏర్పాటు చేసిన చోట రెండు రకాల ఇంటర్నెట్ సర్వీసులు అందిస్తున్నట్లు అధికారులు చెప్పారు. స్మార్ట్ ఫోన్‌లో, ఫోన్ ఎస్డీ కార్డులో, యూట్యూబ్‌లో, ట్యాబుల్లో, ఐఎఫ్‌పీలో, అధీకృత వెబ్‌సైట్లలో, ఇ–పాఠశాల డీటీహెచ్‌ల్లో ఇలా ఎందులోనైనా ఒకే విధమైన పాఠ్యప్రణాళిక, ఒకే పాఠ్యాంశాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. ఆగస్టులో నిర్వహించిన మొదటి అసెస్మెంట్‌లో మూడో తరగతి నుంచి 9 వతరగతి వరకూ దాదాపు 91.33 శాతం మంది పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాశారని చెప్పారు.

6 నుంచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర అత్యాధునిక టెక్నాలజీపై సమీక్షలో అధికారులు పలు అంశాలను సీఎంకు నివేదించారు. ఆరో తరగతి నుంచి కృత్రిమ మేధను ప్రత్యేక సబ్జెక్టుగా బోధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణ, బోధన కార్యక్రమాలకు సమీపంలోని ఇంజనీరింగ్ కాలేజీలను అనుసంధానం చేయడంతో పాటు ఏఐపై పాఠ్యాంశాలు బోధించేందుకు ప్రత్యేకంగా యాప్ రూపొందిస్తున్నట్టు వివరించారు.

అవసరమైన చోట అదనపు గదులు, సదుపాయాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో రెండో విడత నాడు–నేడు పనులు చురుగ్గా జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలను అందుబాటులోకి తెస్తుండగా వాటిల్లో ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 679 మండలాలకుగాను 473 మండలాల్లో బాలికలు, కో–ఎడ్యుకేషన్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. మిగిలిన చోట్ల హైస్కూళ్లను ప్లస్ టూగా మార్చేందుకు జాబితా రూపొందిస్తున్నామన్నారు. అవసరమైన మేరకు అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. సమీక్షలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్లు ఎస్.సురేష్, కాటమనేని భాస్కర్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ నిధి మీనా, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సి.ఎన్ దీవాన్‌రెడ్డి, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపికబురు

వంద శాతం గ్రాస్ వేతనం చెల్లించేలా ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో 2018కి ముందు కాంట్రాక్ట్ ప్రాతిపదికన శాంక్షన్ పోస్టుల్లో నియమితులైన సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, పారా మెడికల్ సిబ్బందికి వంద శాతం గ్రాస్ వేతనం (పే+హెచ్‌ఆర్‌ఏ+డీఏ) పునరుద్ధరిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ హయాంలో వంద శాతం గ్రాస్ వేతనాన్ని రద్దు చేసి.. కన్సాలిడేట్ పేకి కుదించారు. ఈ నేపథ్యంలో వారంతా 2019కు ముందు ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వంద శాతం గ్రాస్ వేతనం వర్తింపజేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ హామీని నెరవేరుస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. 2018 తర్వాత నియమించబడి అర్హత ఉన్న ఉద్యోగులకు ఈ వేతనాలు వర్తింపజేసేలా ప్రతిపాదనలు పంపించాల్సిందిగా విభాగాధిపతులను ఆదేశించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



పారా మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వంద శాతం గ్రాస్ వేతనం వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. టీడీపీ హయాంలో వంద శాతం గ్రాస్ వేతనం రద్దు చేసి మాకు అన్యాయం చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 3,914 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుంది. కేడర్‌ను బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతనాలు పెరుగుతాయి. జీవితాంతం సీఎంకు రుణపడి ఉంటాం.

– రత్నాకర్, ప్రెసిడెంట్,
ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ పారా మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

అమెరికా పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- జాహ్నవి మరణాన్ని అపహాస్యం చేసిన ఘటనను అంతా ఖండించాలి
- భారతీయుల్లో విశ్వాసం కలిగించేలా చర్యలకు సిఫార్సు చేయండి
- భారత్‌లోని అమెరికా రాయబారితో మాట్లాడి తగిన సూచనలివ్వండి
- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం వైఎస్ జగన్ లేఖ

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లాకు చెందిన కందుల జాహ్నవి మరణాన్ని అపహాస్యం చేసిన అమెరికా పోలీసుపై కఠిన చర్యలు తీసుకునే విధంగా సిఫార్సు చేయాలని కోరుతూ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సియాటిల్ క్యాంపస్‌లో మాస్టర్స్ డిగ్రీ చదవడానికి వెళ్లిన జాహ్నవి.. ఈ ఏడాది జనవరి 23న రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీస్ వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే కన్నుమూసింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వం వెంటనే జాహ్నవి కుటుంబాన్ని, అమెరికాలోని తెలుగు అసోసియేషన్‌ను సంప్రదించి ఆమె మృతదేహాన్ని కర్నూలు జిల్లాలోని స్వగ్రామానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే జాహ్నవి మరణంపై దర్యాప్తు చేస్తున్న సియాటిల్ పోలీస్ అధికారి ఆమె మరణాన్ని అపహాస్యం చేస్తూ మాట్లాడిన వీడియో ఇటీవల బయటకు వచ్చింది. విద్యార్థి జీవితాన్ని తక్కువ చేసి మాట్లాడటంపై తీవ్రంగా కలత చెందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. అమెరికా పోలీసు అధికారిపై చర్యలకు సిఫార్సు చేయాల్సిందిగా కోరుతూ కేంద్రమంత్రికి లేఖ రాశారు. నాన్ అమెరికన్ల పట్ల అలాంటి అధికారుల అమానవీయ ప్రవర్తనను అందరూ ఖండించాల్సిందిగా ఆ లేఖలో పేర్కొన్నారు. భారతీయులలో విశ్వాసం, భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. తప్పు చేసిన పోలీసు అధికారిపై కఠిన చర్యలకు సిఫార్సు చేయడమే కాకుండా.. ఈ విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలన్నారు. అమెరికాలోని సంబంధిత అధికారులతో తక్షణమే చర్చించి, సమగ్ర దర్యాప్తు ద్వారా వాస్తవాలు వెలికితీసి మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఇందుకు భారత్‌లోని అమెరికా రాయబారితో చర్చించి తగిన సూచనలివ్వాల్సిందిగా సీఎం ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి చర్యలు తీసుకుంటారన్న ఆశాభావాన్ని లేఖలో సీఎం వ్యక్తం చేశారు.

జనవరిలో రామాయపట్నం పోర్టు ప్రారంభం

- ఈ ఏడాదిలో 4 ఫిషింగ్ హార్బర్లు ప్రారంభం
- ఏపీఐఐసీ వీసీ, ఎండీ ప్రవీణ్‌కుమార్



రామాయపట్నం పోర్టులో బల్క్ కార్గో బెర్తు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ప్రవీణ్ కుమార్

సాక్షి, అమరావతి: పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నామని ఇందులో భాగంగా వచ్చే 4 నెలల్లో ఒక పోర్టును, నాలుగు ఫిషింగ్ హార్బర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో, ఏపీఐఐసీ వీసీ, ఎండీ ప్రవీణ్ కుమార్ చెప్పారు. రామాయపట్నం పోర్టులో కార్గో బెర్త్ పనుల్ని డిసెంబర్ నాటికి పూర్తిచేసి జనవరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా సుమారు రూ.20 వేలకోట్లతో నాలుగు పోర్టులు (రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ సెజ్ పోర్టు), 10 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆయన గురువారం నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తొలిదశలో నిర్మాణం చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లను ఈ ఏడాదిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత జువ్వలదిన్నె, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్లను ప్రారంభిస్తామన్నారు. నాలుగు పోర్టులతో పాటు వాటి పక్కనే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు.

30న ఏపీఆర్‌ఎస్‌ఏ సంఘం రాష్ట్రశాఖ ఎన్నికలు

- రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొప్పరాజు తదితరులు

మచిలీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఎన్నికలు ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు గురువారం మచిలీపట్నంలోని రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియ విజయవాడ ఐఎంఏ హాలు సమీపంలోని రెవెన్యూ భవన్‌లో జరుగుతుందన్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తారని చెప్పారు. ఎన్నికల అధికారిగా పీవీ కృష్ణారావు వ్యవహరిస్తారని చెప్పారు. అక్టోబరు 1న కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, సంఘం 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయకుమార్ , రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కె.సతీష్, ఎంవీ శ్యామ్‌నాథ్, పి.ఆంజనేయప్రసాద్, కె.శంకర్, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంలో మహిళల పాత్ర అమోఘం

సీఎస్‌తో సమావేశంలో పర్యావరణ పరిరక్షకురాలు సునీతా నారాయణ్



సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల) మహిళల పాత్ర అమోఘమని ప్రముఖ పర్యావరణ పరిరక్షకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సునీతా నారాయణ్ కితాబిచ్చారు. గత రెండు రోజులుగా అనంతపురంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన ఆమె గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడారిలాంటి అనంతపురం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అద్భుతంగా సాగవుతోందని చెప్పారు. కనీసం 20 సెంట్ల భూమిలో పేదలు కూరగాయలు పండించి అమ్ముకునేందుకు అమలు చేస్తున్న ఏటీఎం మోడల్ నిరుపేద రైతులను ఎంతో ఆదుకుంటోందని తెలిపారు. ఒక్కో రైతు నెలకు రూ.25 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఏర్పడటంతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. దానిమ్మ,, బొప్పాయి, మునగ తదితర పంటలు బాగా సాగవుతున్నాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఎంతో సమర్థంగా పనిచేయడం విశేషమని పేర్కొన్నారు. సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ తాను టీటీడీ ఈవోగా పనిచేసినప్పుడు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండే శనగలను టీటీడీ కొనుగోలు చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్, సీఈవో బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.





> నీ ధనాన్ని వృథా ఖర్చులలో వ్యర్థం చేయకు.
> నిశ్చయంగా, వ్యర్థమైన ఖర్చులు చేసేవారు షైతానుల సోదరులు.
> షైతాన్ తన ప్రభువు పట్ల కృతఘ్నుడైనవాడు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 15 సెప్టెంబర్ 2023

అప్రమత్తత అవసరం

మరపునపడిందనుకున్న ఆ పేరు మళ్ళీ వార్తల్లోకి వచ్చింది. మనిషి మెదడును దెబ్బ తీసే ప్రాణాంతక నిపా వైరస్ (ఎన్ఐవీ) మరోసారి దేశంలో జడలు విప్పుతోంది. వస్తూనే కేరళలో ఇద్దరి ప్రాణాలు బలి తీసుకొని, పాజిటివ్ వచ్చిన మరికొందరి ఆరోగ్యాన్ని అయోమయంలోకి నెట్టి, సన్నిహితంగా మెలిగిన మరో 800 మందిపై వైద్యపర్యవేక్షణ పెట్టాల్సిన పరిస్థితి తెచ్చింది. వీరిలో 77 మంది ప్రమాదస్థితిలో ఉన్నారనీ, వైరస్ సోకినవారిలో 155 మంది ఆరోగ్య కార్యకర్తలూ ఉన్నారనీ వస్తున్న వార్త ఆందోళన పెంచుతోంది. నిపా సోకితే సహాయక చికిత్సే తప్ప, రోగాన్ని తగ్గించే మందులు కానీ, నివారించే టీకా కానీ ఇప్పటిదాకా లేకపోవడమే పెద్ద సమస్య. కోళిక్కోడ్ జిల్లాలోని 9 గ్రామ పంచాయతీలను ఇప్పటికే కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించి, స్కూళ్ళు – ఆఫీసులు – ప్రజారవాణాకు సెలవిచ్చి, సభలూ సమావేశాలపై నియంత్రణలు పెట్టాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కేరళలో మొదలైన ఈ ప్రకంపనలు ఇప్పుడు దేశం మొత్తాన్నీ అప్రమత్తం చేస్తున్నాయి.

కలుషిత ఆహారం, రోగితో సాన్నిహిత్యం ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించడం నిపా వైరస్ స్వభావం. 1998లో తొలిసారిగా మలేసియా, సింగపూర్లలో పందుల పెంపకందార్లలో, వాటితో సన్నిహితంగా మెలిగే ఇతరుల్లో ఈ వైరస్ తొలిసారి బయటపడింది. అప్పట్లో 300 పైచిలుకు మందికి వైరస్ సోకితే, వంద మందికి పైగా మరణించారు. ఆపై అది వేలాది మైళ్ళు ప్రయాణించి, వివిధ దేశాలకు విస్తరించడం, వైరస్ సోకినవారిలో 72 నుంచి 86 శాతం మంది మరణించడం సంచలనమైంది. వైరస్ సోకిన గబ్బిలాలు, పందుల శరీరద్రవాల ద్వారా మనుషులకిది వ్యాపిస్తుందట. నిపా సోకితే జ్వరం, శ్వాసకోశ ఇబ్బందులు, తలనొప్పి, వాంతులతో మొదలై పరిస్థితి తీవ్రమైతే మెదడువాపు, మూర్ఛలతో రోగి కోమాలోకి వెళ్ళే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ మాట. 1998 – 2015 మధ్య 600కు పైగా కేసులు వచ్చాయని అది లెక్క తేల్చింది.

ఈ మాయదారి వైరస్ మన దేశంలో పంజా విసరడం ఇదేమీ తొలిసారి కాదు. గడచిన అయిదేళ్ళలో ఇది నాలుగోసారి. మెదడు మీద దాడి చేసే ఈ అనారోగ్య భూతం 2018 మేలో మొదటిసారి వచ్చినప్పుడు దానిని కట్టడి చేసేలోగా వైరస్ సోకిన 23 మందిలో 21 మంది మరణించారు. ఆ తరువాత 2019, 2021ల్లో కూడా కేరళ తీరాన్ని ఈ వైరస్ తాకింది. మలబారు సీమలో బయటపడ్డ ఈ తాజా నిపా కేసులకు బంగ్లాదేశ్ వేరియంట్ కారణమని గుర్తించారు. మిగతావాటితో పోలిస్తే ఈ వేరియంట్ వ్యాప్తి తక్కువే అయినా, సోకినవారిలో సగటున నూటికి 70 మంది మరణిస్తున్నారన్న గణాంకాలు గుబులు రేపుతున్నాయి. రోగులకు సన్నిహితంగా మెలిగినవారు ఐసోలేషన్‌లోకి వెళ్ళడం, జనమంతా మాస్కులు ధరించి జాగ్రత్తగా ఉండడం తప్పనిసరి కార్యాచరణ అయింది.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఈ గబ్బిలపు వైరస్ పదేపదే విరుచుకుపడే ప్రమాదం ఎక్కువని మేలో రాయిటర్స్ పరిశోధన తేల్చింది. విచ్చలవిడిగా అడవుల నరికివేత, ఇష్టారాజ్యపు పట్టణీకరణ, ఫలితంగా వన్యప్రాణులతో మానవ సంఘర్షణ – వీటన్నిటి పర్యవసానం ఇదని ఆ పరిశోధన గుర్తించింది. ఇక, మన దేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక సహా 8 రాష్ట్రాల్లోని గబ్బిలాల్లో ఈ ప్రాణాంతక వైరస్ ఛాయలున్నట్టు ఈ ఏడాది జూలైలో భారతీయ వైద్య పరిశోధనా మండలి అధ్యయనం సైతం నిర్ధరించింది. అయితే, కేరళపైనే తరచూ ఈ వైరస్ దాడికి కారణం – జనసాంద్రత, భౌగోళిక పరిస్థితులు, వానలంటూ రకరకాల ప్రచారాలున్నాయి. కచ్చితమైన కారణాల్నింకా కనిపెట్టాల్సి ఉంది. ప్రస్తుతానికి కేంద్ర బృందం కేరళ వెళ్ళి సంక్షోభంలో సాయపడుతోంది.

నిపాకు ప్రధాన కారణమని భావిస్తున్న ఫ్రూట్ బ్యాట్స్ (పండ్లను కొట్టే గబ్బిలాల) సంఖ్య కేరళలో ఎక్కువైతే కావచ్చు కానీ, వాటి నిర్మూలన కుదరదు. కాబట్టి, ఒకేచోట, ఒకేలా కాకపోయినా ఏటా నిపా వైరస్ ముప్పు తప్పదని గ్రహించి, కేరళ సహా అన్ని రాష్ట్రాలూ జాగ్రత్తపడాలి. జంతువుల నుంచి మానవులకు సోకే ఇలాంటి ప్రాణాంతక ఇన్ఫెక్షన్ల ఆనుపానులు పసిగట్టేందుకు మహమ్మారులపై పరిశోధన అవసరం. కానీ, కేరళే కాదు... కేంద్రం కూడా నిపాపై తగినంత శ్రద్ధ చూపలేదనే చెప్పాలి. పుణేలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ తరహాలో తిరువనంతపురంలో అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పినా, అది ఇప్పటికీ పూర్తిగా కార్యాచరణలోకి దిగలేదు. అంతకంతకూ పెరుగుతున్న సాంక్రమిక వ్యాధుల రీత్యా తక్షణమే ఆ సంస్థ సేవలపై దృష్టి సారించాలి. 2018 నిపా తాకిడిలో, తర్వాత కరోనా కాలంలో సమర్థనీయంగా పనిచేసిన కేరళ మరోసారి కృతనిశ్చయం చూపాలి.

ఇప్పటి వరకు ఇండియా, బంగ్లాదేశ్, సింగపూర్, మలేసియా, ఫిలిప్పీన్స్ లాంటి ఆసియా దేశాలకే ఈ వైరస్ పరిమితమైంది. ప్రపంచంలోని ఇతర దేశాలకు ఇది విస్తరించకపోవడం అదృష్టమే. కానీ, భవిష్యత్తులో విస్తరించదనే నమ్మకం ఏమీ లేదు. వైరస్‌ల విజృంభణలు, ప్రాణాంతక రోగాలు... ప్రపంచానికి కొత్త కాకపోవచ్చు. అయితే, చికిత్స లేని రోగాలు, వైరస్‌లపై శాస్త్రీయ పరిశోధనలతో ప్రపంచ దేశాలన్నీ సమష్టిగా పోరాడాల్సిన అవసరాన్ని తాజా నిపా కేసులు గుర్తుచేస్తున్నాయి. నిన్న కాక మొన్న కరోనా కట్టడిలో అలాంటి పోరే మానవాళికి మేలు చేసిందని మరచిపోరాదు. అయితే, అందుకై పరిశోధన – అభివృద్ధి విభాగానికి కావాల్సిన వనరుల్ని అందించడం తక్షణ అవసరం. ఈలోగా చేతుల శుభ్రత, మాస్కుధారణ, స్వచ్ఛమైన ఆహారాన్నే భుజించడం సదా ఆరోగ్యమనీ, అది మన చేతుల్లోని పని అనీ అందరం గుర్తించాలి. ఎందుకంటే... చికిత్స కన్నా నివారణ, భయం కన్నా అప్రమత్తతే పరమౌషధం!

బలమైన ప్రభుత్వం ఓ అపోహ!

అభిప్రాయం



డాక్టర్ రాజీదీప్ పాకనాటి

ఒకే పార్టీ, ఒకే నాయకుడి ద్వారా మాత్రమే ఉత్తమ పాలన అందుతుందనేది అపోహ. సంకీర్ణ ప్రభుత్వాలు 'బలహీనమైనవి' అనీ, అవి నిర్ణయాలు తీసుకోలేవనీ ఈ అపోహ జనాన్ని నమ్మేలా చేస్తుంది. కానీ చట్టాలను ఆమోదించడంలో ఏకీకృత లేదా సంకీర్ణ ప్రభుత్వాల మధ్య ఎటువంటి తేడా లేదని చరిత్ర చెబుతోంది. అమెరికాలో మహా మాంద్యం తర్వాత, 'న్యూ డీల్'(1933)లో భాగంగా సంక్షేమ విధానాలను అమలు చేశారు. సంపూర్ణ మెజారిటీ లేని ప్రభుత్వ హయాంలోనే ఇది జరిగింది. 1980ల చివరి నుండి భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు తప్పనిసరి అయిపోయాయి. ఈ కాలంలోనే భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. నిర్ణయాత్మకమైన పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేశారు.

భారత్ వంటి విశాలమైన దేశానికి ఒకే పార్టీ, ఒకే నాయకుడి ద్వారా మాత్రమే ఉత్తమ పాలన అందుతుందనే అపోహ ఆధారంగా, ప్రస్తుత కేంద్రప్రభుత్వ పాలనను తిరిగి ఎన్నుకోవడం అనే ప్రబలమైన కథనం ఆధారపడి ఉంది. 'బలమైన ప్రభుత్వం' అనే ఈ అపోహ– బహుళ పార్టీ, సంకీర్ణ ఆధారిత ప్రభుత్వాలు 'బలహీనమైనవి' అనీ, అవి నిర్ణయాలు తీసుకోలేవనీ లేదా చట్టాలను ఆమోదించలేవనీ నమ్మేలా చేస్తుంది. అయితే, రాజనీతి శాస్త్ర రంగంలోని పరిశోధనలు మనకు భిన్నమైన చిత్రణను చూపుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే ప్రధానంగా మూడు రకాల ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉనికిలో ఉన్నాయి. అవి: అధ్యక్ష తరహా, పార్లమెంటరీ, సంఘటిత (కాన్‌సోషియేషనల్) ప్రభుత్వాలు. ఈ ప్రతి ప్రభుత్వ రూపంలోనూ, బహుళ పార్టీ ప్రభుత్వాలు లేదా సంకీర్ణ ప్రభుత్వాలు స్థిరంగా ఉండటమే కాకుండా పౌరుల సంక్షేమం విషయంలో కూడా మెరుగ్గా ఉన్నాయని సాక్ష్యాధారాలు చూపుతున్నాయి.

అమెరికా, అధ్యక్ష వ్యవస్థను అనుసరిస్తుంది. ఈ వ్యవస్థలో అధ్యక్షుడిని నేరుగా కార్యనిర్వాహక అధిపతిగా ఎన్నుకుంటారు. అయితే పన్నులు పెంచడం, డబ్బు ఖర్చు చేయగల సామర్థ్యం అనే ఖజానా అధికారాలను ప్రతినిధుల సభకు కట్టబెట్టారు. డేవిడ్ మేహ్యూ రాసిన 'డివైడెడ్ వియ్ గవర్న్: పార్టీ కంట్రోల్, లా మేకింగ్ అండ్ ఇన్వెస్టిగేషన్స్, 1946–2002' అనే పుస్తకంలో, ఒకే రాజకీయ పార్టీ అటు అధ్యక్ష పదవినీ, ఇటు కాంగ్రెస్‌నీ నియంత్రించినప్పుడు మాత్రమే అమెరికన్ జాతీయ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందనే సాధారణ అపోహను తొలగించారు. చట్టాలను ఆమోదించడంలో ఏకీకృత పార్టీ లేదా వివిధ పార్టీల మధ్య ఎటువంటి తేడా లేదని ఈ పుస్తకం వెల్లడిస్తుంది. నిజానికి, మహా మాంద్యం (గ్రేట్ డిప్రెషన్) తర్వాత, అంటే 1933లో కొత్త ఒప్పందం (న్యూ డీల్)లో భాగంగా సంక్షేమ ఆధారిత విధానాలు అమలు చేశారు. అలాగే, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కాలంలో ఇటీవలే తీసుకొచ్చిన ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం, 2022 వంటి సంక్షేమ ఆధారిత విధానాల్లో భాగంగానే ద్రవ్యోల్బణాన్ని తక్కువగా ఉంచడం, మందుల ధరలను తగ్గించడం, క్లీన్ ఎనర్జీకి మద్దతు ఇవ్వడం వంటివాటిని ఆమోదించారు. సంపూర్ణ మెజారిటీ లేని ప్రభుత్వాల హయాంలోనే ఇవి ఆమోదం పొందాయి.

దీనికి విరుద్ధంగా, అఫోర్డబుల్ కేర్ యాక్ట్ (ఏసీఏ) లేదా ఒబామా కేర్ చట్టంగా ప్రసిద్ధి చెందిన యాక్ట్‌ను, 2009లో డెమొక్రాటిక్ పార్టీ అటు అధ్యక్ష పదవినీ నిర్వహిస్తూ, ఇటు ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ మెజారిటీని కలిగి ఉన్నప్పుడు ఆమోదించారు. అయినా ఈ చట్టాన్ని రిపబ్లికన్ పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యులు, గవర్నర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. పైగా దానిని రద్దు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అటువంటి చట్టంలో భాగం కాలేనప్పుడు, తమ



నియోజకవర్గాలకు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు ఉంటాయని తెలిసినప్పటికీ, ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తాయని ఇది సూచిస్తోంది.

పశ్చిమ ఐరోపాలో జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం వంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలను ఎక్కువగా వామపక్ష లేదా సంప్రదాయవాద పార్టీల చుట్టూ కేంద్రీకృతమై ఉన్న సంకీర్ణ ప్రభుత్వాలు పాలిస్తుంటాయి. 1945 నుండి జర్మనీని రైట్ వింగ్ లేదా ఉదారవాద సంకీర్ణ ప్రభుత్వాలు పాలిస్తున్నాయి. 'క్రిస్టియన్ డెమో క్రటిక్ యూనియన్ ఆఫ్ జర్మనీ' మితవాద పక్షానికీ, 'సోషల్ డెమో క్రటిక్ పార్టీ ఆఫ్ జర్మనీ' మధ్యస్థ–వామపక్ష ప్రభుత్వానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఇక 'సంఘటిత' ప్రభుత్వాలను పార్లమెంటరీ విధానంలోని ఉపవిభాగంగా చూడవచ్చు. ఇవి సంకీర్ణ ప్రభుత్వాలను మాత్రమే కలిగి ఉంటాయి. ఇటలీ, లెబనాన్, ఇథియోపియా వంటి దేశాలలో, వివిధ రకాలైన జాతి, మత, భాషా సమూహాలు సహజీవనం చేయవలసి వస్తోంది. సంఘటిత ప్రభుత్వాలు ఈ సమూహాలలోని అన్ని వర్గాల ఏకాభిప్రాయంతో ఏర్పడతాయి. వీటో అధికారాన్ని కలిగి ఉంటాయి. ఇక్కడ ఒక సమూహం ఏదైనా విషయంపై మరొకరిని అడ్డుకుంటే, రెండోది ప్రతిగా ఆ సమూహాన్ని నిరోధించే అవకాశం ఉంటుంది.

1980ల చివరి నుండి భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు తప్పనిసరి అయిపోయాయి. ఈ కాలంలోనే భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. నిర్ణయాత్మకమైన పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేశారు. అలాగే దేశ అణ్వాయుధ ప్రయోగాల సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించారు. 2004 నుండి 2014 వరకు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అనేక పౌరుల, హక్కుల ఆధారిత చట్టాలను రూపొందించింది. వీటిలో 2005లోని సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ), 2006లోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, 2009లోని విద్యా హక్కు చట్టంతో పాటు, 2013లో తెచ్చిన ఆహార హక్కు చట్టం; భూ సేకరణ, పునరావాసం, రీసెటిల్మెంట్ (ఎల్ఏఆర్ఆర్) చట్టం ఉన్నాయి.

అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ను ఉద్దేశించి... బలహీనమైన, కీలుబొమ్మ ప్రభుత్వం అనే అపోహను ప్రచారం చేయడంతో అది 2014లో బీజేపీ విజయానికి దారితీసింది. అయితే, 2014 నుండి 'బలమైన నాయకత్వం' మనకు ఏమి అందించిందో చూద్దాం. హక్కుల ఆధారిత చట్టాలు వేటినీ ఈ ప్రభుత్వం ఆమోదించలేదు. పాలనా పారదర్శకత, జవాబుదారీతనానికి సంబంధించి ఏ ఆధారాలూ లేవు. బదులుగా మోదీ ప్రభుత్వం ప్రజలను జవాబుదారీగా ఉంచాలనుకుంది. పెద్దనోట్ల రద్దు ద్వారా మీ డబ్బును నాకు చూపించమంది; జీఎస్టీ ద్వారా మీ పన్నులు నాకు చెల్లించమంది. ఇంకా ఆర్టికల్ 370 రద్దు చేయడం, పౌరసత్వ సవరణ చట్టాన్ని తేవడం వంటివి జరిగాయి. నిరసనల తర్వాత మాత్రమే 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రద్దయినాయి.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేయడం లేదా స్వచ్ఛ భారత్ పథకం కింద మరుగుదొడ్లు నిర్మించడం వంటివి అమలులో ఉన్న సంక్షేమ విధానాలకు పొడిగింపు మాత్రమే. ఏ కొత్త ఆవిష్కరణా లేదా కొత్త దిశనూ ఈ ప్రభుత్వం చూపలేదు. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన సుమారు 50 కోట్ల బ్యాంకు ఖాతాలను తెరవడానికి ఆర్థిక సేవలను అందిస్తుంది. అయితే ఇందులో 4.12 కోట్ల మంది జూలై 2023 నాటికి జీరో బ్యాలెన్స్ కలిగి ఉన్నారు. కాగా, జనవరి 2018 నుండి 6 కోట్ల ఖాతాల్లో ఎటువంటి లావాదేవీలు జరగలేదు.

హక్కుల ఆధారిత చట్టాలు ఈ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయించిన నిధులు తగ్గాయి. సమాచార హక్కు చట్టాన్ని బలహీనపరచడం ద్వారా ప్రభుత్వం తనను సూక్ష్మశోధనకు అతీతంగా ఉంచుకుంది. వివిధ పథకాలు లేదా ప్రభుత్వ వైఖరి సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి కాదు. ఒక రకమైన భూస్వామ్య పరాధీనతను సృష్టించడంలో భాగమే. అన్ని గ్యాస్ స్టేషన్లపై, మనందరి కోవిడ్ టీకా సర్టిఫికేట్లపై భూస్వామ్య ప్రభువైన ప్రధాని స్వయంగా కనిపిస్తుంటారు.

ఏకవ్యక్తి ప్రభుత్వం వర్సెస్ సంకీర్ణ ప్రభుత్వం గురించి చరిత్ర పొడవునా సమీక్షించినప్పుడు, బలమైన నాయకుల అహంకారం వారి ప్రజలకు ఎల్లప్పుడూ మంచిది కాదని మనకు అర్థమవుతుంది. ఇస్లామిక్ చట్టంలో ఇజ్మా అనే భావన ఉంటుంది. అంటే ఏకాభిప్రాయం. అతి పెద్ద సమాజం తరఫున నిర్ణయాలు తీసుకోవడానికి పండితుల సంఘం కలిసి వస్తుందనే అవగాహనపై ఇది ఆధారపడి ఉంటుంది.

ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' రూపంలో మనం ఒక సంబావృతకు సాక్ష్యులుగా ఉన్నాం. భారత దేశంలోని భిన్న సమూహాల ప్రజానీకానికి ప్రాతినిధ్యం కల్పించడం కోసం అనేక పార్టీలు కలిసి వస్తున్నాయి. వాళ్లకు ఓటర్లు ఒక అవకాశం ఇస్తారని ఆశించవచ్చు.

వ్యాసకర్త 'జిందాల్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్' ప్రొఫెసర్, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విలువ తెలుసుకో!



వేగంగా వెళ్తున్న పోలీసు కారు వల్ల జాహ్నవి కందుల మరణించారు. ఆమె జీవితానికి 'పరిమిత విలువ' ఉందని అధికారి అడరర్ అన్నారు. తన ఇరవైల్లో ఇక్కడికి వచ్చిన మా నాన్న గుర్తొచ్చారు. మిస్టర్ అడరర్, ప్రతి ప్రవాస భారతీయుడి జీవితానికి అనంతమైన విలువుంది. – రో ఖన్నా, అమెరికా నేత

భట్‌కు సెల్యూట్



తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు వదిలిన హుమాయూన్ భట్... తన దేశస్థులను కాపాడటానికి కశ్మీర్‌లో మరణించిన రెండో తరం ముస్లిం పోలీసు. ('కశ్మీర్ ఫైల్స్'లో) కశ్మీర్‌ను ఇంకోలా చూపిన వివేక్ అగ్నిహోత్రిని క్షమించకూడదు. – సీతూ మహాజన్ కోహ్లీ, ఆర్కిటెక్ట్

చీకటి చరిత్ర



నాజీ జర్మనీ దిశగా ఇండియా పయనిస్తోందని విమర్శించడం అవమానకరం. ఇజ్రాయిల్‌లో హోలోకాస్ట్ బాధితులను కలుసుకున్నవాడిగా భారత్‌ను అలా పోల్చడం బాధాకరం. అలాంటి కర్కశత్వానికి దగ్గరగా వచ్చేది కశ్మీర్‌లో హిందువుల మారణకాండ మాత్రమే! – సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

డబ్బే ముఖ్యం



కశ్మీర్‌లో భారత సైనికుడు మరణించిన ప్రతిసారీ ఇండియా–పాక్ క్రికెట్ మ్యాచ్ ఆడకూడదనడంలో అర్థం లేదు. క్రీడాకారులను నిందించడం మానండి. వాళ్లు బీసీసీఐతో ఒప్పందంలో ఉన్నారు. బీసీసీఐకి ధైర్యం ఉంటే, పాకిస్తాన్‌తో అన్ని క్రీడా సంబంధాలనూ రద్దు చేసుకోవాలి. కానీ దేశభక్తి మీద ధనమే గెలుస్తుంది. – మోహన్ సిన్హా, జర్నలిస్ట్


ఎవరూ గుర్తుండరు!



కశ్మీర్‌లో జరిగే ప్రతి త్యాగం తర్వాత, 'వాళ్లను ఎవరూ మరిచిపోరు' అంటారు. నిజంగానా? గతవారం చనిపోయిన సైనికుల పేర్లు తెలుసా? పేర్లు అటుండనీ, సంఖ్య అయినా తెలుసా? లెక్కలేనంత మంది యువకులు చనిపోవడానికి సిద్ధంగా ఉండటమే అసలు విషాదం! – హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

సినీ మార్గదర్శకుడు

సినిమాకు ఒక విధానం ఉందనీ, ఆ విధానానికి ఒక శాస్త్రం ఉందనీ, దాన్ని అనుసరించే సినిమాలు తీయాలని చెప్పి, చేసి చూపిన దర్శక మేధావి కేవీ రెడ్డి. సరైన స్క్రిప్టు సినిమాకు ముఖ్యమనీ, స్క్రీన్‌ప్లే సిద్ధమైతే సినిమా మూడొంతులు పూర్తయినట్టేనని నిరూపించిన దక్షిణ భారతదేశ దర్శకుల్లో అగ్రగణ్యులు. దర్శకునిగా కేవీ రెడ్డి మూడు దశాబ్దాల కాలంలో తీసిన సినిమాల సంఖ్య కేవలం 14. తమిళ, హిందీ వెర్షన్లతో కలిపితే 18. వీటిలో 5 పౌరాణికాలు, నాలుగు జానపదాలు, 3 సాంఘికాలు, రెండు చారిత్రకాలు ఉన్నాయి. ఆయన పేరు చెప్పగానే 'మాయాబజార్', 'పాతాళభైరవి', 'గుణసుందరి కథ', 'దొంగ రాముడు' గుర్తొస్తాయి. కేవీ 1937లో తన మిత్రుడు మూలా నారాయణస్వామి భాగస్వామిగా ఉన్న 'రోహిణీ పిక్చర్స్'లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ గా చేరడంతో సినీ రంగంలోకి ప్రవేశించారు. అప్పట్లో రోహిణీ పిక్చర్స్ హెచ్ఎం రెడ్డి దర్శకత్వంలో 'గృహలక్ష్మి' (1938) తీసింది. ఇక్కడే ఆయనకి బీఎస్ రెడ్డి, సముద్రాల, నాగిరెడ్డిలతో పరిచయమైంది. తర్వాత వీరంతా బయటికి వచ్చి వాహినీ పిక్చర్స్ స్థాపించారు.



కేవీ రెడ్డి

వాహినీ పతాకంపై బీఎస్ తీసిన 'వందేమాతరం' (1939), 'సుమంగళి' (1940), 'దేవత' (1941) చిత్రాలకు కేవీ సహాయ దర్శకులుగా చేశారు. దేవత తరువాత కేవీకి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. అది మూలా నారాయణస్వామి పెట్టుబడితో తీసిన 'భక్తపోతన' (1942). అది రజతోత్సవాలు జరుపుకుంది. 'గుణసుందరి కథ' (1949) విజయం ఇచ్చిన ప్రేరణతో విజయావారికి మరో అద్భుత జనరంజకం 'పాతాళభైరవి' (1951) తీశారు. 'మాయాబజార్' (1957) ఒక చరిత్రను సృష్టించింది. కేవీ దర్శకత్వ ప్రతిభకు, పకడ్బందీ స్క్రీన్‌ప్లేకు ఈ చిత్రం ఒక తిరుగులేని సిలబస్.

తెలుగు చిత్ర రంగంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కేవీ రెడ్డి (కదిరి వెంకటరెడ్డి) 1912 జులై 1న అనంతపురం జిల్లా తాడిపత్రిలో పుట్టారు. 1972 సెప్టెంబర్ 15న కన్నుమూశారు. కేవీ మనమధ్య లేకపోయినా ఆయన కళకు, వ్యాపారానికి సమన్వయం చేస్తూ తీసిన చిత్రాలు చూస్తున్నంత కాలం చిరంజీవిగా నిలిచే ఉంటారు. తెలుగు సినిమా రంగంలో ఆయనకు ప్రత్యామ్నాయం లేదు.

– హెచ్. రమేష్ బాబు, చలనచిత్ర పరిశోధకులు
(నేడు కేవీ రెడ్డి వర్ధంతి)

స్కిల్ పెంచండి బాబులూ..!

సారాంశం
సరికొండ చలపతి

స్కిల్స్ పలు రకాలు.. ఏ 'స్కిల్' ప్రమాదకరమో మొన్నీమధ్యే చూశాం కదా, అలాంటివి కాదు. మనకూ జనానికీ ఉపయోగపడేవి. ఆ స్కిల్స్ చూడండి సరదాగా...

సేల్స్.. స్కిల్

ఓ పెద్దమనిషి, అరవై ఏళ్లకు పైబడి ఉంటాడు. జోరు వర్షంలో గొడుగేసుకుని ఒక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పుస్తకాలు అమ్ముతున్నాడు. అప్పటికే బాగా చీకటి పడింది. ఇది ఆసక్తిగా అనిపించి ఓ యువకుడు కారులోనుంచే.. 'పుస్తకం ఎంత' అని అడిగాడు.

'మూడువేల రూపాయలు. కానీ, నీకు అమ్మబోను. నీకు ఈ పుస్తకం చదివే ధైర్యం ఉన్నట్టు లేదు,' అన్నాడు

''నాకు చాలా ధైర్యం ఉంది. గంటలో లాగించేస్తాను.' – అన్నాడా యువకుడు కాస్త రోషంతో.

''..అయితే ఒక షరతు మీద ఈ పుస్తకం నీకు అమ్ముతా, అది ఓకే అయితే నీకు ఓ వంద డిస్కౌంట్ కూడా ఇస్తా..'' అన్నాడా పెద్దమనిషి

''ఏమిటా షరతు?''

''నువ్వు జన్మలో చివరి పేజీ చదవనని ఒట్టు వెయ్యాలి. ఎందుకంటే అది చదివి నువ్వు తట్టుకోలేవు. చాలా బాధపడతావు.''

''ఓకే ప్రామిస్!.. నేను ధైర్యవంతుడినే అయినా, చివరి పేజీ చదవను, ఇదిగో డిస్కౌంట్ పోను 2,900 రూపాయలు. పుస్తకం ఇవ్వు..'' అంటూ మనీ పెద్దమనిషి చేతిలో పెట్టాడు.

పెద్దమనిషి డబ్బులు తీసుకుని పుస్తకం ఇస్తూ షరతు గురించి మళ్లీ గుర్తు చేశాడు.

పుస్తకం తీసుకున్న యువకుడు ఇంటికి వెళ్లి భయం, భయంగా పుస్తకం చదివేశాడు. క్రైమ్ థ్రిల్లర్ బుక్ అది.. కొంచెం క్రైమ్, కొంచెం సస్పెన్స్ ఉన్నా... మరీ అంత భయంకరంగా లేదు.

చివరి పేజీ ఎందుకు చదవ వద్దన్నాడా పెద్ద మనిషి? దానిలో అంత తట్టుకోలేని బాధ ఏముంటది? అని మనవాడికి డౌట్ వచ్చింది. చదువుదామని మనసు పీకింది. కాస్త భయం వేసింది. ప్రామిస్‌ను పక్కన పెట్టి... గుండె దిటవు చేసుకుని భయం భయంగా చివరి పేజీ చూస్తే నిజంగానే గుండె ఆగినంత పనైంది.. ఆ చివరి పేజీలో ఇలా ఉంది

'పుస్తకం ఖరీదు 50 రూపాయలు...'

ఇదీ సేల్స్ స్కిల్... అంతే కదా?

...

ఇక ఈ తరహా తెలివితేటలు చూడండి. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉంది.

మేడిన్ ఇండియా!

ఒకసారి అమెరికా కంపెనీలో సబ్బుల ఫ్యాక్టరీలో ఒక పొరపాటు జరిగింది. కొన్ని కవర్లు ప్యాక్ అయ్యాయి కానీ, అందులో సబ్బుల్లేవు. డీలర్లు, కస్టమర్ల గొడవ.. పెద్దగోల య్యింది. దానితో యాజమాన్యం కంపెనీలో ఇలాంటి సమస్యలు ఇంకెప్పుడూ రాకూడదనీ, పరువు పోకూడదనీ జాగ్రత్త కోసం ఆరు కోట్లు పెట్టి ఎక్స్‌రే మెషీన్ కొన్నదట. ప్యాకైన సబ్బులు వెళుతుంటే అందులో సబ్బు ఉన్నదీ లేనిదీ ఆ మెషీన్ ద్వారా కనుక్కుని తీసేయడానికి వీలయ్యింది. ఈ విషయం హైదరాబాద్ సబ్బుల కంపెనీలో మీటింగ్‌లో ప్రస్తావనకు వచ్చింది. ఆ అమెరికా కంపెనీలో పనిచేసి ఇక్కడికి వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఒకరు ఆ దేశ టెక్నాలజీని, వాళ్ల స్కిల్‌ను, శ్రద్ధను చిలవలు పలవలుగా వివరిస్తున్నాడు. ఆ మీటింగ్‌లో చాయ్ బిస్కట్ ఎంజాయ్ చేస్తున్న మనోడు లేచి,''ఎందుకు సర్ 6 కోట్లు తగలేశారు. ఓ 3 వేలు పెట్టి 'పెడెస్టల్ ఫ్యాన్' కొని స్పీడ్‌గా తిప్పితే ఖాళీ ప్యాకెట్లు ఎగిరిపోతాయిగా. పొరపాటున ఖాళీగా వచ్చేవి ఒకటీ రెండేగా''... అనేసి మళ్లీ చాయ్ బిస్కట్ మీద పడ్డాడు. దీనితో అమెరికా ఎగ్జిక్యూటివ్ అవాక్కయ్యాడు. చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి.. అన్న సామెత అన్నిచోట్లా వర్తించదు. ఎంత పాముకు అంత కర్ర.. అదీ సరైన సమయంలో.

– ఇదీ ఓ రకమైన జాబ్ స్కిల్లే కదా!

నో స్కిల్... 81 పర్సెంట్...

ఇంతకీ స్కిల్లు గురించి ఎందుకీ సొల్లు అంటారా? అత్యుత్తమ ఔట్‌పుట్ ఇవ్వగల నైపుణ్యాలు ఉద్యోగుల్లో ఉండటం లేదట. ఒకటో, రెండో కాదు.. ఐటీ రంగంలో ఏకంగా 81 శాతం సంస్థలు నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఈవై, ఐమోచా సంస్థల అధ్యయనంలో వెల్లడైంది. మంచి నైపుణ్యాలు ఉన్న ఉద్యోగుల కోసం డిమాండ్ పెరుగుతోందని తేలింది.

ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల ఉద్యోగుల్లో పని నైపుణ్యాలు, కొత్త టెక్నాలజీలపై అవగాహన అంశాలపై ఈవై, ఐమోచా సంస్థలు అధ్యయనం నిర్వహించాయి. 'టెక్ స్కిల్స్‌లో మార్పులు – ఆ తర్వాత పని పరిస్థితులు' పేరిట ఇటీవల నివేదికను విడుదల చేశాయి.

– ప్రస్తుత డిజిటల్ యుగంలో పోటీలో నిలిచేందుకు వీలుగా కంపెనీలు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకుంటున్నాయనీ.. కానీ వాటికి తగినట్టుగా నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులు దొరకడం కష్టమవుతోందనీ నివేదిక వెల్లడించింది. ఒక్క ఐటీ రంగం మాత్రమే కాకుండా... బ్యాంకింగ్, ఫైనాన్స్, టెలికాం, డేటా అనాలసిస్ వంటి ఇతర రంగాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని స్పష్టం చేసింది.

– అప్లికేషన్ డెవలపర్లు, పవర్ యూజర్ స్కిల్స్ ఉన్నవారికి డిమాండ్ పెరగడం కూడా కొరత నెలకొనడానికి కారణమని నివేదిక పేర్కొంది.

స్కిల్ ఉంటేనే జాబులు...

– సర్వేలో పాల్గొన్న చాలా సంస్థలు డెవలపర్, పవర్ యూజర్ నైపుణ్యాల కొరతను ఎదుర్కొంటున్నట్టు తెలిపాయి. కొత్త టెక్నాలజీలు, అవసరాలకు అనుగుణంగా ఏ ఉద్యోగానికి ఏ నైపుణ్యాలు తప్పనిసరి అనే విభజనను అనుసరిస్తున్నామని 19 శాతం కంపెనీలు తెలిపాయి. 43 శాతం కంపెనీలు ఉద్యోగుల స్థాయిలో నైపుణ్యాల పరిశీలన చేపట్టామన్నాయి. ఈ విభజన /పరిశీలన క్రమంలో చాలా మంది ఉద్యోగుల్లో అవసరమైన నైపుణ్యాలు లేనట్టుగా గుర్తించామని వెల్లడించాయి. ఈ క్రమంలో ఓవైపు ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, మరోవైపు మంచి స్కిల్స్ ఉన్నవారిని చేర్చుకోవడంపై దృష్టి పెడుతున్నట్టు వివరించాయి.

స్కిల్స్ పెంచేద్దాం...

ప్రస్తుతం ఉద్యోగులు నిర్వర్తించాల్సిన విధులు, అందుకు అవసరమైన నైపుణ్యాల్లో ఎన్నడూ లేనంత వేగంగా మార్పులు వస్తున్నాయని ఈ అధ్యయనం చెబుతోంది. 2025 నాటికి తమ సంస్థల్లోని మూడో వంతు ఉద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యాలను గణనీయంగా పెంపొందించాల్సిన అవసరం ఉందని 28 శాతం సంస్థలు భావిస్తున్నాయనీ వివరిస్తోంది. మరో 62 శాతం కంపెనీలు కనీసం 15 శాతం మంది ఉద్యోగుల్లో నైపుణ్యాల పెంపు తప్పనిసరి అని భావిస్తున్నట్టు తెలిపారు.

ఇండియాలోనూ అంతే..

భారతదేశంలోని 60 శాతానికి పైగా కంపెనీలు నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటున్నట్టు ఇటీవలి 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' నివేదికలో ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) కూడా పేర్కొంది. ముఖ్యంగా చదువు పూర్తిచేసుకుని కొత్తగా ఉద్యోగాల్లోకి వస్తున్నవారికి తగిన నైపుణ్యాలు ఏమాత్రం ఉండటం లేదని వెల్లడించింది. ఉద్యోగుల్లో నైపుణ్యాల కల్పనకు తోడ్పడే అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, ఆన్ జాబ్ ట్రెనింగ్ వంటి వాటిని భారత్‌లో ఉపేక్షిస్తున్నారని పేర్కొంది. ముఖ్యంగా కంపెనీలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన స్కిల్స్ కల్పించేలా విద్యా రంగంలో సంస్కరణలు రావాల్సి ఉందని అభిప్రాయపడింది.



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: అమావాస్య ఉ.6.07 వరకు, తదుపరి భాద్రపద శు.పాడ్యమి, నక్షత్రం: ఉత్తర ఫల్గుణి (24గంటలు), వర్జ్యం: ప.1.03 నుండి 2.51 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.10 వరకు, అమృతఘడియలు: రా.11.35 నుండి 1.21 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.51, సూర్యాస్తమయం: 6.02.

రాష్ట్ర పండుగగా విశ్వకర్మ జయంతి

- జీ.ఓ. నంబర్ 24 విడుదల చేసిన ప్రభుత్వం
- సీఎం జగన్‌కు విశ్వబ్రాహ్మణుల కృతజ్ఞతలు



సజ్జలకు కృతజ్ఞత తెలుపుతున్న శ్రీకాంత్

సాక్షి, అమరావతి: ప్రతి ఏడాది సెప్టెంబర్ 17 తేదీన నిర్వహించుకునే విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ మేరకు జీవో నంబర్ 24 విడుదల చేసింది. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని అన్ని ప్రభుత్వ శాఖలకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిని పలువురు విశ్వబ్రాహ్మణులు కలిసి సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన అన్ని చేతివృత్తులవారు రాష్ట్రవ్యాప్తంగా 'శ్రీ విశ్వకర్మ జయంతి'ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.




విద్యుత్ వెలుగుల్లో తిరుమల శ్రీవారి ఆలయం

తిరుమలలో బ్రహ్మోత్సవం సందడి

ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

- విద్యుద్దీపాలంకరణతో మాడ వీధులు, మండపాలు
- ఆకట్టుకుంటున్న నమూనా ఆలయాలు, స్వామివారి ముఖచిత్రాలు





తిరుమలలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనాలు

తిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబు అవుతోంది. తిరుమల జీఎన్‌సీ టోల్ గేట్ నుంచి శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాలు, తిరుమలలోని పార్కులు, ఆస్థాన మండపాలు, అన్నదాన సత్రాలు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, మాడవీధులు విద్యుద్దీపాలంకరణతో కనువిందు చేస్తున్నాయి. తిరుమలలోని ప్రధాన సర్కిళ్లలో ఎటు చూసినా దేవతామూర్తుల భారీ కటౌట్లు, రోడ్లకు ఇరువైపులా ఎల్ఈడీ విద్యుత్ దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కల్యాణ వేదిక వద్ద భక్తులకు కనువిందు చేసేలా స్వామివారి పాదాలను ఏర్పాటు చేశారు. అనంతపద్మనాభ స్వామి నమూనా ఆలయాన్ని కళ్లు చెదిరేలా ఏర్పాటు చేశారు. ఇసుకతో స్వామివారి ముఖచిత్రాలను కళాకారులు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.

గరుడ సేవ రోజున సంతృప్తికర దర్శనం: ఈవో ధర్మారెడ్డి

తిరుమలలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న గరుడసేవకు విశేషంగా విచ్చేసే భక్తులందరూ సంతృప్తికరంగా వాహన సేవను దర్శించుకునేలా ఏర్పాట్లు చేపడుతున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల మొదటిరోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. గరుడసేవ నాడు దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉంటారని చెప్పారు. గరుడ వాహనాన్ని రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా అర్ధరాత్రి రెండు గంటల వరకైనా నెమ్మదిగా ముందుకు తీసుకెళతామని వివరించారు.

పలు రైళ్లు రద్దు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): గుంటూరు డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఈనెల 15 నుంచి 17 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు హుబ్లీ-విజయవాడ (17329) రైలు, ఈ నెల 16 నుంచి 18 వరకు విజయవాడ-హుబ్లీ (17330) రైలు, ఈ నెల 15 నుంచి 17 వరకు గుంటూరు-కాచీగూడ (17251) రైలు, ఈ నెల 16 నుంచి 18 వరకు కాచీగూడ-గుంటూరు (17252) రైలు, ఈ నెల 15 నుంచి 17 వరకు గుంటూరు-సికింద్రాబాద్ (17253) రైలు, ఈ నెల 15 నుంచి 17 వరకు సికింద్రాబాద్-గుంటూరు (17254) రైలు, ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్-కాచీగూడ (07578) రైలు, ఈ నెల 16 నుంచి 18 వరకు కాచీగూడ-మెదక్ (07577) రైలు, ఈ నెల 16న మచిలీపట్నం-మంత్రాలయం రోడ్డు (07067) రైలు, ఈ నెల 17న మంత్రాలయం రోడ్డు-మచిలీపట్నం (07068) రైలును రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

వడ్డెర కుటుంబానికి సీఎం అండ

- రోడ్డు ప్రమాదంలో కుమారుడిని పోగొట్టుకున్న తల్లిదండ్రులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం
- పెద్ద కొడుకులా జగన్ అండగా నిలిచారంటూ బాలుడి తల్లిదండ్రుల కృతజ్ఞతలు



బాలుడి తల్లిదండ్రులకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్

ధవళేశ్వరం: రోడ్డు ప్రమాదంలో కుమారుడిని పోగొట్టుకుని పుట్టెడు దు:ఖంలో ఉన్న ఓ కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేశారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన గుంజే బోయేసు..పెద్దింటు దంపతులు మట్టి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ దంపతుల ఏకైక కుమారుడు గుంజే ఈశ్వర దుర్గ (7) ఇటీవల బస్సు ఢీకొనడంతో చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడు దూరం కావడంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలిసి ఎంపీ ఎం.భరత్‌రామ్ బాలుడి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చారు. వారి విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఎంపీ భరత్‌రామ్ బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో కుమారుడిని పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో తమకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. సీఎం చేసిన సాయాన్ని జీవితంలో మర్చిపోలేమంటూ కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీవెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ మేనేజ్‌మెంట్ బోర్డు నియామకం

సాక్షి, అమరావతి: శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ బోర్డులో ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులతో పాటు మరో ఎనిమిది మంది సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా వర్సిటీ వీసీతో పాటు పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ లేదా ప్రభుత్వ కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి, పశుసంవర్థక శాఖ డైరెక్టర్, మత్స్యశాఖ కమిషనర్ వ్యవహరిస్తారు. బోర్డులో సభ్యులుగా ఐసీఎఆర్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అశోక్‌కుమార్, శాస్త్రవేత్త కేటగిరీ నుంచి అకాస్ట్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ పోసాల్, ఎస్‌వీవీయూ అకడమిక్ కౌన్సిల్ నుంచి బీ ఈశ్వరరావు, బీ శోభామణి, రవీంద్రరెడ్డి, ప్రజాప్రతినిధుల కేటగిరీ నుంచి ఎమ్మెల్యేలు జే పద్మావతి (శింగనమల) పాముల పుష్ప శ్రీవాణి (కురుపాం), జే సుధాకర్ (సంతనూతలపాడు), లోక్‌సభ సభ్యుడు ఎం.గురుమూర్తి (తిరుపతి) ఉంటారు. అలాగే ఆదర్శ రైతుల కేటగిరీ నుంచి వాసుపల్లి జానకీరామ్(విశాఖపట్నం), దంగేటి సత్యకుమారి (కోనసీమ), దాసరి కత్తిరేనమ్మ (ఫిరంగిపురం) ఉంటారు. అదేవిధంగా స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ నుంచి ప్రొ.యుగంధర్ కుమార్, లైవ్‌స్టాక్ ఇండస్ట్రీ నుంచి డాక్టర్ వెంకట రంగయ్య సెట్లెం (ఉమెనోవా ఆగ్రో ఫుడ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్), డాక్టర్ ప్రతాప్ వీ రెడ్డి (న్యూటెక్ బయో సైన్సెస్ ఇండియా లిమిటెడ్), ఐవీఆర్ఐ నుంచి శాస్త్రవేత్త డాక్టర్ జీ సాయికుమార్ నియమితులయ్యారు.

రాజమండ్రి స్టేషన్‌లో రైల్వే జీఎం తనిఖీలు



రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్, చిత్రంలో డీఆర్ఎమ్ నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా దువ్వాడ-రాజమండ్రి సెక్షన్ల మధ్య రియర్ విండో తనిఖీ ద్వారా ట్రాక్, సిగ్నలింగ్ భద్రత వ్యవస్థ అంశాలను పరిశీలించారు. అక్కడ నుంచి రాజమండ్రి స్టేషన్‌లో పర్యటించి క్రూ కంట్రోల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, అక్కడి సిబ్బంది బుకింగ్ లాబీ పనితీరును సమీక్షించారు. లోకో పైలట్లు, గార్డుల విధుల నిర్వహణకు సంబంధించిన క్రూ మేనేజ్‌మెంట్ పనితీరును పరిశీలించారు. ముఖ్యంగా రన్నింగ్ స్టాఫ్‌ని డ్యూటీకి తీసుకునే ముందు తగిన విశ్రాంతిని అందించడంపై దృష్టి సారించాలని, అలాగే సిబ్బందికి తగిన విశ్రాంతి ఉండేలా డ్యూటీ నిర్వహణ పద్ధతిని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మల్టీపర్పస్ స్టాల్స్, వన్ స్టేషన్- వన్ ప్రొడక్ట్ స్టాల్స్, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ల సౌకర్యాలపై సమీక్షించారు. స్టేషన్ ఆవరణలో త్వరలో ప్రారంభం కానున్న రైల్ కోచ్ రెస్టారెంట్‌ను కూడా ఆయన సందర్శించారు. ఆయనతో పాటు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఉన్నారు. ఈ సందర్భంగా రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తదితరులు జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి పలు రైల్వే ప్రాజెక్టులపై మాట్లాడి వినతిపత్రాలు అందజేశారు.

పవన్ ప్యాకేజీ బండారం బయటపడింది

1,082వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: బాబు పాలనలో బహుజనులకు అన్యాయం జరుగుతుంటే నోరెత్తని పవన్ కళ్యాణ్, ఇతర పార్టీల నేతలు.. అవినీతికి పాల్పడిన బాబును జైల్లో వేస్తే మాట్లాడడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 1,082వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభంను అరెస్టు చేసి కుటుంబ సభ్యులను అవమానించినపుడు పవన్ ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. బాబుకు దత్తపుత్రుడు అవతారం ఎత్తి రాజమండ్రి జైలుకు వెళ్లి పొత్తులు పెట్టుకుని పోటీ గురించి మాట్లాడడంతో పవన్ ప్యాకేజీ బండారం బయటపడిందని ఎద్దేవా చేశారు. జైల్లో ములాఖత్ కోసం వెళ్లిన పవన్ మిలాఖత్ రాజకీయం నడిపి అపవిత్ర కలయికను ప్రకటించడం వెనుక ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. 14 సంవత్సరాలు ప్రజలకు అన్యాయం చేసి అడ్డంగా దొరికిన చంద్రబాబు దోచుకున్న అవినీతి కేసుల్లో పాపం పండి నేడు జైలు పాలయ్యాడని చెప్పారు. బహుజనులకు న్యాయం చేసిన పార్టీలకే రాబోయే రోజుల్లో తమ మద్దతు ఉంటుందని, వారిని చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. నాయకులు ఈపూరి ఆదాం, బొలిమేర శామ్యూల్, మాదిగాని గురునాథం, పులిదాసు, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

కువైట్ బాధితురాలికి విముక్తి

పశ్చిమ గోదావరి జిల్లా మహిళకు ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయం



గరికపాటి లక్ష్మికి విమాన టికెట్ అందజేస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యుడు

కడప కార్పొరేషన్: పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పశంగికి చెందిన గరికపాటి లక్ష్మికి కువైట్‌లో సేఠ్ వేధింపుల నుంచి విముక్తి లభించింది. ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయంతో ఆమె సురక్షితంగా ఇండియాకు చేరింది. గరికపాటి లక్ష్మి 8 నెలల కిందట జీవనోపాధి కోసం కువైట్ వెళ్లింది. కువైట్ ఇంట్లో పెట్టే బాధలు భరించలేక భారత రాయబార కార్యాలయానికి చేరుకుంది. అయితే అక్కడ ఎవరిని కలవాలో, ఏం మాట్లాడాలో తెలియక అయోమయంలో ఉన్న సమయంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ సామాజిక కార్యకర్త రెడ్డెయ్య రెడ్డి ఆమెతో మాట్లాడి అక్కడ ఎదుర్కొన్న ఇబ్బందులను తెలుసుకున్నారు. కువైట్ ఇమ్మిగ్రేషన్, ఎంబసీ పనులు పూర్తయ్యేందుకు నెల సమయం పట్టింది. 30 రోజుల పాటు ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ భోజన, వసతి సౌకర్యాలు కల్పించడమేగాక విమాన టికెట్, దారి ఖర్చుల కింద రూ.13 వేలు సాయం చేశారు. 14వ తేదీ తెల్లవారుజామున 4.05 గంటలకు కువైట్ నుంచి బయలుదేరిన ఆమె మధ్యాహ్నం 2.35 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సీఎంవైఎస్ జగన్ సారథ్యంలో గల్ఫ్‌లోని ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరిస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ వారికి రుణపడి ఉంటానని చెప్పారు.

దసరా ఉత్సవ అలంకారాల్లో మార్పులు

- తిథుల హెచ్చుతగ్గులతో వైదిక కమిటీ నిర్ణయం
- తొమ్మిది రోజుల్లో పది అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై గల శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాల అలంకరణలలో వైదిక కమిటీ మార్పులు చేసింది. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో తొమ్మిది రోజులు తొమ్మిది అలంకారాల్లో అమ్మవారిని అలంకరించాలని తొలుత నిర్ణయించింది. అయితే ఇటీవల వైదిక కమిటీ మరో మారు సమావేశమై తిథుల హెచ్చు తగ్గుల కారణంగా తొమ్మిది రోజులు అమ్మవారిని 10 విశేష అలంకారాల్లో అలంకరించాలని ఒక నిర్ణయానికి వచ్చింది. 16వ తేదీన వివిధ ప్రభుత్వ శాఖలతో జరిగే కో ఆర్డినేషన్ సమావేశంలో పది అలంకారాల వివరాలను తెలియజేయనున్నారు. ఉత్సవాలలో తొలి రోజున ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుంది. ఇక మూలా నక్షత్రం రోజున తెల్లవారుజామున రెండు గంటల నుంచి దర్శనం ప్రారంభం కానుండగా, మిగిలిన రోజుల్లో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

అమ్మవారి విశేష అలంకారాలు ఇలా..

అక్టోబర్ 15న శ్రీబాలా త్రిపుర సుందరీదేవి, 16న శ్రీగాయత్రిదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న శ్రీమహా చండీదేవి, 20న మూలా నక్షత్రం శ్రీసరస్వతిదేవి, 21న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 22న శ్రీదుర్గాదేవి, 23న ఉదయం 12 గంటల వరకు మహిషాసురమర్ధినిదేవి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీ రాజరాజేశ్వరిదేవి.

సీఎం సహాయనిధి నుంచి రూ.26.41 లక్షలు అందజేత



చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

నల్లజర్ల: క్యాన్సర్ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.26.41 లక్షల చెక్కును అతడి తండ్రికి గురువారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అందజేశారు. నల్లజర్లకు చెందిన ముత్తిన సాయిపవన్ బోస్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇప్పటికే ఎంతో ఖర్చుచేసిన ఆ కుటుంబం ఇంకా ఖర్చు భరించేస్థితిలో లేదు. ఈ నేపథ్యంలో సాయిపవన్ తన పరిస్థితిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇటీవల కొవ్వూరు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం తక్షణసాయంగా రూ.లక్ష అందించారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి రూ.26.41 లక్షలు మంజూరు చేశారు. ఆ మొత్తానికి చెక్కును సాయిపవన్ తండ్రి సత్యనారాయణకు ఎమ్మెల్యే అందజేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌తో 'కనెక్ట్ టు ఆంధ్రా' ఒప్పందం

సాక్షి, అమరావతి: క్షయ వ్యాధి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగస్వామిగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చేరింది. ఈ మేరకు గురువారం ఏపీ ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి గిరిజా శంకర్ సమక్షంలో 'కనెక్ట్ టు ఆంధ్రా'తో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా గిరిజా శంకర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం చేపట్టిన టీబీ విముక్తి కార్యక్రమంలో తమవంతు సాయంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలోని పది జిల్లాల్లో 14,459 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ న్యూట్రీషియన్ కిట్లను అందిస్తుందని తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ జీఎం పికెహెచ్ నారాయణ్, కనెక్టు టూ ఆంధ్ర సీఈవో శివశంకర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నైజీరియాలో కుప్పకూలిన విద్యుత్ వ్యవస్థ

అబూజా: ఆఫ్రికా ఖండంలో అత్యధిక జనాభా కలిగిన దేశమైన నైజీరియాలో గురువారం గాఢాంధకారం అలుముకుంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థ కుప్పకూలడంతో దేశమంతటా కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఉదయం విద్యుత్ ఉత్పత్తి సున్నా మెగావాట్లుగా నమోదైంది. ఆ తర్వాత క్రమంగా కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. నైజీరియాలో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడడం మామూలే. 2022లో ఏకంగా నాలుగు సార్లు గ్రిడ్ కుప్పకూలింది. అయితే, సాంకేతిక కారణాల వల్లే ఈ సమస్య తలెత్తుతోందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రెండు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను అనుసంధానించే లైన్ అగ్నిప్రమాదానికి గురైందని, అందుకే గ్రిడ్ విఫలమైందని నైజీరియా విద్యుత్ శాఖ మంత్రి అడెబయో అడెలాబూ చెప్పారు.

బిహార్‌లో ఘోరం

పడవ మునగడంతో పది మంది చిన్నారుల గల్లంతు

ముజఫర్‌పూర్(బిహార్): బిహార్‌లో గురువారం పడవ ప్రమాదం సంభవించింది. ముజఫర్‌పూర్ జిల్లాలోని భాగమతి నదిలో పడవ మునిగిపోయిన దుర్ఘటనలో 10 మంది చిన్నారుల ఆచూకీ గల్లంతైంది. 30 మంది చిన్నారులతో వెళ్తున్న ఈ పడవ మధుపూర్ పట్టి ఘాట్ వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. గురువారం జరిగిన ఈ ఘటనలో 20 మంది చిన్నారులను కాపాడగలిగారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేరే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విషయం తెల్సి దిగ్భ్రాంతి చెందారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించారు. జాతీయ విపత్తు స్పందన దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం రంగంలోకి దిగాయి.

హిందీపై అమిత్ షా సందేశం హాస్యాస్పదం

తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై: హిందీ భాష దేశంలోని ఇతర భాషల వైవిధ్యాన్ని ఏకం చేస్తోందని, అన్ని భాషలను, యాసలను గౌరవిస్తోందని 'హిందీ దివస్' సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన సందేశాన్ని తమిళనాడు మంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ గురువారం తప్పుపట్టారు. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయొద్దని సూచించారు. అమిత్ షా సందేశం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేవలం నాలుగైదు రాష్ట్రాల్లో మాట్లాడే భాష దేశాన్ని ఎలా ఏకం చేస్తుందని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.



➤ జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో బుధవారం భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆర్మీ కల్నల్, మేజర్, డీఎస్పీ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని సృష్టించింది. ముష్కరుల దుశ్చర్యకు దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ముగ్గురు ఉన్నతాధికారులను బలి తీసుకున్న రాక్షస మూక కోసం వేట ముమ్మరంగా సాగుతోంది. ఎన్‌కౌంటర్‌లో ముగ్గురి మరణానికి నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) కారణమని ప్రాథమికంగా గుర్తించారు. పాకిస్తాన్ ప్రభుత్వ అండదండలతో ఈ 'ప్రతిఘటన దళం' రాక్షస దళంగా చెలరేగిపోతోంది. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగానికి పెనుసవాలుగా మారింది. భద్రతా సిబ్బందితోపాటు సామాన్య ప్రజలను పొట్టన పెట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో అసలు ఏమిటీ టీఆర్ఎఫ్? దాని పుట్టుపూర్వోత్తరాలేమిటో తెలుసుకుందాం..

రాక్షస మూక

లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్'

ఉగ్ర మూకకు పాకిస్తాన్ సైన్యం, 'ఐఎస్ఐ' అండదండలు..

భారత భద్రతా సిబ్బంది, జమ్మూకశ్మీర్ మైనార్టీలపై టీఆర్ఎఫ్ గురి

జనవరిలో యూఏపీఏ కింద నిషేధం విధించిన భారత ప్రభుత్వం

➤ జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం 2019 ఆగస్టులో రద్దు చేసి పారేసింది. ఈ పరిణామాన్ని ఉగ్రవాదులు ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన కొంత కాలానికే అదే సంవత్సరం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' పురుడు పోసుకుంది. పురుడు పోసింది లష్కరే తోయిబా నాయకత్వమే. నిఘా వర్గాలకు దొరక్కుండా ఆన్‌లైన్ ద్వారా సభ్యులను చేర్చుకోవడం, నిధులను సేకరించడం మొదలుపెట్టారు. ఇతర ఉగ్రవాద ముఠాల్లోని కొందరు సభ్యులు సైతం టీఆర్ఎఫ్‌లో చేరిపోయారు. పాకిస్తాన్ సైన్యంతోపాటు పాకిస్తాన్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' మద్దతు కూడా దొరకడంతో కశ్మీర్ లోయలో టీఆర్ఎఫ్ అత్యంత చురుగ్గా మారిపోయింది. కార్యకలాపాలను ఉధృతం చేసింది. పదుల సంఖ్యలో ఉగ్రవాద దాడులకు పాల్పడింది. టీఆర్ఎఫ్ ప్రధాన లక్ష్యం భారత జవాన్లు, జమ్మూకశ్మీర్‌లోని మైనార్టీలే. కశ్మీరీ పండిట్లను అంతం చేయడమే ధ్యేయంగా దాడులకు దిగుతోంది.

టార్గెట్ కశ్మీరీ పండిట్లు..

➤ టీఆర్ఎఫ్ అరాచకాలు పెరిగిపోతుండడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) కింద ఈ ఏడాది జనవరిలో టీఆర్ఎఫ్‌పై నిషేధం విధించింది. సంస్థ కమాండర్ షేక్ సజ్జాద్ గుల్‌ను యూఏపీఏలోని నాలుగో షెడ్యూల్ కింద ఉగ్రవాదిగా ప్రకటించింది. జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని రోజ్ అవెన్యూ కాలనీకి చెందిన షేక్ సజ్జాద్

పాక్ నుంచి ఆయుధాలు, డ్రగ్స్ స్మగ్లింగ్

గుల్ చిన్నప్పటి నుంచి ఉగ్రబాట పట్టాడు. 2018 జూన్‌లో జరిగిన కశ్మీరీ జర్నలిస్టు షుజాత్ బుఖారీ హత్య వెనుక అతడి హస్తం ఉన్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. టీఆర్ఎఫ్ లష్కరే తోయిబాకు అనుబంధంగా వ్యవహరిస్తోందని రాజ్యసభలో కేంద్ర హోంశాఖ ప్రకటించింది. భద్రతా సిబ్బందిని, మైనార్టీలను హత్య చేయడంతోపాటు పాకిస్తాన్ భూభాగం నుంచి ఆయుధాలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతోందని, అక్కడి నుంచి ఉగ్రవాదులను భారత్‌లోకి చేరవేస్తోందని వెల్లడించింది.

ఎందుకు సృష్టించారు?

ఉగ్రవాదులకు నిధులు అందజేస్తున్నందుకుగాను పాకిస్తాన్‌ను పారిస్‌కు చెందిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో చేర్చింది. దీంతో నిషేధిత ఉగ్రవాద సంస్థలకు నేరుగా నిధులు అందించే మార్గం మూసుకుపోయింది. నిధులు ఆగిపోవడంతో లష్కరే తోయిబా, దాని అధినేత హాఫీజ్ సయీద్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర య్యాయి. అందుకే లష్కరే తోయిబాకు అనుబంధంగా ద రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను సృష్టించా రు. పాకిస్తాన్ సర్కారు నేరుగా టీఆర్ఎఫ్‌కు నిధులు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ఉగ్రవాద సంస్థ అని గానీ, మతపరమైన సాయుధ దళం అని గానీ చెప్పకుండా స్థానిక ప్రతిఘటన దళంగా మభ్య పెట్టడానికి టీఆర్ఎఫ్ అని నామకరణం చేసినట్లు స్పష్టమవుతోంది.

ఉధృతంగా చేరికలు..



ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2022లో జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు 90కిపైగా ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 42 మంది విదేశీ ఉగ్రవాదులు సహా మొత్తం 172 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో 108 మంది టీఆర్ఎఫ్‌కు చెందినవారే కావడం గమనార్హం. అలాగే 2022లో దాదాపు 100 మంది యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరగా, వీరిలో ఏకంగా 74 మంది కేవలం టీఆర్ఎఫ్‌లోనే చేరడం గమనార్హం. దీన్నిబట్టి టీఆర్ఎఫ్ నుంచి ఎదురవుతున్న ముప్పును అర్థం చేసుకోవచ్చు.


నిషేధించిన మరుసటి రోజే 'హిట్ లిస్ట్'..

➤ భారత్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 44 ఉగ్రవాద సంస్థలను ప్రభుత్వం యూఏపీఏ కింద నిషేధించింది. వీటన్నింటిలో టీఆర్ఎఫ్ అత్యంత చురుగ్గా పని చేస్తున్నట్లు గుర్తించారు. నిషేధం విధించిన మరుసటి రోజే ఈ సంస్థ 'హిట్ లిస్ట్' విడుదల చేసింది. అందులో ఉన్న వ్యక్తులందరినీ అంతం చేస్తామని హెచ్చరించింది. సామాన్య యువకులను ఉగ్రవాదం వైపు మళ్లించడానికి టీఆర్ఎఫ్ సోషల్ మీడియాను ఉపయోగించుకుంటోంది. 'సైకలాజికల్ ఆపరేషన్లు' చేస్తోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారిని ప్రేరేపిస్తోంది. యువకుల మనసు మార్చేసి ఉగ్రవాదులుగా తయారు చేస్తోంది. టీఆర్ఎఫ్ జమ్మూకశ్మీర్‌లోని మైనార్టీ సిక్కులను కూడా లక్ష్యంగా చేసుకుంది. ప్రత్యేక పోలీసు అధికారులుగా(ఎస్పీఓ) పనిచేస్తున్న సిక్కు యువకులపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఏజెంట్లు అనే ముద్ర వేస్తోంది. టీఆర్ఎఫ్ దాడుల్లో సిక్కులు సైతం బాధితులుగా మారుతున్నారు. టీఆర్ఎఫ్ ముష్కరులు భారత భద్రతా దళాలపై యుద్ధమే సాగిస్తున్నారని చెప్పొచ్చు. అధునాతన ఆయుధాలతో భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని కాల్పులకు పాల్పడుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జ్యుడీషియల్ డేటా గ్రిడ్‌లో 'సుప్రీం' సమాచారం

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అందుబాటులోకి: సీజేఐ



న్యూఢిల్లీ: జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్(ఎన్‌జేడీజీ)తో సుప్రీంకోర్టు కేసుల వివరాలు అనుసంధానించారు. ఇకపై సుప్రీంకోర్టులో ఉన్న పెండింగ్ కేసుల తాజా సమాచారం ఎప్పటికప్పుడు కక్షిదారులుసహా అందరూ చూడొచ్చు. ఈ వివరాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం సర్వోన్నత న్యాయస్థానం కోర్టు రూమ్‌లో వెల్లడించారు. తాలూకా స్థాయి నుంచి సుప్రీంకోర్టు దాకా ఏ కోర్టులో ఎన్నెన్ని కేసుల విచారణ పూర్తయింది, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి అనేదంతా తెల్సిపోతుంది. ' ఇదో చిన్న ప్రకటనే. కానీ ఈ రోజు చరిత్రాత్మకమైన రోజు. ఎన్ఐసీ బృందం, సుప్రీంకోర్టు టీమ్ కలిసి ఈ వేదికను అభివృద్ధిచేశాయి. సంవత్సరాలవారీగా, రిజిస్టర్ అయిన, రిజిస్టర్‌కాని, కోరమ్ వారీగా ఇలా భిన్న విధాలుగా కేసుల వివరాలు పొందొచ్చు. 62,946 సివిల్ కేసులు, 16,555 క్రిమినల్ కేసులు మొత్తంగా 80,501 పెండింగ్ కేసులు ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు ఎదురుచూస్తున్నాయి. అన్ని వివరాలను వెబ్‌పేజీలు అందిస్తాయి. ఎన్‌జేడీజీలో సమాచారం అప్‌లోడ్ ద్వారా న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత ఇనుమడిస్తుంది' అని సీజేఐ చెప్పారు. 585 కేసులను త్రిసభ్య ధర్మాసనాలకు అప్పజెప్పాల్సి ఉంది. త్వరలోనే ఆయా ధర్మాసనాలను ఏర్పాటుచేస్తానని సీజేఐ పేర్కొన్నారు. 'స్వేచ్ఛా సమాచార పాలసీ'లో భాగంగానే ఇవన్నీ అమల్లోకి తెస్తున్నట్లు చెప్పారు. ఎన్‌జేడీజీలో 18,735 జిల్లా, సబార్డినేట్ కోర్టులు, హైకోర్టుల సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. ఈ-కోర్ట్స్ ప్రాజెక్టు కింద దీనిని ఏర్పాటుచేశారు. కక్షిదారులకు వెబ్ సేవల ద్వారా అన్ని హైకోర్టులు ఎన్‌జేడీజీతో అనుసంధానమయ్యాయి. వేర్వేరు రకాల కేసులు సంవత్సరాలవారీగా ఈ పోర్టల్‌లో ఒక్క క్లిక్‌తో చూసుకోవచ్చు. కేసుల సంబంధ సమస్త సమాచారాన్ని ఈ పోర్టల్ ద్వారా పొందొచ్చు.

పారదర్శకతలో పై మెట్టు: మోదీ

' సుప్రీంకోర్టు, సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ వేసిన గొప్ప ముందడుగు ఇది. అధునాతన సాంకేతికతతో న్యాయవితరణలో, న్యాయవ్యవస్థలో పారదర్శకత మరో మెట్టు పైకి ఎక్కింది' అంటూ ఎన్‌జేడీజీలో సుప్రీంకోర్టు అనుసంధానాన్ని ప్రధాని మోదీ శ్లాఘించారు.

మూడొంతుల మందిని సాగనంపుతా!

ఎఫ్‌బీఐ వంటి ప్రధాన దర్యాప్తు సంస్థల్నీ మూసేస్తా: : వివేక్ రామస్వామి



వాషింగ్టన్: తాను అధ్యక్షుడినైతే అమెరికా ప్రభుత్వంలోని ముప్పావు వంతు ఉద్యోగులను ఇంటికి పంపిస్తానని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న వివేక్ రామస్వామి సంచలన ప్రకటన చేశారు. భారతీయ మూలాలున్న వివేక్.. అమెరికన్ వార్తా వెబ్‌సైట్ యాక్సియస్‌కు ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో పలు విషయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ' రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం సాధించి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచి అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చుంటే వెంటనే నా పని మొదలుపెడతా. దేశవ్యాప్తంగా విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బందిలో 75 శాతం మందిని ఉద్యోగాల నుంచి తీసేస్తా. ఇన్ని లక్షల మంది సిబ్బంది అమెరికా సర్కార్‌కు పెనుభారం. ఇక ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) వంటి ప్రధాన దర్యాప్తు సంస్థలను మూసేస్తా. విద్య, ఆల్కాహాల్, పొగాకు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, అణు నియంత్రణ కమిషన్, అంతర్గత ఆదాయ సేవలు, వాణిజ్య శాఖల ప్రక్షాళనకు కృషిచేస్తా. అధ్యక్షుడిగా తొలి ఏడాది పూర్తయ్యేలోపు సగం మంది ప్రభుత్వ ఉద్యోగులను ఇంటికి సాగనంపుతా. మిగతా సగం మందిలో 30 శాతం మందితో వచ్చే ఐదేళ్లలో పదవీ విరమణ చేయిస్తా. ఇందులో అనుమానమేమీ లేదు. పిచ్చిపని అస్సలుకాదు' అని 38 ఏళ్ల వివేక్ అన్నారు. ప్రస్తుతం అమెరికాలో 22.5 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 75 శాతం మందిని అంటే దాదాపు 16 లక్షల మందిని వచ్చే నాలుగేళ్లలో ఉద్యోగాల నుంచి తీసేస్తానని వివేక్ లెక్కచెప్పారు. ఇన్ని లక్షల మందిని తీసేస్తే ప్రభుత్వంపై వేతన భారం భారీగా తగ్గుతుందని ఆయన అభిప్రాయం.

సనాతన ధర్మాన్ని అంతం చేసేందుకు కుట్రలు

ప్రతిపక్ష కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం

- 'ఇండియా'.. దురహంకారి కూటమి
- దేశాన్ని బానిసత్వంలోకి నెట్టివేయాలని చూస్తున్నారు
- మనం ఐక్యంగా ఉంటే కుట్రదారుల ఆటలు సాగవు
- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన

బీనా/రాయ్‌గఢ్: ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని దురంహకారి కూటమిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని ఇండియా కూటమి లక్ష్యంగా పెట్టుకుందని, వెయ్యి సంవత్సరాల బానిసత్వంలోకి దేశాన్ని నెట్టివేయాలని చూస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. జీ20 శిఖరాగ్ర సదస్సు విజయవంతమైందని, ఈ ఘనత 140 కోట్ల మంది భారతీయులకు దక్కుతుందని పేర్కొన్నారు. ఈ విజయం దేశ ప్రజల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పారు. త్వరలో శాసనసభ ఎన్నికలు జరుగనున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ గురువారం పర్యటించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ జిల్లాలోని బీనా రిఫైనరీలో రూ.49 వేల కోట్లతో నిర్మించే పెట్రోకెమికల్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. దాంతోపాటు మరో 10 పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. అలాగే చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ జిల్లా కొండతరాయి గ్రామంలో 'విజయ్ శంఖనాథ్' సభలోనూ మాట్లాడారు. రెండు సభల్లో ఆయన ఏం చెప్పారంటే...

కుట్రలను అడ్డుకోవాలి

''దురహంకారి కూటమి ఇటీవలే ముంబైలో సమావేశమైంది. ఆ కూటమికి ఒక విధానం లేదు, ఒక నాయకుడు లేడు. సనాతన ధర్మంపై దాడి చేసి, నాశనం చేయాలన్న రహస్య ఎజెండా మాత్రమే ఉంది. సనాతన ధర్మం నుంచి జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తి పొందారు. స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన పోరాటం సనాతన ధర్మం చుట్టూ కేంద్రీకృతమైంది. మహాత్ముడు జీవితాంతం సనాతన ధర్మాన్ని పాటించారు. ఆయన చివరిసారిగా 'హే రామ్' అంటూ నెలకొరిగారు. రాణి అహిల్యాబాయి హోల్కర్, ఝాన్సీ లక్ష్మీబాయి, స్వామి వివేకానంద, లోకమాన్య తిలక్ వంటి మహనీయులు సనాతన ధర్మ నుంచి స్ఫూర్తి పొంది ముందుకు నడిచారు. విపక్ష కూటమి నాయకులు బహిరంగంగా మాట్లాడడం ప్రారంభించారు. వారు మనపై దాడికి పదును పెడుతున్నారు. దేశంలో సనాతన ధర్మాన్ని ఆచరించే ప్రతి ఒక్కరూ, దేశాభిమానులు ఈ విషయం గమనించాలి. అప్రమత్తంగా ఉండాలి. సనాతన ధర్మాన్ని నిర్మూలించేందుకు సాగుతున్న కుట్రలను మనమంతా కలిసికట్టుగా అడ్డుకోవాలి. మనం ఐక్యంగా ఉంటే వారి ఆటలు సాగవు. వారి ప్రయత్నాలనీ విఫలమవుతాయి.

మన లక్ష్యం 'ఆత్మనిర్భర్ భారత్'

జీ20 సదస్సు విజయంతో దేశ ప్రజల హృదయాలు గర్వంతో ఉప్పొంగుతున్నాయి. ఈ ఘనత మోదీకి కాదు, ముమ్మాటికీ 140 మంది భారతీయులదే. చిన్నపిల్లలకు కూడా జీ20 గురించి తెలిసింది. బృంద స్ఫూర్తితో పని చేయడం వల్ల ఈ సదస్సు విజయవంతమైంది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ చాలా ఏళ్లు అధికారంలో ఉంది. కానీ, ఆ పార్టీ చేసిందేమీ లేదు. అవినీతికి, నేరాలకు పాల్పడడంతోనే కాంగ్రెస్‌కు సమయం సరిపోయింది. కాంగ్రెస్ హయాంలో నేరగాళ్లు రాజ్యమేలారు. మధ్యప్రదేశ్‌లో



బీనా రిఫైనరీలో శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

బీజేపీ అధికారంలోకివచ్చాక అవినీతి అంతమైంది. సుపరిపాలన కొనసాగుతోంది. పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను సాధించుకోవాలి. పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోకెమికల్ ఉత్పత్తుల కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మారాలి. దిగుమతులను తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. స్వయం స్వావలంబన దిశగా బీనా రిఫైనరీ ఒక ముందడుగు అవుతుంది.

దళారుల ప్రమేయాన్ని అంతం చేశాం

బానిస మనస్తత్వం నుంచి దేశం బయట పడింది. 'న్యూ ఇండియా' సగర్వంగా ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ పథకాల అమలులో దళారుల ప్రమేయాన్ని అంతం చేశాం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అర్హులైన రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నాం. ఈ పథకం కింద ఇప్పటిదాకా రూ.2.60 లక్షల కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమచేశాం. వ్యవసాయ రంగంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడానికి కృషి చేస్తున్నాం. రైతులపై భారం తగ్గిస్తున్నాం. ఎరువులను చౌకగా అందజేయడానికి సబ్సిడీ రూపంలో గత తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లకుపైగా వెచ్చించాం. అమెరికాలో ఒక యూరియా సంచి ధర రూ.3,000 ఉంది. మన దగ్గర మాత్రం రైతులకు కేవలం రూ.300కే లభిస్తోంది. దేశంలో గత నాలుగేళ్లలో కొత్తగా 10 కోట్ల కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు ఇచ్చాం. మొఘల్ రాజులపై పోరాటం చేసిన గిరిజన పాలకురాలు రాణి దుర్గావతి 500వ జయంతి వేడుకలను అక్టోబర్ 5న ఘనంగా నిర్వహిస్తాం.

'ఇండియా' పట్ల జాగ్రత్త

భారత్‌ను, ప్రాచీన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కనుమరుగు చేయాలని చూస్తున్న విపక్ష 'ఇండియా' కూటమి కుయుక్తుల పట్ల ప్రజలు నిత్యం జాగరూకులై ఉండాలి. మన దేశానికి, మన విశ్వాసాలకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోంది. కొందరు వ్యక్తులు అధికారం నుంచి దూరమయ్యాక ప్రజల పట్ల ద్వేషం పెంచుకున్నారు. అందుకే ప్రజల గుర్తింపుపై, సంస్కృతిపై దాడి చేస్తున్నారు. దేశంలో వేలాది సంవత్సరాలుగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న సంస్కృతిని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్నదే వారి అసలు లక్ష్యం. సనాతన ధర్మం వ్యక్తుల జన్మకు కాదు, వారి కర్మ(చేసే పనులు) ప్రాధాన్యం ఇస్తుంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

14 మంది టీవీ యాంకర్లపై 'ఇండియా' బహిష్కరణ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి 14 మంది టీవీ యాంకర్లు, జర్నలిస్టులను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకుంది. వివిధ వేదికలపై, చానళ్లలో వారి కార్యక్రమాలను తాము హాజరుకాబోమని గురువారం ప్రకటించింది. అయితే, ఈ నిర్ణయాన్ని అధికార బీజేపీ తప్పుపట్టింది. దీన్ని అత్యవసర పరిస్థితి నాటి పరిణామాలతో పోల్చింది. అలాగే న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్(ఎన్‌బీడీఏ) సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య విరుద్ధంగా నడుచుకోవడం సమంజసం కాదని పేర్కొంది. 14 మంది టీవీ యాంకర్లు, జర్నలిస్టుల కార్యక్రమాలకు హాజరు కారాదంటూ బుధవారం జరిగిన తమ కూటమి సమన్వయ కమిటీ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు విపక్ష కూటమి మీడియా కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. సదరు యాంకర్లు, జర్నలిస్టుల పేర్లను సైతం విడుదల చేసింది.

మృతుల సంఖ్య 20 వేలు చేరుకోవచ్చు!

డెర్నా సిటీ మేయర్ అనుమానం

డెర్నా: వరదలు, రెండు డ్యామ్‌ల నేలమట్టంతో జనావాసాలపైకి జల ఖడ్గం దూసుకొచ్చి వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన లిబియాలో పరిస్థితి కుదుటపడలేదు. డేనియల్ తుపాను మిగిల్చిన విషాదం నుంచి డెర్నా నగరం తేరుకోలేదు. అక్కడ ఇంకా వేలాది మంది ఆచూకీ గల్లంతైంది. 5,500 మందికిపైగా చనిపోయారని అధికారులు ప్రకటించగా మృతుల సంఖ్య 20,000కు చేరుకోవచ్చని సిటీ మేయర్ అబ్దెల్ మోనియమ్ అల్ షైతీ అనుమానం వ్యక్తంచేశారు.

ఉగ్రవాదులను చుట్టుముట్టాం

జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రకటన

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ముగ్గురు ఉన్నతాధికారుల ప్రాణాలను బలి తీసుకున్న ఉగ్రవాదుల కోసం భద్రతా సిబ్బంది గాలింపు చర్యలు ఉధృతం చేశారు. లష్కరే తోయిబా, దాని అనుబంధ సంస్థకు చెందిన ఇద్దరు ముష్కరులను చుట్టుముట్టామని జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రకటన గురువారం ప్రకటించారు. వారిని బంధించడానికి అనంత్‌నాగ్ జిల్లా కోకెర్‌నాగ్‌లో ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొన్నారు.

టైమ్ 100 నవ్య సారథుల జాబితాలో హర్మన్‌ప్రీత్

న్యూయార్క్: భిన్న రంగాల్లో విశేష కృషిచేస్తూ ప్రపంచ గతిని మార్చే కొత్త తరం సారథుల జాబితా అంటూ ప్రఖ్యాత మ్యాగజైన్ టైమ్ తీసుకొచ్చిన జాబితాలో భారతీయ మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ స్థానం దక్కించుకున్నారు. 2023 టైమ్ 100 నెక్ట్స్: ది ఎమర్జింగ్ లీడర్స్ షేపింగ్ ది వరల్డ్ పేరిట 100 పేర్లతో ఈ జాబితాను సిద్ధంచేశారు. 'ఆటలో పోటీతత్వం, రగిలిపోయే క్రీడాసక్తితో హర్మన్‌ప్రీత్.. మహిళా క్రికెట్‌ను ప్రపంచంలో విలువైన క్రీడా ఆస్తిగా మలిచారు' అని టైమ్ పొగిడింది. క్షయ వ్యాధి సోకడంతో అతిగా ఔషధాలు వాడి, వాటి దుష్ప్రభావంతో వినికిడి శక్తిని కోల్పోయినా మెరుగైన డ్రగ్ కోసం పోరాడి విజయం సాధించిన నందితా వెంకటేశన్ పేరూ ఈ జాబితాలో ఉంది. ఈమె కృషి ఫలితంగానే భారత్‌లో క్షయ చికిత్సకు మరింత మెరుగైన జనరిక్ మందులు అందుబాటులోకి వచ్చాయి. పర్యావరణహిత నిర్మాణాలతో మంచి పేరు తెచ్చుకున్న వినూ డేనియల్ పేరూ ఈ జాబితాలో ఉంది.

సింగపూర్ అధ్యక్ష పీఠంపై షణ్ముగరత్నం

సింగపూర్: అంతర్జాతీయ రాజకీయాల్లో మరో భారతీయుడు పతాకశీర్షికలకెక్కారు. సింగపూర్ నూతన అధ్యక్షుడిగా భారతీయ మూలాలున్న ఆర్థికవేత్త థర్మాన్ షణ్ముగరత్నం గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల ముగిసిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాన పోటీదారులైన చైనా మూలాలున్న ఎంగ్‌కోంక్ సాంగ్(15.72 శాతం ఓట్లు), తన్‌కిన్ లియాన్ (13.88 శాతం)లను వెనక్కి నెట్టేసి ఏకంగా 70.4 శాతం ఓట్లు సాధించి షణ్ముగరత్నం ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. అధ్యక్ష భవనం ఇస్తానాలో ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి, భారతీయ మూలాలున్న జడ్జి సుందరేశ్ మీనన్ ఈయనతో అధ్యక్షుడిగా ప్రమాణం చేయించారు. బహుళ జాతుల, సమ్మిళిత సమాజాభివృద్ధికి కృషిచేస్తానని అధ్యక్ష హోదాలో షణ్ముగరత్నం హామీ ఇచ్చారు. 66 ఏళ్ల షణ్ముగరత్నం ఆరేళ్లపాటు అధ్యక్షునిగా పాలన కొనసాగిస్తారు.

పార్టీ ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్‌ల జారీ

ప్రత్యేక సమావేశాలు జరిగే ఐదు రోజులూ కచ్చితంగా హాజరుకావాలని ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు హాజరు కావాలని తమ పార్లమెంట్ సభ్యులకు బీజేపీ విప్ జారీ చేసింది. ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక సమావేశానికి, వివిధ విషయాలపై ప్రభుత్వ వైఖరికి మద్దతు ఇవ్వడానికి ఎంపీలందరూ తప్పనిసరిగా సభలో ఉండాలని విప్‌లో ఆదేశించింది. ఈ ప్రత్యేక సమావేశాల్లో 75 సంవత్సరాల పార్లమెంటు ప్రయాణంపై ప్రత్యేక చర్చతో పాటు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో రెండు బిల్లులను, రాజ్యసభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక బిల్లు పార్లమెంట్ ముందుకు రానుంది. ఇప్పటికే ఈ బిల్లును వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ పాత భవంతిలో సమావేశాలు మొదలుపెట్టి కొత్త భవంతిలో ముగిస్తారని సమాచారం.


కాంగ్రెస్ సైతం

ఈ ప్రత్యేక సమావేశాల్లో ఎజెండాతో సంబంధం లేకుండా అనూహ్యంగా కొత్త బిల్లులను మోదీ సర్కార్ తీసుకురావచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. బలం మేరకు ఆ బిల్లులను అడ్డుకోవాలని కంకణం కట్టుకుంది. అందుకే తమ పార్టీ ఎంపీలంతా ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని కాంగ్రెస్ విప్ జారీచేసింది. ' సెప్టెంబర్ 18వ తేదీ ఉదయం 11 గంటలుమొదలు 22వ తేదీ ఇరుసభలు నిరవధిక వాయిదా పడేదాకా పార్టీ నిర్ణయాన్ని ఉమ్మడిగా వినిపించేందుకు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా రావాలి' అంటూ కాంగ్రెస్ విప్ జారీచేసింది. రాజ్యసభలో ఆమోదం పొందిన లోక్‌సభలో న్యాయవాదుల(సవరణ)బిల్లు-2023, ప్రెస్, పిరియాడికల్స్‌రిజిస్ట్రేషన్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

నిఫాపై నిరంతర నిఘా

కేరళకు చేరిన యాంటీవైరల్ ఔషధాలు

తిరువనంతపురం: ప్రాణాంతక నిఫా వైరస్ మళ్లీ రాష్ట్రంలో వెలుగుచూడటంతో కేరళ రాష్ట్రం అప్రమత్తమైంది. నిఫా వ్యాధిగ్రస్తులకు చికిత్సలో వినియోగించేందుకు కావాల్సిన యాంటీవైరల్ ఔషధాలు కేరళకు చేరుకున్నాయని రాష్ట్ర సర్కార్ వెల్లడించింది. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖతో రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించారు. ' నిఫాకు ఉన్న ఏకైక యాంటీవైరల్ చికిత్స.. మోనోక్లోనల్ యాంటీబాడీలే. అందుకే వాటిని హుటాహుటిన రాష్ట్రానికి తెప్పించాం. కోజికోడ్ జిల్లాలో నిఫా వెలుగుచూడడంపై ఆందోళన వద్దు. జిల్లాలోని ప్రజానీకం సరైన నివారణ చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటే సమస్య నుంచి గట్టెక్కగలం' అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మహిళా మంత్రి వీణ జార్జ్ వ్యాఖ్యానించారు. కోజికోడ్ జిల్లాలో వ్యాపించిన వైరస్ కారణంగా ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇన్ఫెక్షన్ రేటు తక్కువ ఉన్నాసరే మరణాల రేటు ఎక్కువ ఉండటంతో కేంద్ర ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. పుణె నుంచి వైరాలజీ నిపుణుల బృందాన్ని రాష్ట్రానికి పంపిన విషయం తెల్సిందే. 24 ఏళ్ల ఆరోగ్య కార్యకర్తకు నిఫా సోకడంతో ఇప్పటిదాకా వైరస్ బారిన పడిన వారి సంఖ్య ఐదుకు చేరింది. వీరిలో ఇద్దరు మరణించారు. కోజికోడ్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో అన్ని విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. కోజికోడ్ జిల్లా మాత్రమేకాదు ఇలాంటి ఇన్ఫెక్షన్‌ల బారిన రాష్ట్రం మొత్తం పడే వాతావరణం అక్కడ ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత వైద్య పరిశోధనా మండలి ప్రకటించాయని కేరళ సర్కార్ పేర్కొంది. బుధవారం సాయంత్రం నాటికి కోజికోడ్‌లో 11 వార్డులను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు.





ప్రారంభోత్సవం

కలైంజ్ఞర్ మగళిర్ ఉరిమై తిట్టం

ప్రారంభించువారు

శ్రీ ఎం.కె. స్టాలిన్ గారు

గౌరవనీయ తమిళనాడు ముఖ్యమంత్రి వర్యులు

15.09.2023 శుక్రవారం, ఉ.10.00 గం.లకు

తమిళనాడు అంతటా

నెలకు రూ.1,000/-

1 కోటి మంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది



ఇది ఉదార కానుక కాదు; మీ హక్కుల గుర్తింపు!

DIPR/1047/Display/2023

tndiprnews tndipr tndipr TN DIPR www.dipr.tn.gov.in/

శివ్ దాస్ మీనా, ఐ.ఎ.ఎస్.
ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా...

ఇన్నాళ్ల డ్రామాకు తెరపడింది

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సాక్షి, రాజమహేంద్రవరం: ఎక్కువ ప్యాకేజీ లాగేందుకు ఇదే సరైన సమయమని భావించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీతో పొత్తు ప్రకటించారని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజమెత్తారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇన్నాళ్లు టీడీపీకి జనసేన వ్యతిరేకమంటూ ఆడుతున్న డ్రామాకు నేటితో తెరపడిందని చెప్పారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిసిన పవన్.. ప్యాకేజీ కుదరడంతో బయటకు వచ్చి రాసిన స్క్రిప్ట్‌ను చదివారని ఎద్దేవా చేశారు. 2024లో టీడీపీని అధికారంలోకి తెచ్చి చంద్రబాబును సీఎం చేయాలన్న ఎజెండాతో పవన్ పని చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయని కొత్తగా చెబుతున్నట్టు ఎమోషనల్ డ్రామా ప్రారంభించారన్నారు. యువతను మభ్యపెట్టి రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న బాబును సమర్థిస్తున్న పవన్‌కు ఏ రకమైన రాజకీయ సిద్ధాంతాలు ఉన్నాయో అర్థమవుతోందన్నారు. కాపులను అన్ని రకాలుగా మోసం చేసిన వ్యక్తి, పేదలకు ఇళ్ల పట్టాల కోసం ఆనాడు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన వంగవీటి మోహన్ రంగాను పొట్టన పెట్టుకున్న వ్యక్తి చంద్రబాబు అని, ఆయనకు పవన్ వత్తాసు పలకడమేమిటని ప్రశ్నించారు. పవన్‌ను కాపులు సమర్థించరని చెప్పారు. చంద్రబాబు కష్టాల్లో ఉన్నప్పుడు బయటకు వచ్చి.. మళ్లీ కనిపించకుండా పోయే వ్యక్తి పవన్ అని అన్నారు. ప్రశ్నించడం కోసం పార్టీ పెట్టిన పవన్.. ప్యాకేజీ కోసం అమ్ముడుపోతూనే ఉన్నాడని విమర్శించారు.

జైలులో పొత్తు కుదుర్చుకోవడమా?

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురం: జైలుకు వెళ్లి పొత్తు కుదుర్చుకుని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికారని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఎద్దేవా చేశారు. పిఠాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుంటే ఇక జైలు తప్ప బయటకు వచ్చే అవకాశం లేదని చంద్రబాబుకు తెలిసిపోయిందన్నారు. అందుకే దత్తపుత్రుడికి ఏదో హామీ ఇచ్చే ఉంటారని.. అది జైలులోనే పొత్తు కుదుర్చుకున్నామన్న పవన్ ప్రకటనలోనే అర్థమవుతోందన్నారు. తన పరిపాలన నచ్చితేనే తనకు ఓటు వేయాలని సీఎం వైఎస్ జగన్ ప్రజలను కోరుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలుచేశారు కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నారన్నారు. తన కుమారుడు లోకేశ్‌ను బాబు పక్కన పెట్టి దత్తపుత్రుడితో పార్టీని నడిపిస్తారనే ప్రచారం నిజమైందన్నారు.

ప్యాకేజీ కోసమే పొత్తు ఒప్పందం

పవన్‌పై మంత్రి చెల్లుబోయిన వేణు ధ్వజం



సాక్షి, రాజమహేంద్రవరం: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ములాఖత్ పేరుతో చంద్రబాబుతో మిలాఖత్ అయ్యారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. టీడీపీతో పొత్తు నిర్ణయంతో పవన్‌ను నమ్ముకున్న జనసైనికులు రోడ్డుమీదకు వచ్చే పరిస్థితి తలెత్తిందని చెప్పారు. ప్యాకేజీ కోసమే ఈ ఒప్పందం కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రి వేణు విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నించేందుకు పార్టీ పెట్టానన్న పవన్.. చంద్రబాబు దోపిడీని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి స్పష్టమైన ఆధారాలతోనే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిందన్నారు. పొత్తులపై బీజేపీ స్పష్టత ఇవ్వకుండానే చంద్రబాబుతో కలవడం ఏంటన్నారు. గతంలో కాపుల కష్టాలకు కారణమైన చంద్రబాబుతో పొత్తు పవన్‌కు తగునా? అని ప్రశ్నించారు.

పవన్ ముసుగు తొలిగింది

రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన పొత్తు ప్రకటనతో పవన్ కళ్యాణ్ ముసుగు పూర్తిగా తొలిగిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడని తాము ఎప్పటి నుంచో చెబుతున్న వాస్తవం ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా అవగతమైందన్నారు. పార్టీకి సిద్ధాంతం, అజెండా లేని పవన్.. కేవలం టీడీపీని గట్టెక్కించడమే పనిగా పెట్టుకుని జనసేన కార్యకర్తలను తీవ్రంగా మోసం చేస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు.

పొత్తులను అధినాయకత్వం నిర్ణయిస్తుంది: ఏపీ బీజేపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకోవాలనే దానిపై అధినాయకత్వం నిర్ణయిస్తుందని ఏపీ బీజేపీ మీడియా విభాగం ప్రకటించింది. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్ణయం మేరకు పొత్తులు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతున్నట్టు వెల్లడించింది.

ముసుగు తీసిన చంద్రసేనాని

చంద్రబాబుతో ములాఖత్ అనంతరం 2024 ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని ప్రకటించిన పవన్‌కళ్యాణ్



జైలులో చంద్రబాబును కలిసిన అనంతరం బయటకు వస్తున్న లోకేశ్, పవన్, బాలకృష్ణ

సాక్షి, రాజమహేంద్రవరం : తెలుగుదేశం–జనసేన మధ్య బంధానికి ఉన్న ముసుగు తొలగిపోయింది. కొత్తగా పొత్తు పొడుస్తున్నట్లు పవన్‌కళ్యాణ్ పాత పాటనే కొత్తగా పాడారు. చంద్రబాబు చాటుగా ఇన్నేళ్లు ఒదిగి ఉన్న జనసేన అధ్యక్షుడు తాజాగా పొత్తు ప్రకటనతో పాత పాటకు కొత్త పల్లవి అందుకున్నారు. పాత బంధాన్నే కొత్త పొత్తుల రాగంగా ఆలపించేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పొత్తుల ప్రకటన వరకు చంద్రబాబు చెంతనే పవన్ అతిథి రాజకీయ నాయకుడి పాత్ర పోషించారన్నది జగమెరిగిన సత్యం. 2014 ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేయకుండా టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతిచ్చి.. చంద్రబాబు రాసిన స్క్రీన్ ప్లేను పక్కాగా రక్తి కట్టించారు. ప్రశ్నించేందుకే జనసేన అంటూ డబ్బాలు కొట్టుకుని.. చంద్రబాబు ప్రభుత్వంలో మహిళా అధికారులపై దాడులు, ప్రకృతి వనరుల దోపిడీ, ఇచ్చిన వందల హామీలను నెరవేర్చకపోయినా ఎన్నడూ ప్రశ్నించిన పాపాన పోలేదు. పైగా నాలుగేళ్లు పత్తా లేకుండా.. 2019 ఎన్నికలు సమీపిస్తుండగా చంద్రబాబుకు మేలు చేసేందుకు మళ్లీ తెరపైకి వచ్చారు. అప్పటి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చే కుయుక్తిలో భాగంగానే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు నాటకమాడారు. చివరికి ప్రజా క్షేత్రంలో చావు దెబ్బ తినడంతో మళ్లీ టీడీపీతో అంటకాగుతున్న విషయం తెలిసిందే. తెలుగుదేశంతో బంధాన్ని కొనసాగిస్తూనే తన పార్టీ కార్యకర్తలను, ప్రజలను మోసగించారు. గతంలో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శించిన నోటితోనే ఇప్పుడు వారితోనే కలిసి రాజకీయ పయనం చేస్తానంటూ ప్రకటించడం పవన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని చాటి చెబుతోంది.

సమష్టిపోరు అవసరమట!

స్కిల్ స్కామ్‌లో అరెస్టై, జైలు జీవితం గడుపుతున్న చంద్రబాబును పరామర్శించిన కొద్ది క్షణాల్లోనే టీడీపీ, జనసేన పొత్తు ఉందంటూ పవన్ చెప్పడం చూస్తుంటే.. జైలు నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్టు అవగతమవుతోంది. ఈ క్రమంలోనే రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పని చేస్తాయని.. బీజేపీ కూడా మా వెంట వస్తుందని ఆశిస్తున్నామన్నారు. తమ కలయిక రాష్ట్ర భవిష్యత్తు కోసమంటూ కలరింగ్ ఇచ్చారు. చంద్రబాబుతో విభేదించి గతంలో ప్రత్యేకంగా పోటీ చేశానని, వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవాలంటే సమష్టిపోరు అవసరం అంటూ తమ బంధాన్ని బయటపెట్టారు. చంద్రబాబుతో పవన్, లోకేశ్, సినీ నటుడు బాలకృష్ణ గురువారం ఉదయం ములాఖత్ అయ్యారు. ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న పవన్ అక్కడి నుంచి నేరుగా సెంట్రల్ జైల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పవన్, లోకేశ్, బాలకృష్ణ 40 నిమిషాలపాటు బాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా అరాచక పాలన సాగుతోందని, అందులో భాగంగానే చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు పంపారని విమర్శించారు.

మోదీ పిలిస్తేనే వెళ్లాను..

'జనసేన ఆవిర్భావ సభలో సగటు మనిషి ఆవేదన గురించి మాట్లాడాను. మా నాన్న అస్థికలు కాశీలో కలిపేందుకు వెళ్లిన సమయంలో ముంబయిలో తాజ్ హోటల్‌పై ఉగ్రవాదుల దాడి జరిగింది. అంతకు ముందు పార్లమెంట్‌పై దాడి జరిగింది. ఈ ఘటనలను చూసి దేశానికి సమర్థుడైన నాయకుడు కావాలని మోదీకి మద్దతు తెలిపిన విషయంలో నన్ను అందరూ తిట్టారు. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కు తగ్గనని వెల్లడించా. ఏ రోజైనా నరేంద్ర మోదీ నన్ను పిలిస్తే వెళ్లానే తప్ప.. నేనంతకు నేనే ఎప్పుడూ వెళ్లలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు అనుభవం ఉన్న నాయకుడు కావాలని 2014లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేశాయి. బాబుకు నాకు మధ్య పాలన, విధానపరమైన అభిప్రాయ బేధాలు ఉన్నాయి. కానీ, ఆయన అనుభవం, సమర్థతపై పూర్తి విశ్వాసం ఉంది' అని పవన్ స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మించిన వ్యక్తికి రూ.300 కోట్ల స్కామ్‌ను అంటగడతారా? అని ప్రశ్నించారు. 'బాబును ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) విచారించాల్సింది.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విచారిస్తోంది? అభియోగాలు అంటగట్టిన వ్యక్తి ఏమైనా మహానుభావుడా? వాజ్‌పేయా? లాల్ బహదూర్ శాస్త్రినా? కేసులు, రాజ్యాంగ ఉల్లంఘన, విదేశాలకు వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకునే వ్యక్తి మద్యపాన నిషేధం చేస్తాడా?' అని దుయ్యబట్టారు.

అడ్డగోలు హామీలిచ్చి నేటికీ అమలు చేయలేదు

రాష్ట్రంలో అడ్డగోలు హామీలిచ్చి నేటికీ అమలు చేయలేదని పవన్ మండిపడ్డారు. గుజరాత్‌లోని ముంద్రా పోర్టు వద్ద మూడు వేల కిలోల హెరాయిన్ దొరికితే దాని మూలాలు విజయవాడలో తేలాయని.. వీటిపై మీడియాలో వార్తలే రాకుండా చేశారని చెప్పారు. 'అడ్డగోలు దోపిడీ చేస్తే ఎవరూ ప్రశ్నించకూడదా? నన్ను ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఆపేస్తానంటావు, ఆ హక్కు నీకు ఉందా?' అని ప్రశ్నించారు. ఆర్థిక నేరస్తుడైన సీఎం వైఎస్ జగన్.. తాను కోనసీమ పర్యటనకు వెళ్తే 2 వేల మంది క్రిమినల్స్‌ను దాడికి దించారన్నారు. బాబు అరెస్టును సంపూర్ణంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో పట్టు విడుపులు ఉండాలని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇలా ఎన్నడూ వ్యవహరించలేదన్నారు. చంద్రబాబు అరెస్టయితే వైఎస్సార్‌సీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారని చెప్పారు.

విడివిడిగా ఎదుర్కోవడం కష్టం

సార్వత్రిక ఎన్నికల్లో విడివిడిగా పోటీచేస్తే వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం కష్టమని.. జనసేన, టీడీపీ కలిసి సమష్టిగా పోటీ చేస్తామని పవన్ ప్రకటించారు. 2019లో వేర్వేరుగా పోటీ చేసి నష్టపోయామని, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తామన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సీట్ల విషయం తర్వాత మాట్లాడతానని చెప్పారు. జనసేన ఒంటరిగా పోటీ చేయాలని చెప్పేందుకు మీరెవరని ప్రశ్నించారు. జైల్లో చంద్రబాబు భద్రత విషయమై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకెళ్తానన్నారు.

మేం అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదలం

'వైఎస్సార్‌సీపీ నేతలు మాపై రాళ్లు వేసేముందు ఆలోచించుకోవాలి. మేం అధికారంలోకి వస్తే మాపై రాళ్లు వేసిన వారెవరినీ వదలం. పోలీసు వ్యవస్థ ఇంత బానిసత్వంగా ఉంటే ఎవరూ ఏం చేయలేరు. డీజీపీ, సీఎస్‌తో సహా ఎవరిపైనైనా పాత కేసులు తిరగతోడే అవకాశం ఉంది. చట్టాలను అధిగమించే అధికారులు ఒక్కసారి ఆలోచించుకోవాలి. సొంత చెల్లిని, తల్లిని వదిలేసిన వ్యక్తి, బాబాయిని చంపించిన వ్యక్తిని అధికారులు నమ్ముకుంటున్నారు. మీకు రేపు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో ఆలోచించుకోండి. జగన్‌ను నమ్ముకుంటే కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే' అని పవన్ అధికారులు, పోలీసులను హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పులు సరిదిద్దుకునేందుకు ఆరు నెలల సమయం మాత్రమే ఉందన్నారు. యుద్ధం కావాలంటే సిద్ధంగా ఉంటామని ఆవేశంతో ఊగిపోయారు.

ప్రభుత్వంపై యుద్ధమే

- సివిల్‌వార్ మొదలు పెడతాం
- ఇందుకు పవన్ కలవడం ఆనందంగా ఉంది
- వార్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు కమిటీని నియమిస్తాం
- టీడీపీ నేతలు లోకేశ్, బాలకృష్ణ వెల్లడి

సాక్షి, రాజమహేంద్రవరం : కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వంపై యుద్ధం మొదలు పెట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బాలకృష్ణ, తాను కలిసి నిర్ణయించామని నారా లోకేశ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, ప్రశాంత జీవనం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సివిల్ వార్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు జనసేన, టీడీపీ నేతలతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం ఆయన బాలకృష్ణతో కలిసి మీడియాతో మాట్లాడారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తీసుకున్న తొలి నిర్ణయమే అరాచకమన్నారు. ప్రజా వేదిక కూలగొట్టడం నుంచి చంద్రబాబును రిమాండ్‌కు పంపే వరకు సైకో చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. చంద్రబాబు జైల్లో ఉన్నా, సింహంలానే ధైర్యంగా ఉన్నారని, బయట ఉన్న జగన్‌కే చెమటలు పట్టేలా చేస్తున్నారని చెప్పారు. జగన్ మానసిక వికలాంగుడు కాబట్టి ముఖ్యమంత్రిగా అన్ స్టేబుల్ అని చంద్రబాబు చెప్పారని వెల్లడించారు. 'చంద్రబాబు కట్టిన జైల్లోనే ఆయన్ని కట్టేశారు. ప్రభుత్వ దాడులను ప్రశ్నించిన టీడీపీ, జనసేన నేతలు, నాపై, పవన్ కళ్యాణ్‌పై ఎన్నో కేసులు పెట్టారు. గంజాయి స్మగ్లర్లపై కేసులు లేవు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మిస్బ అనే అమ్మాయిని వైఎస్సార్‌సీపీ నాయకులు అత్యాచారం చేసి చంపేస్తే నో కేస్. అమర్‌నాథ్ అనే కుర్రాడిని కొట్టి పెట్రోల్ పోసి తగలపెడితే ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు భద్రతపై మాకు ఆందోళనగా ఉంది. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. శాసనసభలో నా తల్లిని అవమానించిన ఘటనపై ఇవాళ పవన్ కళ్యాణ్ భువనేశ్వరితో తన బాధను పంచుకున్నారు. ఆ రోజు తాను ఎంతో బాధపడ్డానని పవన్ కళ్యాణ్ చెప్పారు. నా తల్లి కళ్లల్లో ఆనందం చూసేలా వచ్చే అసెంబ్లీ ఉండబోతోంది. ఇందుకు అంతా కలిసి పని చేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు. బ్రాహ్మణిని కించపరిచేలా ఎన్నో పోస్టులు పెడుతున్నారు. స్టాన్‌ఫోర్డ్‌లో చదివిన బ్రాహ్మణికి ఇవన్నీ అవసరమా? ప్రజల కోసమే అన్నీ భరిస్తున్నాం' అని చెప్పారు.

ఇకపై దెబ్బకు దెబ్బ

కేసులకు భయపడాల్సింది మేము కాదు. వైఎస్సార్‌సీపీ నేతలే. ఇకపై దెబ్బకు దెబ్బ.. వేటుకు వేటే. బాబు అరెస్టు ఘటనతో మేం ఇంకా బలపడుతున్నాం. రాష్ట్ర భవిష్యత్తు కోసమే యుద్ధం ప్రకటించాం. పవన్ కలవడం శుభపరిణామం. జగన్ ముఖ్యమంత్రి కావటం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం. తప్పు చేసిన వారంతా బయట ఉంటే, రాష్ట్ర బాగు కోసం పని చేసిన చంద్రబాబు జైల్లో ఉన్నారు.

– సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

అమావాస్య 'చంద్రుడు'తో పొత్తా!?

- విస్తుపోతున్న జన సైనికులు
- టీడీపీ కోసం ఎందుకింత వెంపర్లాట అని ఆశ్చర్యం
- నమ్ముకున్నోళ్లను నట్టేట ముంచారని ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, కాకినాడ : నిండు అమావాస్య రోజు 'తూర్పు' గడ్డపై పొడిచిన పొత్తుతో జన సైనికులు డీలా పడ్డారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం వేదికగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన పొత్తు ప్రకటన జనసైనికులను నిస్తేజంలోకి నెట్టేసింది. అవినీతిలో కూరుకుపోయిన చంద్రబాబుతో పొత్తు ఏమిటంటూ వారు విస్తుపోతున్నారు. ప్రధానంగా జనసేన కొద్దోగొప్పో ఆశలు పెట్టుకుందంటే అది గోదావరి జిల్లాలపైనే. అటువంటిది రాజకీయ చైతన్యం మెండుగా కలిగి, చారిత్రక నేపథ్యం కలిగిన రాజమహేంద్రవరం గడ్డపై టీడీపీతో కలిసి వెళతామని పవన్ ప్రకటించడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ నవనాడులు కుంగిపోయాయి. చాలా నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలను కూడా నియమించుకోలేని దుస్థితి. పైగా ఇప్పుడు ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో పీకలదాకా ఇరుక్కుపోయారు. అటువంటి టీడీపీతో పొత్తా అని జన సైనికులు విస్తుపోతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో టీడీపీకి ప్రత్యామ్నాయ శక్తిగా జనసేన అవతరిస్తుందనే అంచనాలను పవన్ కళ్యాణ్ తల్లకిందులు చేసేశారని తటస్తులు, మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పవన్ తనకు తానుగా జనసేనను నట్టేట ముంచేసే నిర్ణయం తీసుకున్నారని వాపోతున్నారు.

అవినీతి బాబుతో పొత్తు ఆంతర్యమేమిటి?

ప్రధానంగా జనసేనపై వల్లమాలిన అభిమానం పెంచుకున్న కాపు సామాజికవర్గం చంద్రబాబుతో పొత్తు అంటేనే కారాలు మిరియాలు నూరుతున్నారు. చంద్రబాబు సీఎంగా ఉండి జిల్లాలో కాపు ఉద్యమాన్ని అడుగడుగునా అణచివేసి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కుటుంబంపై దాష్టీకం సాగించిన రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అలాంటి బాబును అందలమెక్కిస్తామంటే పల్లకీ మోయడానికి కాపు సామాజికవర్గం సిద్ధంగా లేదని కుండబద్దలు కొడుతున్నారు. గత జూన్‌లో ఈ జిల్లాల్లో నిర్వహించిన వారాహి యాత్ర నారా వారి యాత్రగా సాగిందనే విమర్శలను తాజా ప్రకటనతో పవన్ నిజం చేశారంటున్నారు. పీకల్లోతు అవినీతి కుంభకోణంలో కూరుకుపోయిన చంద్రబాబుతో వచ్చే ఎన్నికల్లో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతానని పవన్ ఏ లెక్కన ప్రకటించారని, ఈ పొత్తులో ఆంతర్యమేమిటో అందరికీ స్పష్టత వచ్చిందని జన సైనికులు మండిపడుతున్నారు.

విడిపోతేనే కదా మళ్లీ కలవడానికి?

- టీడీపీ, జనసేన పొత్తుపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా
- పవన్ మనసులో ఎప్పటికీ చంద్రబాబే ఉంటారు
- సినిమాల్లో డైలాగ్‌లు బయట కూడా వేస్తే జనం నవ్వుతారు
- టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు కట్టకట్టుకుని వచ్చినా 2024లో విజయం వైఎస్సార్‌సీపీదే
- సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి, సుపరిపాలనకు 75 శాతం ప్రజల మద్దతు ఉంది
- అధికారంలో ఉన్న పార్టీకి ఈ స్థాయి సానుకూల వాతావరణం ఎన్నడూ లేదు
- దొంగను కాదని చంద్రబాబు కోర్టులో నిరూపించుకోవాలి



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ప్రకటించడంలో ఆశ్చర్యమేముందని, చంద్రబాబు, పవన్ విడిపోతే కదా మళ్లీ కలవడానికి అంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. పవన్ మనసులో ఎప్పుడూ చంద్రబాబే ఉంటారని, వారిద్దరూ ఎప్పుడూ కలిసే ఉన్నారని తాము ఆది నుంచి చెబుతున్నామన్నారు. ఆయన గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ జనసేనను స్థాపించారు. బాబు సూచన మేరకు 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీ–బీజేపీ కూటమికి మద్దతిచ్చారు. 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బాబును మళ్లీ సీఎంగా చేయడానికి టీడీపీ–బీజేపీ నుంచి వేరుపడ్డారు. బాబు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో ఐటీ శాఖ జరిపిన సోదాల్లో రూ. 2 వేల కోట్ల ముడుపుల బాగోతం బయటపడటంతో.. దాన్నుంచి తప్పించుకోవడానికి మళ్లీ బీజేపీతో పవన్ జట్టుకట్టేలా చంద్రబాబు చక్రం తిప్పారు. ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చేసి, చంద్రబాబును సీఎం చేయాలన్నది పవన్ ఆకాంక్ష' అంటూ దెప్పిపొడిచారు. వైఎస్సార్‌సీపీ నేతలు యుద్ధం కావాలని కోరుకుంటే యుద్ధమే చేస్తామని పవన్ వ్యాఖ్యానించడంపై స్పందిస్తూ.. పవన్ రాజకీయ నాయకుడే కాదని, ఆయన మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. సినిమాల్లో డైలాగులు బయట కూడా వేస్తే జనం నవ్వుతారని చెప్పారు.

సానుకూల ఓటుతోనే ఘనవిజయం సాధిస్తాం

సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు 75 శాతం ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీకీ ఇంత భారీ స్థాయిలో సానుకూల వాతావరణం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు కట్టకట్టుకుని వచ్చినా వైఎస్సార్‌సీపీని గెలిపించి.. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, సేవ చేయడం ద్వారా ప్రజల ఆశీస్సులు పొంది విజయం సాధించాలన్నదే వైఎస్సార్‌సీపీ విధానమని వివరించారు.

అడ్డంగా దొరికినా బాబు సుద్దపూసంటే ఎలా?

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల ప్రజల సొమ్ము దోచేశారనడానికి బలమైన సాక్ష్యాధారాలు ఉండటం వల్లే చంద్రబాబును ఏసీబీ కోర్టు జైలుకు పంపిందని సజ్జల చెప్పారు. దొంగను కాదని చంద్రబాబు కోర్టులో నిరూపించుకోవాలని సూచించారు. స్కిల్ స్కాంలో సీఐడీ, ఈడీ అరెస్టు చేసి, బెయిల్‌పై ఉన్న డిజైన్ టెక్ ఎండీతో కుంభకోణమే జరగలేదని ఎల్లో మీడియా చెప్పించిందని, ఒక దొంగ మాటలను ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంతో సంబంధమే లేదని, డిజైన్ టెక్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఒప్పందమే కుదుర్చుకోలేదని, డిజైన్ టెక్‌కు ప్రభుత్వం చెల్లించిన రూ.371 కోట్లు తమకు చేరలేదని, ఈ కుంభకోణంలో విచారణకు సహకరిస్తామని సీమెన్స్ సంస్థ ప్రకటించిందని తెలిపారు. ఆ డబ్బంతా చంద్రబాబు జేబుల్లోకి పోయిందన్నారు. షెల్ కంపెనీల ద్వారా రూ.240 కోట్లు, మరో రూ.వంద కోట్లను సింగపూర్‌కు పంపి.. హవాలా మార్గంలో దోచేసినట్లు జీఎస్టీ ఇంటెలిజెన్స్, ఈడీలు తేల్చాయని చెప్పారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన నలుగురిని ఈడీ అరెస్టు చేసి రూ.32 కోట్ల ఆస్తులు జప్తు చేసిందన్నారు. అయినా చంద్రబాబు సుద్దపూస అని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా చెబితే జనం నమ్ముతారనుకుంటే అది వారి అపోహ అని అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయటంలో సిద్ధహస్తుడినన్న నమ్మకంతోనే 2014–19 మధ్య చంద్రబాబు అడ్డగోలుగా కుంభకోణాలు చేసి, ప్రభుత్వ ఖజానాను దోచేశారన్నారు.

టీడీపీతో జనసేన పొత్తు ఊహించిందే

రాష్ట్ర గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం సెంట్రల్: టీడీపీ, జనసేన పార్టీల పొత్తు ముందే ఊహించిందేనని రాష్ట్ర భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం అనంతపురం జిల్లా పరిషత్‌లోని డీఆర్సీ భవనంలో సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ఆయన.. మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిన్నటిదాకా బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ కళ్యాణ్.. నేడు టీడీపీతో కలిసి ఎన్నికలకు వెళ్తానని ప్రకటించారన్నారు. ఈ విషయంలో బీజేపీ నుంచి సరైన ప్యాకేజీ లేకే యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఇన్నాళ్లు టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రజలను మాయ చేస్తూ వచ్చాయని, పవన్‌కళ్యాణ్ తాజా ప్రకటనతో వాస్తవం వెలుగు చూసిందన్నారు. ఎవరెంత మంది వచ్చినా.. ఎన్ని జెండాలు, అజెండాలతో వచ్చినా వైఎస్సార్‌సీపీ ఒకే అజెండాతో ప్రజల ముందుకు వెళ్తుందని, అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదేనని స్పష్టం చేశారు.

జనసేనకు ఆత్మహత్యాసదృశ్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: టీడీపీతో పొత్తు జనసేనకు ఆత్మహత్యాసదృశ్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాపులంటే కట్టు బానిసలు కాదని, పౌరుషం గల జాతి అని చెప్పారు. డబ్బు కోసం పవన్ ఏ గడ్డి అయినా కరుస్తాడని విమర్శించారు. అవినీతి పరుడైన చంద్రబాబుకు పవన్ వత్తాసు పలకడం దారుణమన్నారు. జైలులో చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారం చేసి వచ్చి పొత్తు ప్రకటించడం పవన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. జీవిత కాలం టీడీపీకి, చంద్రబాబుకు ఊడిగం చేయడానికి పవన్ పార్టీ పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్యాకేజీ స్టార్ అనే విమర్శలను చంద్రబాబు ఏనాడైనా ఖండించాడా అని మంత్రి ప్రశ్నించారు. పవన్ ప్యాకేజీ స్టార్ అనడానికి అంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. కాపు జాతికి తీరని ద్రోహం చేసింది చంద్రబాబేనని అన్నారు. చంద్రబాబుతో పొత్తు పెట్టుకోవడం అంటే కాపు జాతికి తీరని ద్రోహం చేసినట్టేనన్నారు. కాపుజాతి చంద్రబాబుకు ఊడిగం చేయాల్సిందేనా అని పవన్ చర్యలతో కాపు సామాజికవర్గం ప్రశ్నిస్తోందన్నారు. 2024 ఎన్నికల్లో కాపు జాతి పౌరుషాన్ని చూపించి కాపు ద్రోహి చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

పొత్తు, లోగుట్టు ఎప్పుడో తెలుసు: ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు దానిలో లోగుట్టు తమకెప్పుడో తెలుసునని.. ఇదేదో చిదంబర రహస్యంలా పవన్ కళ్యాణ్ ఈ రోజు ప్రకటించడమే హాస్యాస్పదంగా ఉందని ఎంపీ మార్గాని భరత్ రామ్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు, పవన్ లోపాయికారి ఒప్పందాలు, బేరాలు అందరికీ తెలుసన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి, సానుభూతికోసం టీడీపీ, జనసేన వేస్తున్న కొత్త ఎత్తుగడలు ప్రజలకు తెలిసినవే అన్నారు. పవన్‌కు చంద్రబాబు ఇచ్చిన టాస్క్ ఈ నాలుగేళ్లలో సక్సెస్ కాకపోవడంతో ముసుగు తీసేశారని విమర్శించారు. బీజేపీ వద్దకు పవన్‌ను, తన పార్టీ ఎంపీలు నలుగుర్ని పంపింది చంద్రబాబేనని అన్నారు.

అది ములాఖత్ కాదు.. మిలాఖత్

- జైల్లో పరామర్శకు వెళ్లావా? ప్యాకేజీకి వెళ్లావా?
- చంద్రబాబుతో ఏం మాట్లాడుకుని వచ్చావో నీ పార్టీ జెండా మోసే సైనికులకైనా చెప్పు పవన్?
- జైల్లో బాబు, పవన్ భేటీపై పేర్ని నాని



సాక్షి,అమరావతి: 'రాజమండ్రి సెంట్రల్ జైలుకు చంద్రబాబును పరామర్శించడానికి వెళ్లావని అనుకున్నాం. బాబుతో బేరం (ప్యాకేజీ) మాట్లాడ్డానికి వెళ్లావా' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను దుయ్యబట్టారు. పేర్ని నాని గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'రాజమండ్రి సెంట్రల్ జైల్‌కి క్రిమినల్ ప్రిజనర్ నంబర్ 7691ని ములాఖత్ పేరుతో కలవడానికి ముగ్గురు వస్తున్నారని, వారిలో పవన్ ఉన్నారని చెప్పారు. వారు బయటకు వచ్చాక అర్థమైంది ఏంటంటే.. అది పెద్ద ప్యాకేజీ డ్రామా అని. చంద్రబాబుతో పవన్‌ది ములాఖత్ కాదు., మిలాఖత్ అని. సెంటిమెంట్ కాదు.. సెటిల్‌మెంట్ అని తేలింది. బీజేపీతో పవన్‌ది తాత్కాలిక పొత్తు మాత్రమే. టీడీపీతో శాశ్వత పొత్తు. దీనిపై పవన్‌కు క్లారిటీ ఉంది. బీజేపీకే లేదు.' అని చెప్పారు. అమావాస్య రోజున టీడీపీ, జనసేన పొత్తు 'శుభ' సూచకం అని అందరూ అంటున్నారని వ్యంగ్యంగా అన్నారు. చంద్రబాబుతో పవన్ ఏం మాట్లాడుకున్నాడో కనీసం ఆయన పార్టీ జెండా మోసే సైనికులకైనా చెప్పాలి కదా అని అన్నారు. 'జనం సొమ్ము దోచిన వ్యక్తిని పరామర్శిస్తావా? మీ ఇద్దరి మధ్య ఏం సిద్ధాంతాలు కలిశాయి? మీ తమ్ముడు లోకేశ్, బాబాయ్ చంద్రబాబు దొంగలు అని అన్నావ్ కదా? దోచేసిన డబ్బంతా హెరిటేజ్‌లో పెడుతున్నారని చెప్పావు. అవినీతిపై పోరాటం అంటూ నీ జెండా మోసే నీ పిల్లలకు ఏం చెప్తావు? ఆ దొంగలతో ఎందుకు కలిశావో ప్రజలకు చెప్పు' అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ వాళ్లని ఎవ్వరినీ వదలనంటున్న పవన్ చేతనైంది చేసుకోవచ్చని అన్నారు. బాలకృష్ణ ఏం మాట్లాడారో పవన్‌కు గుర్తులేదా.. అని ప్రశ్నించారు. బాలకృష్ణ మాటలకు కట్టుబడితే మీతో వెళ్లకూడదు కదా అని అన్నారు. వాళ్లెన్ని గుంపులు కట్టి వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని, జనం గుండెల్లో సీఎం వైఎస్ జగన్ స్థానం సుస్థిరమని పేర్ని నాని చెప్పారు. వైఎస్సార్‌సీపీని ఓడించడానికి బీజేపీ కూడా కలిసి రావాలని పవన్ అంటున్నారని, ఎన్ని పార్టీలను కలుపుకొని వచ్చినా సీఎం జగన్‌ను 20ఏళ్లపాటు ఏమీ చేయలేరనేది 2024 ఎన్నికల్లో అర్థం అవుతుందని చెప్పారు. 2024లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు వాడుకుని వదిలేస్తాడని పవనే గతంలో చెప్పారన్నారు. బాబుతో ఉన్నవి సైద్ధాంతిక విభేదాలేనని ఇప్పుడు పవన్ చెప్పడం పెద్ద జోక్ అని అన్నారు. రాష్ట్రంలో పేద నిరుద్యోగ పిల్లలకు నైపుణ్యం నేర్పుతానని మోసం చేసి రూ.371 కోట్లు దోచిన దొంగను పలకరించడానికి వెళ్లారని విమర్శించారు. స్కిల్ స్కాం కేసులో ఈడీ, జీఎస్టీ శాఖలు రెండూ ఎఫ్ఐఆర్ నమోదు చేశాయని, చంద్రబాబు స్నేహితులు డిజైన్ టెక్ ఎండీని, సుమన్ బోస్‌ని ముద్దాయిలను చేశాయని, అయినా ఏమీ తెలియనట్లే ఈ కేసు అన్యాయం అక్రమం అని అంటున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వమే కేసు కట్టి కొంత మందిని అరెస్ట్ చేసిందని, రేపో మాపో మరికొంతమందిని కూడా ఎత్తుకెళ్లొచ్చని అన్నారు. పవన్ మాత్రం అందరమూ కలిసి వెళ్తామని అంటున్నారని, లెక్కలు సరిచేసుకున్న వారే ఇవన్నీ చెప్తారని అన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపెయిన్

5 దశల్లో కార్యక్రమం అమలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని ఆస్పత్రులను ఆధునీకరించి, వైద్య సేవలను మెరుగు పరిచారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య సేవలను ప్రజల ముంగిటకే చేర్చారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి వాకబు చేసి, ముందస్తుగానే వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది వాకబు చేస్తారు. ఆ తర్వాత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తారు. దీని ద్వారా ఆరోగ్య సమస్యలు మరింత పెద్దవై, చికిత్సకు లొంగని దశకు చేరకుండా ముందుగానే గుర్తించి, వైద్యం అందించి, ఆరోగ్యవంతులుగా చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన ఈ కార్యక్రమం లక్ష్యం.

5 దశల్లో ఈ కార్యక్రమం అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి ఇంటింటి క్యాంపెయిన్ మొదలవుతుంది. ప్రజల సమస్యల పరిష్కారానికి చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం తరహాలోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో కూడా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తారు. తొలుత వాలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి, ప్రజలందరికీ ఈ కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తారు. తొలి దశ వైద్య శిబిరాలు నిర్వహించే పట్టణాలు/గ్రామాల్లో ముందుగా ఈ క్యాంపెయిన్ మొదలవుతుంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను కూడా వివరిస్తారు. అవసరమైన వారు ఈ పథకం కింద ఉచిత వైద్య సేవలను ఏ విధంగా పొందాలో తెలియజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.60 కోట్లకు పైగా గృహాల్లో ఆరోగ్యశ్రీ సేవలను వివరిస్తూ ప్రత్యేక బ్రోచర్‌ను వాలంటీర్లు అందజేస్తారు. పథకం కింద ఎన్ని రకాల జబ్బులకు చికిత్స అందిస్తారు, వైద్యం అందించే ఆస్పత్రులు, వాటి చిరునామాలు, ఇతర వివరాలు ఉంటాయి. అదే విధంగా స్మార్ట్ ఫోన్లలో ఆరోగ్యశ్రీ సిటిజెన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి దాని వినియోగంపై అవగాహన కల్పిస్తారు. ఆ తర్వాత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికీ వచ్చి ఆరోగ్యపరమైన అంశాలపై వాకబు చేస్తారు. ఆ ప్రాంతంలో హెల్త్ క్యాంప్ నిర్వహించే రోజు, ప్రాంతం తెలిపి, ఆరోజున అందుబాటులో ఉండాలని ప్రజలకు చెబుతారు. ఈ నెల 30 నుంచి మొదటి దశ వైద్య శిబిరాలు (హెల్త్ క్యాంప్‌లు) ప్రతి మండలంలో ఏదో ఒక పట్టణం/గ్రామంలో నిర్వహిస్తారు. ఇందులో వైద్యులు, ఇతర సిబ్బంది ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేస్తారు. మందులు కూడా ఉచితంగా ఇస్తారు. అవసరమైన వారిని సమీపంలోని పెద్ద ఆస్పత్రులకు పంపించి, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తారు.



ఆరోగ్య ఏపీ సాధనే లక్ష్యం

- ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు చెప్పారు. ఈ కార్యక్రమం అమలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు దశల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. తొలి దశలో క్యాంపెయిన్, రెండో దశలో ప్రజల ఆరోగ్యంపై వాకబు, ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. మూడో దశలో మరో మారు హెల్త్ క్యాంప్‌లపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నాలుగో దశలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఐదో దశలో కాలానుగుణంగా ఫాలోఅప్ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో గ్రామ, వార్డు సచివాలయాలు, మహిళా, శిశు సంక్షేమ, విద్య, మున్సిపల్, గిరిజన శాఖల బాధ్యతలను ఉత్తర్వుల్లో తెలియజేశారు.

• తెలంగాణ

టాలీవుడ్‌లో మరో డ్రగ్ కలకలం

8 మందిని అరెస్ట్ చేసిన నార్కోటిక్స్ బ్యూరో

వీరిలో 'డియర్ మేఘ' సినీ దర్శకుడు, నైజీరియన్లు

రూ. 10 లక్షల డ్రగ్స్ స్వాధీనం

పరారీలో హీరో నవదీప్, నిర్మాత రవి

సాక్షి, హైదరాబాద్: మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో దొరికిన తీగను లాగుతుంటే టాలీవుడ్ డ్రగ్ డొంక కదులుతోంది. తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్–నాబ్) అధికారులకు గత నెల 31న అక్కడి సర్వీస్ ఫ్లాట్‌లో చిక్కిన వారిలో ఫిల్మ్ ఫైనాన్షియర్ కె.వెంకట రమణారెడ్డి ఉండగా... గురువారం పట్టుబడిన వారిలో 'డియర్ మేఘ' చిత్ర దర్శకుడు అనుగు సుశాంత్ రెడ్డి ఉన్నారు. హీరో నవదీప్, 'షాడో' చిత్ర నిర్మాత రవి ఉప్పలపాటి తదితరులు పరారీలో ఉన్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. ఐసీసీసీలో టీఎస్–నాబ్ ఎస్పీ (వెస్ట్) డి.సునీత రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో...

నెల్లూరుకు చెందిన బి.బాలాజీ గతంలో ఇండియన్ నేవీలో అధికారిగా పని చేశాడు. కంటికి గాయం కావడంతో మెడికల్లీ అన్‌ఫిట్ అయ్యాడు. నేవీ నుంచి బయటకు వచ్చి వ్యాపారిగా మారాడు. తరచుగా హైదరాబాద్‌కు వచ్చి వెళ్లే బాలాజీ స్నేహితులతో కలిసి ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లోని సర్వీస్ ఫ్లాట్‌లో రేవ్ పార్టీలకు హాజరయ్యేవాడు. ఇలా ఇతడికి హైదరాబాద్, బెంగళూరు డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో రేవ్ పార్టీలు నిర్వహించేవాడు. స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈ యాప్‌లో మెసేజ్ చదవగానే డిస్‌అప్పియర్ అయ్యే ఆప్షన్ ఉండటంతోపాటు కస్టమర్లకు ప్రత్యేక కోడ్‌లు ఇవ్వడం ద్వారా దందా సాగించాడు. గత నెల 31న ఇతడితోపాటు రమణారెడ్డి, ఆర్పీఎఫ్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పని చేస్తున్న డి.మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించడంతో ఈ డ్రగ్స్ మూలాలు బయటపడ్డాయి.

నైజీరియన్ల ద్వారా రామ్ కిషోర్‌కు..

బాలాజీ ముగ్గురు నైజీరియన్లతోపాటు నగరానికి చెందిన రామ్ కిషోర్ వైకుంఠం (పరారీలో ఉన్నాడు) నుంచి డ్రగ్స్ ఖరీదు చేసేవాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమోబీ చికోడి మొనగాలు, ఇక్బావే మైకేల్, థామస్ అనఘకాలు నుంచి బాలాజీకి కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ అందుతున్నాయి. డ్రగ్ పార్టీల నిర్వహణకు బాలాజీకి రమణారెడ్డి ఫైనాన్స్ చేస్తుండేవాడు. ఇతడికి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా ఉంది. ఇందులో ప్రస్తుతం రూ.5.5 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రమణారెడ్డి, బాలాజీలకు ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన 18 మంది కస్టమర్లలో సినీ రంగానికి చెందిన వారితో పాటు పబ్‌లు, స్నూకర్ పార్లర్ల నిర్వాహకులు ఉన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో స్నాట్ పబ్ నిర్వహించే సూర్య, జూబ్లీహిల్స్‌లో టెర్రా కేఫ్ అండ్ బిస్త్రో నిర్వహించే అర్జున్, గుంటూరులో స్నూకర్ పార్లర్ నిర్వహించే కృష్ణప్రణీత్ కీలకం. వీరు తమ సంస్థల్లోనే రహస్య గదుల్లో డ్రగ్స్ వినియోగానికి సహకరిస్తూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్లు ఆఫ్ చేసుకున్న నవ్‌దీప్, రవి

బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్న వారిలో ప్రముఖులు, సినీ రంగానికి చెందిన వారూ ఉన్నట్లు టీఎస్ నాబ్ గుర్తించింది. హీరో నవదీప్, షాడో, రైడ్ చిత్రాల నిర్మాత రవి ఉప్పలపాటి, మోడల్ శ్వేత, మాజీ ఎంపీ దేవరకొండ విఠల్‌రావ్ కుమారుడు సురేశ్ రావ్, ఇంద్రతేజ్, కార్తీక్‌లతోపాటు కలహర్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బెంగళూరులో జరిగిన డ్రగ్ పార్టీకి హాజరయ్యారనే విషయం 2021లో వెలుగులోకి వచ్చి కలకలం సృష్టించింది. ఈ పార్టీ నిర్వాహకుడు కలహర్‌రెడ్డే కావడం గమనార్హం. మరోపక్క ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేసిన 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులోనూ నవదీప్ పేరు ఉంది. నిందితుల కోసం ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరుల బృందం గాలించింది. అమోబీ చికోడి, ఇక్బావే మైకేల్, థామస్‌తోపాటు సురేశ్ రావ్, కొల్లి రామ్‌చంద్, కూరపాటి సందీప్, అనుగు సుశాంత్ రెడ్డి, కృష్ణ ప్రణీత్‌లను పట్టుకుంది. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. నవదీప్, రవి ఉప్పలపాటి సహా మిగిలిన నిందితులు తమ ఫోన్లు ఆఫ్ చేసుకుని, కుటుంబంతో సహా పరారయ్యారు.

మళ్లీ తెరపైకి మద్యం కుంభకోణం

- ఎమ్మెల్సీ కవితకు మరోసారి ఈడీ నోటీసులు
- నేడు లేదా రేపు ఢిల్లీలో విచారణకు రావాలని ఆదేశం
- ఇది ఈడీ నోటీసు కాదు.. మోదీ నోటీసు: ఎమ్మెల్సీ కవిత

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. శుక్రవారం లేదా శనివారం విచారణ కోసం ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి రావాలని ఆదేశించింది. ఎమ్మెల్సీ కవితకు దర్యాప్తు సంస్థలు నోటీసులు జారీ చేయడం ఇది నాలుగో సారి. ఇంతకుముందు ఈ ఏడాది మార్చిలో ఆమెకు ఈడీ వరుసగా నోటీసులు జారీ చేసింది. ఆ నెలలో 16, 20, 21వ తేదీల్లో మూడుసార్లు ఆమెను వివిధ అంశాలపై ప్రశ్నించింది. మరోవైపు గతేడాది చివర్లో లిక్కర్ కుంభకోణం అంశంలోనే సీబీఐ కూడా కవితను హైదరాబాద్‌లోని నివాసంలో విచారించింది. ఇప్పుడు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో నిందితులైన కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు, దినేశ్ అరోరా, శరత్‌చంద్రారెడ్డి, మాగుంట రాఘవతోపాటు తాజాగా అరుణ్ రామచంద్ర పిళ్లై తదితరులు అప్రూవర్‌గా మారారు. ఈడీ అరుణ్ పిళ్లైను కవితకు బినామీగా పేర్కొంటోంది. బుధవారమే ఆయన అప్రూవర్‌గా మారడం, ఆ మరునాడే కవితకు ఈడీ నోటీసులు రావడం కలకలం రేపుతోంది. గతంలో మూడు సార్లు ఈడీ విచారించినప్పుడు ప్రతి సారి కవితను అరెస్టు చేయవచ్చంటూ ప్రచారం జరిగింది. ఇప్పుడు కూడా అలాంటి ప్రచారం మొదలైంది. కొన్నినెలల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈడీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న దానిపై చర్చ మొదలైంది.

కక్షతోనే నోటీసు: కవిత

తనకు పంపినవి ఈడీ నోటీసులు కాదని.. అవి మోదీ నోటీసులు అని, రాజకీయ కక్షతోనే పంపారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గురువారం నిజామాబాద్‌లో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ఈ నోటీసుల విషయమై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ఈడీ నోటీసులను తమ పార్టీ లీగల్ సెల్‌కు పంపించామని.. లీగల్ బృందం సూచనల మేరకు ముందుకు వెళతామని చెప్పారు. 'రాజకీయ కక్షతోనే ఈడీ నోటీసులు ఇచ్చారు. వీటికి భయపడే ప్రసక్తే లేదు. టీవీ సీరియల్ మాదిరిగా ఏడాది కాలం నుంచి సాగదీస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున మరో కొత్త ఎపిసోడ్ రిలీజ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు.

‘నోట్’ దిస్ పాయింట్

- ‘స్కిల్’ కుంభకోణం మాస్టర్ మైండ్ బాబే
- 13 చోట్ల ఏ–1 చంద్రబాబు సంతకాలు
- ఏ–2 అచ్చెన్న సంతకాలు ఐదు చోట్ల
- నోట్ ఫైళ్ల సాక్షిగా కుంభకోణం బట్టబయలు


సాక్షి, అమరావతి: చంద్రబాబు కోసం చంద్రబాబు చేత చంద్రబాబు కొరకు.. ఇదీ టీడీపీ ప్రభుత్వంలో రూ.371 కోట్లు కొల్లగొట్టిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం. తనకేం సంబంధం లేదని చంద్రబాబు ఎంతగా బుకాయించినా, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లు ఆయన బండారాన్నిబట్టబయలు చేస్తున్నాయి. కేవలం నిధులు కొల్లగొట్టేందుకే చంద్రబాబు ఆద్యంతం తానై వ్యవహరించారన్నది ఆధారాలతోసహా వెల్లడైంది. కేబినెట్ ఆమోదం లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం నుంచి జీవోకు విరుద్ధంగా ఒప్పందం.. ఒప్పందానికి విరుద్ధంగా నిధులు అక్రమంగా విడుదల చేసే వరకు ఆయనే సర్వం తానై వ్యవహరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని స్వయంగా ఆదేశించారు. కుంభకోణానికి మార్గం సుగమం చేస్తూ.. నిధులు కొల్లగొట్టేందుకు నోట్ ఫైళ్లలో 13 చోట్ల చంద్రబాబు సంతకాలు చేయగా, ఏ–2గా ఉన్న అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఐదు చోట్ల సంతకాలు చేశారు. ఈ కుంభకోణానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్–ట్రైనింగ్, సాధారణ పరిపాలన శాఖకు చెందిన మొత్తం 13 నోట్ ఫైళ్లలో చంద్రబాబు చేసిన సంతకాలు ఆయన ప్రత్యక్ష ప్రమేయాన్ని వెల్లడిస్తున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.


ఏ1 చంద్రబాబు సంతకాలు

ప్రభుత్వ శాఖ	సంతకం చేసిన నోట్ ఫైల్ పేజీ	తద్వారా ఆదేశించిన విషయం
ఆర్థిక శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 42	రూ.370 కోట్లు విడుదల చేయాలి (దాంతో నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారు)
ఆర్థిక శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 58	ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు గురించి (దాంతోనే కేబినెట్ ఆమోదం లేకుండా ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు)
ఉన్నత విద్య శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్లు 252, 253, 254	ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డ్ ఏర్పాటుకు ఆదేశం
ఉన్నత విద్య శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 258	ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డ్‌కు ఆమోదం
ఉన్నత విద్య శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 262	ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారుల నియామకం
ఉన్నత విద్య శాఖ	ఎన్‌గ్జర్–1 పేజీ నంబర్ 119	చార్టెడ్ అకౌంటెంట్ జె.వెంకటేశ్వరరావు నియామకం (టీడీపీకి చెందిన ఈయన్ను సీఈవోకు సహాయకుడిగా నియమించారు)
సాధారణ పరిపాలన శాఖ	ఎన్‌గ్జర్–2, పేజీ నంబర్ 21	ఏపీఎస్ఎస్‌డీసీ బడ్జెట్‌కు ఆమోదం
సాధారణ పరిపాలన శాఖ	ఎన్‌గ్జర్–4, పేజీ నంబర్ 15	గంటా సుబ్బారావును స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ శాఖ కార్యదర్శి, సీఎం ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియామకానికి ప్రతిపాదన
సాధారణ పరిపాలన శాఖ	ఎన్‌గ్జర్–8, పేజీ నంబర్ 5	సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ క్లస్టర్ల ఏర్పాటు, 90 శాతం సీమెన్స్ వాటా, 10 శాతం ప్రభుత్వ వాటాపై చర్చ
సాధారణ పరిపాలన శాఖ	ఎన్‌గ్జర్ –1, పేజీ 11	డిప్యూటీ సీఈవోగా అపర్ణ, ఉపాధ్యాయుల నియామకం (ఈమె సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా చెప్పుకున్న జీవీఎస్ భాస్కర్ భార్య)
స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ శాఖ	ఎన్‌గ్జర్–8, పేజీ నంబర్ 40	సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ క్లస్టర్ల కింద కాలేజీల ఎంపిక
స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ శాఖ	ఎన్‌గ్జర్–8, పేజీ నంబర్ 41	క్లస్టర్లుగా ఎస్వీయూ, మదనపల్లిలోని ఎంబీటీల ఎంపిక
సాధారణ పరిపాలన శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 2	మీటింగ్ మినిట్స్‌కు ఆమోదం

ఏ-2 అచ్చెన్న సంతకాలు

ఆర్థిక శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 42	రూ.370 కోట్ల మంజూరు కోసం
ఉన్నత విద్య శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 258	ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డ్ ఏర్పాటు
ఉన్నత విద్య శాఖ	ఎన్‌గ్జర్–1, పేజీ నంబర్ 262	ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారుల నియామకం
స్కిల్ డెవలప్‌మెంట్–ట్రైనింగ్	ఎన్‌గ్జర్–8, పేజీ నంబర్ 40	స్కిల్ డెవలప్‌మెంట్ క్లస్టర్ల ఎంపిక
స్కిల్ డెవలప్‌మెంట్–ట్రైనింగ్	ఎన్‌గ్జర్–8, పేజీ నంబర్ 41	క్లస్టర్లుగా తిరుపతిలోని ఎస్వీయూ, మదనపల్లిలోని ఎంబీటీల ఎంపిక






కనీసం తేదీ, నంబర్ లేకుండానే చంద్రబాబు సంతకం చేసిన డాక్యుమెంట్







స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించిన నోట్ ఫైళ్లలో చంద్రబాబు చేసిన సంతకాలు

అప్పులు తీర్చేస్తున్నారు



ప్రభుత్వ చర్యలతో సకాలంలో రుణాలు చెల్లించేస్తున్న రైతులు

2019-20 నుంచి 2022-23 నాటికి వ్యవసాయ రుణాల్లో మొండిబకాయిల తగ్గుదల ఇలా..

2019-20 రంగం	మొండిబకాయిల శాతం	2022-23 రంగం	మొండి బకాయిల శాతం
స్వల్పకాలిక పంట రుణాలు	3.18	స్వల్పకాలిక పంట రుణాలు	2.33
వ్యవసాయ టర్మ్ రుణాలు	4.00	వ్యవసాయ టర్మ్ రుణాలు	2.21
వ్యవసాయం	3.57	వ్యవసాయం	2.60

బ్యాంకుల వ్యవసాయ రుణాల మంజూరు పెరుగుదల ఇలా.. (రూ.కోట్లలో)

వివరాలు	31-03-2019 నాటికి	31-03-2020 నాటికి	31-03-2021 నాటికి	31-03-22 నాటికి	31-03-2023 నాటికి
స్వల్పకాలిక పంట రుణాలు	98,078	1,04,940	1,22,196	1,22,369	1,55,979
వ్యవసాయ టర్మ్ రుణాలు	41,956	45,630	57,121	72,894	78,145
మొత్తం రుణాలు :	1,40,034	1,50,570	1,79,317	1,95,263	2,34,124

నవరత్నాల ద్వారా రైతులకు నగదు బదిలీ ఇలా.. (రూ.కోట్లలో)

పథకం	లబ్ధిదారులు	నగదు బదిలీ
వైఎస్సార్ రైతు భరోసా	52,38,517	30,985.29
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	54,75,651	7,802.05
ఇన్‌పుట్ సబ్సిడీ	22,73,468	1,965.42
వైఎస్సార్ సున్నా వడ్డీ	73,87,602	1,834.55

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా రైతులకు అనుకూలంగా తీసుకుంటున్న పలు రకాల చర్యల ఫలితంగా వ్యవసాయ రుణాల్లో మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు) తగ్గుముఖం పట్టాయి. ఈ విషయాన్ని 223వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం అజెండా పేర్కొంది. ఇది శుభ పరిణామంగా కమిటీ తెలిపింది. నిజానికి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అన్ని రకాలుగా చేదోడువాదోడుగా నిలుస్తుండడంతో రైతులు సంతోషంగా ఉంటున్నారు. దీంతో తాము తీసుకున్న అప్పులను ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించేస్తున్నారు. ఫలితంగా మొండిబకాయిల శాతం ఏటేటా తగ్గుతోంది. నిజానికి.. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నవరత్నాల్లో భాగంగా రైతులకు వైఎస్సార్ రైతుభరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నావడ్డీ వంటి అనేక పథకాలు ఏటా అమలుచేస్తుండడం.. వర్షాలు కూడా సమృద్ధిగా కురవడంతో వ్యవసాయం లాభసాటిగా మారింది. దీంతో నిర్ణీత గడువులోగా బాకీలు తీర్చడంలో రైతులు గతంలో ఎప్పుడూలేని విధంగా ముందుంటున్నారు.

టీడీపీ తీరుతో అప్పుల ఊబిలోకి..

గత తెలుగుదేశం ప్రభుత్వం వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి అరకొర మాఫీతో రైతులను మోసగించడంతో రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయారు. దీంతో వ్యవసాయ రుణాల మొండిబకాయిలు పెరిగిపోయాయి. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు వైఎస్సార్ రైతుభరోసా క్రమం తప్పకుండా ఇవ్వడంతోపాటు రైతులకు అండగా నిలబడే పలు కార్యక్రమాలు చేపట్టింది. ఫలితంగా.. వ్యవసాయ రుణాల్లో మొండిబకాయిలు 2019–20లో 3.57 శాతం నుంచి 2022–23 నాటికి 2.60 శాతానికి తగ్గిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం.. సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు సున్నా వడ్డీ రాయితీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరుద్ధరించి అమలుచేయడమే. అంతేకాక.. గత టీడీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన సున్నా వడ్డీ రాయితీ మొత్తాన్ని కూడా చెల్లించింది. దీంతో రైతులు పంట రుణాలతో పాటు వ్యవసాయ టర్మ్ రుణాలను కూడా సకాలంలో చెల్లిస్తున్నారు. దీనికితోడు వైఎస్ జగన్ ప్రభుత్వం రైతుల పెట్టుబడి వ్యయం కోసం వైఎస్సార్ రైతుభరోసా పేరుతో ఏడాదికి రూ.13,500లను ఇస్తోంది. అలాగే, పంట నష్టపోయిన రైతులకు ఒకపక్క ఉచిత పంటల బీమాను వర్తింపజేస్తూనే మరోపక్క ఇన్‌పుట్ సబ్సిడీనీ ఎప్పటికప్పుడు చెల్లిస్తోంది. దీంతో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాల్లో మొండిబకాయిలు తగ్గుతున్నాయి.

పెరిగిన వ్యవసాయ రుణాలు..

మరోపక్క.. రైతులు తమ రుణాలను సకాలంలో చెల్లిస్తుండడంతో గత నాలుగేళ్లుగా వారికి వ్యవసాయ రుణాల మంజూరు కూడా పెరిగింది. సకాలంలో అప్పులు చెల్లించిన రైతులకు ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 73,87,602 మంది రైతులకు సున్నావడ్డీ రాయితీని చెల్లించిందని, గత టీడీపీ ప్రభుత్వ బకాయిలను కూడా చెల్లించినట్లు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ అజెండాస్పష్టంచేసింది. ఇక ఇప్పటివరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సున్నావడ్డీ కింద రూ.1,834 కోట్లను చెల్లించింది. ఈ నేపథ్యంలో.. వ్యవసాయ రంగంలో రైతులకు మేలు కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల కారణంగా బ్యాంకులు కూడా వ్యవసాయ రంగానికి రుణాల మంజూరును ఏటేటా పెంచుతున్నాయి. ఉదా.. 2019 మార్చి నాటికి మొత్తం వ్యవసాయ రుణాలు రూ.1,40,034 కోట్లు ఉంటే.. 2022–23 నాటికి అవి రూ.2,34,124 కోట్లకు పెరిగాయి. ఇలా వ్యవసాయానికి అవసరమైన రుణాల మంజూరును బ్యాంకులు పెంచుతుండగా మరోపక్క ఆ రుణాల్లో మొండిబకాయిలు తగ్గుతున్నాయంటే ప్రభుత్వ జోక్యమే కారణమని అధికార వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా...

సిద్ధార్థ లూథ్రాపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సూర్యప్రకాశరావు తదితరులు

ప్రకాశం నగర్: ప్రజలు ఆయుధాలు పట్టి ఉద్యమించాలంటూ రెచ్చగొట్టేలా ట్విట్టర్‌లో పోస్టు చేసిన సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రాపై చర్యలు తీసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు గురువారం స్థానిక ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ చంద్రబాబు తరఫున వాదిస్తున్న లూథ్రా తన వాదనల ద్వారా ఆశించిన తీర్పు రాని కారణంగా ఒక మత ప్రవక్త సూక్తిని ప్రస్తావిస్తూ హింసను ప్రేరేపించడం నేరమన్నారు. ఇలాంటి చర్యకు పాల్పడిన ఆయన వెంటనే తన ప్రకటనను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆయనను చట్టం ప్రకారం విచారించాలని పోలీసులను కోరారు.

ఢిల్లీకి ప్రత్యేక విమానంలో లోకేశ్

సాక్షి, అమరావతి: లోకేశ్ గురువారం ప్రత్యేక విమానంలో రాజమండ్రి నుంచి ఢిల్లీకి వెళ్లారు. లోకేశ్ వెంట టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు వెళ్లారు. చంద్రబాబు అరెస్ట్‌పై జాతీయ మీడియాతో లోకేశ్ మాట్లాడనున్నారు. చంద్రబాబుపై కేసు విషయమై సుప్రీంకోర్టు న్యాయవాదులతో ఆయన చర్చించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు ప్రయత్నిస్తారని సమాచారం.

సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తా.. నాకు బెయిల్ ఇవ్వండి

ఏసీబీ కోర్టులో చంద్రబాబు పిటిషన్

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో గురువారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన బెయిల్ పిటిషన్ తేలేంత వరకు తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. ఈ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు శుక్రవారం విచారణ జరిపే అవకాశం ఉంది. ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుగా ఉన్న చంద్రబాబు ఇటీవల అరెస్టయి కోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. రాజకీయ కక్ష, దురుద్దేశంతో ఈ కేసులో తనను నిందితునిగా చేర్చారని చంద్రబాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదులో తన పేరు లేదన్నారు. ఈ కుంభకోణంలో తన పాత్ర ఉందనేందుకు సీఐడీ వద్ద ప్రాథమిక ఆధారాలు లేవన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), జీఎస్టీ లాంటి సంస్థలు సేకరించిన వివరాల ఆధారంగా తనను ఈ కేసులో ఇరికిస్తున్నారని, అలా చేయడానికి ఎంతమాత్రం వీల్లేదన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై పోరాడుతున్నానని తెలిపారు. అధికార పార్టీ చేస్తున్న అక్రమ, అన్యాయాలను ప్రశ్నిస్తున్నందుకు.. అవినీతి, ప్రజాధనం, దుర్వినియోగంపై పోరాటం చేస్తున్నందుకు తనపై ఈ కేసు నమోదు చేశారన్నారు. జైలులో తనకు ప్రాణహాని ఉందని.. బీపీ, షుగర్‌తో బాధపడుతున్నానని చంద్రబాబు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని.. సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేస్తారనేందుకు సీఐడీ ఎలాంటి ఆధారాలు చూపడంలేదని ఆయన తెలిపారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తనకు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు న్యాయస్థానాన్ని కోరారు.

అంగళ్లు విధ్వంసం కేసులో.. విచారణ 20కి వాయిదా

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా, అంగళ్లు వద్ద ఇటీవల జరిగిన విధ్వంసానికి సంబంధించి ముదివేడు పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుల తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అంగళ్లు కేసులో చంద్రబాబు మొదటి నిందితుడని తెలిపారు. ఈ కేసులో పూర్తి వివరాలు సమర్పించేందుకు కొంతగడువు కావాలని కోరారు. విచారణను 21కి వాయిదా వేయాలని అభ్యర్థించారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. కేసు నమోదు చేసిన తరువాత ఇప్పటివరకు తమకు పోలీసులు నోటీసు ఇవ్వలేదన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ, మొదటి నిందితుడిగా ఉన్నప్పుడు ఇప్పటివరకు చంద్రబాబు ఎందుకు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పోలీసులు నోటీసు ఇవ్వలేదని, అరెస్టు విషయంలో ముందుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయలేదన్నారు. విచారణను ఈనెల 19కి వాయిదా వేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.



రాజమహేంద్రవరం వైద్యకళాశాల



మచిలీపట్నం మెడికల్ కళాశాల



విజయనగరం వైద్యకళాశాల

వైద్య విద్యలో వందేళ్ల రికార్డు

ఇప్పటిదాకా రాష్ట్రంలో 2,185 ఎంబీబీఎస్ సీట్లు..

- మూడేళ్లలో అదనంగా మరో 2,550 సీట్లకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్
- మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు మెరుగు
- అన్ని ప్రాంతాలకూ సూపర్ స్పెషాలిటీ వైద్యం చేరువ



నంద్యాల మెడికల్ కళాశాల

సాక్షి, అమరావతి: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య నియామకాల నుంచి మెడికల్ కాలేజీల నిర్మాణం వరకు అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానంతోపాటు రాష్ట్రంలో 95% కుటుంబాలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి తెచ్చి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రతను కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు ఐదు కొత్త వైద్య కళాశాలలను సీఎం వైఎస్ జగన్ శుక్రవారం ప్రారంభించనున్నారు. తద్వారా వైద్య విద్యలో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నారు. విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాలలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులు అందుబాటులోకి వచ్చాయి. విజయనగరం వైద్య కళాశాల వద్ద నిర్వహించే కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొని అక్కడి నుంచే మిగిలిన నాలుగు కళాశాలలను కూడా ప్రారంభించనున్నారు.

జిల్లాకు ఒకటి చొప్పున

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేసి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ హామీ ఇచ్చింది. అన్ని ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలను మెరుగుపరుస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలలకు ప్రభుత్వ రంగంలో శ్రీకారం చుట్టడం ద్వారా సీఎం జగన్ నూతన అధ్యాయాన్ని లిఖించారు.

17 కొత్త కళాశాలలు.. 2,550 ఎంబీబీఎస్ సీట్లు

రూ.8,480 కోట్లతో 17 కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త కళాశాలల ఏర్పాటు ద్వారా అదనంగా 2,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కళాశాలలు ప్రారంభమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన కొత్త మెడికల్ కాలేజీలు	17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో అదనంగా అందుబాటులోకి వచ్చే సీట్లు
17	2,550

వీటిలో ఒక్కో చోట 150 చొప్పున 750 సీట్లు ఇప్పటికే అందుబాటులోకి రాగా విద్యార్థులు అడ్మిషన్లు కూడా పొందారు. వచ్చే విద్యా సంవత్సరంలో మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని మెడికల్ కళాశాలలను ప్రారంభించనున్నారు. ఇక మిగిలిన 7 వైద్య కళాశాలలను 2025–26లో ప్రారంభించేందుకు వీలుగా ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులను 330 పడకల జిల్లా ఆస్పత్రులుగా ప్రభుత్వం నోటిఫై చేసింది.

మూడేళ్లలోనే సీట్లు రెట్టింపు

రాష్ట్రంలో ఆంధ్రా వైద్య కళాశాల 1923లో మొదటిసారిగా ఏర్పాటైంది. ఆ తరువాత మరో పది ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు ద్వారా 2,185 ఎంబీబీఎస్ సీట్లు సమకూరాయి. అంటే 2,185 సీట్లు సమకూరడానికి వందేళ్ల సమయం పట్టింది. ఇప్పుడు 17 వైద్య కళాశాలలను అందుబాటులోకి తేవడం ద్వారా ఏకంగా 2,550 ఎంబీబీఎస్ సీట్లను సీఎం జగన్ మన విద్యార్థులకు అదనంగా సమకూరుస్తుండటం గమనార్హం. అంటే కేవలం మూడేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు ప్రభుత్వ రంగంలో రెట్టింపు దాటనున్నాయి.



ఏలూరు వైద్యకళాశాల

చాలా అద్భుతంగా ఉన్నాయి

అత్యాధునికంగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ కాలేజీ కంటే మెరుగ్గా ఉంది. అత్యాధునిక ల్యాబ్స్, టీచింగ్ హాల్స్, లెక్చర్ హాల్స్ అన్నీ చాలా అద్భుతంగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలలో తొలి బ్యాచ్‌లో చదవడం చక్కటి అనుభూతి. ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయకపోయి ఉంటే మేం ప్రైవేట్ కాలేజీలకు వెళ్లాల్సి వచ్చేది.

– సీహెచ్. ఢిల్లీరావు, వైద్య విద్యార్థి, ఏలూరు వైద్య కళాశాల

గొప్ప వరంలా భావిస్తున్నా



మాది విశాఖపట్నం. మధ్యతరగతి కుటుంబం. నీట్‌లో కొంత మెరుగైన ర్యాంక్ వచ్చింది. అయినప్పటికీ బీసీ ‘ఏ’ కేటగిరీలో గతంలో ఈ ర్యాంకుకు మెడిసిన్‌లో సీటు రావటం సాధ్యమయ్యేది కాదు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలలను ప్రారంభించడంతో నా ర్యాంక్‌కు సీట్ దక్కింది. లేదంటే మళ్లీ నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఒత్తిడితోపాటు విలువైన సమయం, డబ్బు వృథా అయ్యేది. కార్పొరేట్ వైద్య కళాశాలలకు దీటుగా మా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం గొప్ప వరంలా నాలాంటి ఎందరో విద్యార్థులు భావిస్తున్నారు.

– బమ్మిడి లక్ష్మీజ్యోత్స్న, వైద్య విద్యార్థిని, ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల

ఉన్నత స్థాయి వైద్యం



కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా వాటికి అనుబంధంగా బోధనాస్పత్రులు పని చేస్తాయి. వీటిద్వారా ప్రజలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు అభివృద్ధి చెందుతాయి. ఆయా ప్రాంతాల్లో జబ్బులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై పరిశోధనలు పెరుగుతాయి. సేవలు రెట్టింపు అవుతాయి. అన్ని ప్రాంతాల్లో బోధనాస్పత్రులు అందుబాటులోకి వస్తే ప్రజలకు వ్యయ ప్రయాసలు తొలగి అనుభవజ్ఞులైన వైద్యుల సంరక్షణ లభిస్తుంది. రోగులు మరింత త్వరగా కోలుకోవడానికి ఇది దోహదపడుతుంది.

– డాక్టర్ జి.రవికృష్ణ, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

రెండు రకాల లాభాలు..



వైద్యవిద్య డిమాండ్‌కు తగ్గట్టుగా రాష్ట్రంలో కళాశాలలు లేకపోవడంతో మన విద్యార్థులు వలస వెళుతున్నారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలతో మన విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలు పెరుగుతున్నాయి. జిల్లా, ఏరియా ఆస్పత్రులున్న చోట బోధనాస్పత్రులు అందుబాటులోకి వస్తున్నాయి. వైద్య సేవలు, రోగనిర్ధారణ సేవల్లో నాణ్యత పెరుగుతుంది. ఇలా విద్య, వైద్యంలో రెండురకాలుగా లాభాలుంటాయి.

– డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, కర్నూలు జీజీహెచ్

ఉన్న చోటే వైద్య విద్యలో చేరా..



ప్రభుత్వం మా ప్రాంతంలో కొత్త వైద్య కళాశాలను ప్రారంభించడంతో అక్కడే ఆప్షన్ ఇచ్చా. అందులోనే సీటు వచ్చింది. ఇటీవలే తరగతులు ప్రారంభం అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. మేం ఉంటున్న ప్రాంతంలోనే వైద్య విద్య అభ్యసిస్తున్నా. లేదంటే దూర ప్రాంతాలు వెళ్లాల్సి వచ్చేది. మనవద్ద మెడికల్ సీట్లు పెరగడంతో చాలా మందికి అవకాశాలు లభించాయి.

– మహ్మద్ హర్షిన బేగం, వైద్య విద్యార్థిని, రాజమండ్రి వైద్య కళాశాల

నాలుగేళ్లలో వైద్యం బలోపేతం ఇలా..

- నాలుగేళ్లలో ఏకంగా దాదాపు 53 వేలకు పైగా వైద్య పోస్టుల భర్తీ. ఎప్పటి ఖాళీలు అప్పుడే యుద్ధప్రాతిపదికన నియామకం. ఇందుకోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు.
- రూ.16,852 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతో పాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రులకు జవసత్వాలు.
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్య సేవలు.
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు. నెలకు రెండుసార్లు గ్రామాలకు పీహెచ్‌సీ వైద్యులు.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీఎంపీ, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా సరఫరా.
- టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ బలోపేతం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి ఏకంగా 3,257కి పెంపు. 40 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం కోసం రూ.8 వేల కోట్ల వ్యయం. వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి చెల్లింపు. ఇప్పటివరకూ 17.25 లక్షల మందికి రూ.1,074.69 కోట్లు అందించిన ప్రభుత్వం.
- 108 (768 వాహనాలు), 104 (936) వాహనాలతో వైద్య సేవలు బలోపేతం. మరో 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో కలిపి మొత్తం 2,204 వాహనాలతో ప్రజలకు ఉచిత వైద్య సేవలు. టీడీపీ హయాంలో 108 అంబులెన్స్‌లు కేవలం 531 మాత్రమే ఉండగా ఇందులో కేవలం 336 మాత్రమే మనుగడలో ఉండేవి.
- పీజీ మెడికల్ సీట్ల సంఖ్యను నాలుగేళ్లలో 966 నుంచి 1,767కి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం.
- జాతీయస్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టులు ఖాళీలు 61 శాతం కాగా మన రాష్ట్రంలో అది కేవలం 3.96% మాత్రమే.
- వైఎస్సార్ పెన్షన్ కానుక కింద దీర్ఘకాలిక రోగులకు వ్యాధి తీవ్రతను బట్టి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రతి నెలా ఇంటి వద్దే పెన్షన్లు
- గుంటూరు, కర్నూలు, విశాఖ, కడప, కాకినాడ, అనంతపురంలో 6 క్యాన్సర్ కేర్ సెంటర్ల ఏర్పాటు దిశగా అడుగులు.

సంవత్సరం	2019	2020-23	2024	2025
మెడికల్ కాలేజీలు	11	16	21	28
ఎంబీబీఎస్ సీట్లు	2,185	2,935	3,685	4,735

చంద్రబాబు పాత్ర సుస్పష్టం

ఏపీ సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రజాధనాన్ని పప్పుబెల్లాలుగా పంచుకున్నారని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్, ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈ అడ్డగోలు అవినీతికి పూర్తి ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ఈ స్కామ్ తాలూకు ఫైళ్లపై 13 డిజిటల్ సంతకాలు చేశారని వెల్లడించారు. ఆ సంతకాల కాపీలను మీడియా ఎదుట ప్రదర్శించారు. అగ్రిమెంట్లలో కనీసం తేదీ వేయకపోవడం, లెటర్ నంబర్ ప్రాంతాల్లో ఖాళీలను వదిలిన విషయాన్ని బయటపెట్టారు. థర్డ్ పార్టీకి డబ్బులు ఇవ్వకూడదన్న నిబంధనలు పాటించలేదన్నారు. అన్ని వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. ఈ కుంభకోణానికి తెరతీసేందుకు రూపొందించిన అగ్రిమెంట్‌లో లోపాలు మొదలు.. నిధుల మళ్లింపు, షెల్ కంపెనీల్లోకి వాటిని తరలించిన విధానం.. తద్వారా ఎలా లబ్ధిపొందారన్న పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐడీ అదనపు డీజీ సంజయ్ మాట్లాడిన వివరాలు ఇలా ఉన్నాయి.

సీమెన్స్ కంపెనీకి ప్రాజెక్టు గురించే తెలీదు

- జీఓ నంబర్ 4 ఆధారంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిజైన్‌టెక్ కంపెనీ, సీమెన్స్ ఇండియా సాఫ్ట్‌వేర్‌ల మధ్య త్రైపాక్షిక అగ్రిమెంట్ జరిగినట్టు చూపారు. వాస్తవంగా జీవోలో ఉన్న అంశాలు, అగ్రిమెంట్‌లోని అంశాలు వేరుగా ఉన్నాయి. అసలు ఈ ప్రాజెక్ట్ గురించి సీమెన్స్ కంపెనీకి తెలియదు. ఆ కంపెనీ పేరుతో కుట్రపూరితంగా ప్రాజెక్ట్‌ను రూపొందించారు.
- ఈ అగ్రిమెంట్ పరిశీలిస్తే..అందులో జీఓ నంబర్, లెటర్ నంబర్, తేదీలు సైతం సరిగా లేవు. కేవలం డ్రాఫ్ట్‌గా తయారు చేసి, భవిష్యత్తులో నంబర్ వేసుకోవడానికి అనుకూలంగా ఉంచినట్టు నిర్ధారణ అవుతోంది. ఒరిజినల్ పత్రాలు పరిశీలించాం. అవి నకిలీ అని నిర్ధారణ అయ్యింది. థర్డ్ పార్టీకి డబ్బులు ఇవ్వకూడదని అగ్రిమెంట్‌లో రాసుకున్నట్టు స్పష్టంగా ఉంది. అయినా థర్డ్ పార్టీకి రూ.330 కోట్లు వెళ్లినట్టు ఆధారాలు ఉన్నాయి.
- డిజైన్‌టెక్ నుంచి ఈ మొత్తాన్ని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి మళ్లించారు. అక్కడి నుంచి వివిధ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు దక్కించుకున్నారు. 2014లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాక ఆడిటర్‌గా జి వెంకటేశ్వర్లు అనే ప్రైవేటు వ్యక్తిని నియమించారు. గంటా సుబ్బారావును స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా, ఎక్స్ అఫీషియో సెక్రెటరీ టు సీఎంగా నియమించారు.
- ఇలా ఉన్నత విద్యా శాఖ పర్యవేక్షణ లేకుండా ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి సీఎం కార్యాలయం నుంచే నేరుగా పనిచేసేలా ‘కావాల్సిన’ విధంగా పని పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. డిప్యూటీ సీఈఓగా యూపీ కేడర్‌కు చెందిన అపర్ణ అనే ఐఏఎస్ అధికారిని నియమించారు. ఆమె భర్త సీమెన్స్ తరఫున అగ్రిమెంట్ల తయారీలో పనిచేశారు.

తమ ప్రమేయమే లేదని ‘సీమెన్స్’ చెప్పింది

- గుజరాత్ తరహాలో యువతకు నైపుణ్యాభివృద్ధి అంటూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి తెరతీశారు. కనీసం పైలెట్ ప్రాజెక్టు అమలు చేసి ఫలితాలను చూసి నిర్ణయం తీసుకుందామన్న అధికారుల ప్రతిపాదనను పట్టించుకోలేదు. రూ.371 కోట్లు కొల్లగొట్టడానికే ఈ ప్రాజెక్ట్‌ను తెరపైకి తెచ్చారు.
- ఏపీఎస్‌ఎస్‌డీసీ చెబుతున్న రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌తో తమకు సంబంధం లేదని, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని సీమెన్స్ సంస్థ స్పష్టం చేసింది. తాము 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తామని ఎవరికీ చెప్పలేదని.. అసలు ఆ వ్యవహారంతో సీమెన్స్ కంపెనీకి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా వివరించడంతోపాటు న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం కూడా ఇచ్చింది.
- జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు ఆ జీవో గురించి, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని వెల్లడించింది. భారత్‌లో సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా ఉన్న సుమన్ బోస్ మరికొందరు నిందితులతో కలసి జర్మనీలోని ప్రధాన కార్యాలయానికి తెలియకుండా ఈ కుట్రలో భాగస్వాములయ్యారని నిర్ధారణ అయ్యింది.
- గుజరాత్‌లో కంపెనీ కుదుర్చుకున్న ఒప్పందంలో సౌమ్యాద్రి బోస్‌గా సంతకాలు చేయగా, ఏపీలో ఉన్న ఒప్పందంలో మాత్రం సుమన్ బోస్ పేరిట సంతకాలు చేసినట్టు సదరు కంపెనీ వెల్లడించింది. సదరు కంపెనీ లీగల్ కౌన్సిల్ సైతం ఈ విషయాలను సీఐడీకి నిర్ధారించింది.

సాఫ్ట్‌వేర్ కోసం డిజైన్‌టెక్ నుంచి రూ.58.80 కోట్లు

- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలోని రూ.371 కోట్లలో రూ.58.80 కోట్లు జర్మనీలోని తమ సీమెన్స్ కంపెనీకి వచ్చాయని, అయితే ఆ సొమ్ము తమ కంపెనీకి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి కానీ, ఏపీ ఆర్థిక శాఖ నుంచి కానీ రాలేదని ఆ కంపెనీ స్పష్టం చేసింది. డిజైన్‌టెక్ సంస్థ కోరితే తాము రూ.58.80 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే ఆ కంపెనీకి విక్రయించామని తెలిపింది.
- ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే రూ.58.80 కోట్లు ప్రభుత్వం నుంచి డిజైన్ టెక్ అనే సంస్థకు తొలుత చేరినట్టు రూఢీ అవుతోంది. వాస్తవానికి అగ్రిమెంట్ ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఈ నగదు బదిలీ జరిగినట్టు స్పష్టం అవుతోంది. సీఐటీడీ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) ప్రభుత్వానికి ఏ ప్రతిపాదనలు ఇవ్వాలో కూడా సుమన్ బోస్ తయారు చేశారు. ఇంకా లోతుగా పరిశీలిస్తే.. సీఐటీడీ రిపోర్ట్ ఇవ్వకముందే రూ.200 కోట్లకు పైగా నగదు మళ్లించారు. ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది.

‘దశా’ంశాల ఆధారంగా దర్యాప్తు

- నకిలీ, కల్పిత ట్రై ప్యాట్రియేట్ అగ్రిమెంట్
- ఎలాంటి నిబంధనలు పాటించకుండానే రూ.371 కోట్లు విడుదల
- నోట్‌ఫైల్‌లో రిమార్క్‌లు పూర్తిగా విస్మరించడమే కాక అధికారులపై తీవ్ర ఒత్తిడి
- ఈ కుంభకోణంలో తమ కంపెనీ పేరును వాడారని, అసలు ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా స్పష్టం చేసింది
- గుజరాత్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, అమలు తీరుతెన్నులతో పోలిస్తే ఏపీలో జరిగింది వేరు. ఇక్కడ ప్రాజెక్టు అంతా అక్రమాలే.
- రూ.371 కోట్ల స్కామ్‌లో షెల్ కంపెనీల పాత్ర
- ఈ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల దర్యాప్తు, అరెస్టుల వివరాలు, ఈ కేసులో అటాచ్‌మెంట్లు
- ప్రాథమిక ఆధారాలు, కోర్టులో సమర్పించిన వివరాలు
- ఈ మొత్తం కుంభకోణానికి సంబంధించిన కీలక ఆధారాలు
- సీఐటీడీ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) థర్డ్ పార్టీ అభిప్రాయం

వెలుగులోకి విస్తుపోయే నిజాలు

ఈ కుంభకోణం బయట పడకూడదని నోట్ ఫైల్స్‌ను సెక్రెటేరియట్‌లో తగలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను ఎంతో స్కిల్‌ఫుల్‌గా టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచేశారు. జర్మనీకి చెందిన సీమెన్స్ ఏజీ అనే కంపెనీ ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.3300 కోట్ల ప్రాజెక్టులో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా అంటే ఉచితంగా ఇస్తామంటూ ముందుకు వచ్చినట్టు ఒప్పందంలో పేర్కొన్నారు. కేవలం 10 శాతం ఏపీ ప్రభుత్వం కంట్రిబ్యూషన్ కింద ఇస్తే చాలన్నట్టుగా ఒప్పందాల్లో ఉంది. చివరకు ఈ పది శాతం సొమ్ము రూ.371 కోట్లను నాలుగు లేయర్లుగా సృష్టించి పప్పుబెల్లాలుగా ఏపీ ఖజానా నుంచి కొల్లగొట్టారు. ఇది నిబంధనలకు విరుద్ధం అని అధికారులు అభ్యంతరం పెట్టినా, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు స్పష్టమవుతోంది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు సరిగా లేనందున ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా.. తర్వాత పూర్తి స్థాయిలో అమలు చేయాలని అధికారులు సూచించినా పట్టించుకోలేదు. ఈ విషయాలన్నీ నోట్‌ఫైల్‌లో ఉన్నాయి. జీఎస్టీ మినహాయింపుల కోసం డిజైన్‌టెక్ చేసిన ప్రయత్నంతో ఈ మొత్తం వ్యవహారం బయటపడింది. పుణేలో జీఎస్టీ అధికారులు వెలుగులోకి తెచ్చారు. ఈ కుంభకోణంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం రూ.కోటి అయ్యే సాఫ్ట్‌వేర్‌ను రూ.250 కోట్లుగా చూపారు. ఇది ఎంతో అన్యాయం.

– పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఏఏజీ

నోట్ ఫైళ్లు మాయం చేశారు

- ఈ కుంభకోణం బయట పడకూడదనే ఉద్దేశంతో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లను ఉద్దేశ పూర్వకంగా గల్లంతు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు గురించి జీవో 4, సీమెన్స్‌తో ఒప్పందం గురించి జీవో 5 జారీ చేశారు. కానీ ఆ రెండు జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ జీవో 8 ద్వారా అంతకు ముందు ఇచ్చిన జీవోలు 4, 5 లోని అంశాలను సీఐడీ గుర్తించి వెలికి తీయడంతో ఈ కుంభకోణం బయటపడింది.

యోగేష్ గుప్తాతో చంద్రబాబు పీఎస్‌కు సంబంధాలు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కొట్టేసిన సొమ్మును షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించి చివరకు నగదు రూపంలో మార్చడంలో షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించినట్టు అడిషనల్ డీజీ సంజయ్ తెలిపారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తాలకు ఆర్థిక అంశాల్లో సంబంధాలున్నట్టు గతంలో ఐటీ దాడుల్లో వెల్లడైందన్నారు. పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, యోగేశ్‌గుప్తాలు కలిసి ఈ మొత్తం వ్యవహారం నడిపారన్నారు. డబ్బులు ఎలా చేర్చారన్న పూర్తి వివరాలు మరింత స్పష్టంగా వెలుగులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ సొమ్మును మళ్లించడం, తిరిగి షెల్ కంపెనీల ద్వారా వాటిని ఒకే వ్యక్తి పొందారనడానికి పూర్తి ఆధారాలున్నాయని చెప్పారు. ఇందులో హవాలా జరిగినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇన్‌కమ్ ట్యాక్స్, జీఎస్టీ, సీఐడీ దర్యాప్తుతోపాటు సీమెన్స్ గ్లోబల్ కంపెనీ ఇచ్చిన వివరణలు సైతం వెల్లడించాయని తెలిపారు. ఈ కుంభకోణంలో ఈడీ దర్యాప్తు ఇంకా కొనసాగుతోందన్నారు. సీఐడీ దర్యాప్తు కూడా కొనసాగుతోందని, అవసరం మేరకు ఇంకా అరెస్టులు ఉంటాయన్నారు. ఇందులో అనేక కోణాలు దాగి ఉన్నాయని, చార్జిషీట్‌కు ఇంకా సమయం పడుతుందని వివరించారు.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్



స్వీట్ మూన్

అమ్మమ్మ నోటి నుంచి భక్తి భావనతో వినిపించే కీర్తనలు, గురుద్వారాలో విన్న కీర్తనలు బనత్ నోటి నుంచి తీయగా వినిపించేవి. బనత్ కౌర్ బగ్గాకు చిన్నప్పటి నుంచే సంగీతంతో చక్కని స్నేహం ఉంది. స్కూల్ ఫంక్షన్‌లలో, ఫ్యామిలీ ఫంక్షన్‌లలో తన పాట తప్పకుండా ఉండాల్సిందే.

అయిదు సంవత్సరాల వయసులోనే హార్మోనియం వాయించి శ్రోతలను అబ్బురపరిచింది. లా స్టూడెంట్‌గా ఉన్నప్పుడు డెబ్యూ సింగిల్ 'మూన్' వచ్చింది. పంజాబీ నేపథ్యం ఉన్న బనత్ హిందీ, పంజాబీ పాటలకు తనదైన మెరుపు ఇస్తుంది. సింగర్-సాంగ్ రైటర్‌గా పేరు తెచ్చుకున్న బనత్ కౌర్ బగ్గా పాప్ అండ్ రాక్, నియో క్లాసికల్ అండ్ ఫోక్‌లో మంచి పేరు తెచ్చుకుంది. తీరికవేళల్లో చక్కటి కవిత్వాన్ని ఆస్వాదించడం తనకు ఇష్టం. కొన్నిసార్లు మ్యూజిక్ కంటే కవిత్వ పంక్తులు రాసుకోవడం అంటేనే ఇష్టం. పిల్లల కోసం ముంబైలో 'క్లాస్‌రూమ్' పేరుతో మ్యూజిక్ స్కూల్ స్టార్ట్ చేసింది బనత్ కౌర్ బగ్గా.



ఏకే - ఫ్లేవర్ కాదు ఫైర్-బోల్ట్

టెక్నాలజీ, ఫిట్‌నెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్పోర్ట్స్...అనేవి అర్నవ్ కిశోర్(ఏకే) కలల ప్రపంచం. వాటిని మిళితం చేసి 'ఫైర్-బోల్ట్' స్టార్టప్ సృష్టించాడు. ఇది మన దేశంలోనే అతి పెద్ద వేరబుల్ టెక్ బ్రాండ్‌గా అవతరించింది. అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతుంది. 'మంచి టైమ్ సెట్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది' అంటాడు ఏకే...

● సక్సెస్ స్టోరీ

అర్నవ్ కిశోర్‌కు ఆటలు అంటే ప్రాణం. స్పోర్ట్స్‌మెన్, ఫిట్‌నెస్ ప్రేమికులకు ఉపయోగపడే గాడ్జెట్‌లను సృష్టించాలనేది తన భవిష్యత్ లక్ష్యంగా ఉండేది. వేరబుల్ టెక్ కంపెనీ 'ఫైర్-బోల్ట్'తో తన కలను నిజం చేసుకున్నాడు కిశోర్. స్మార్ట్ వేరబుల్ మార్కెట్‌ను తగిన అధ్యయనం చేసిన తరువాత మార్కెట్ వ్యూహాలు రచించుకున్నాడు.

అప్పటికే చైనాలోని దిగ్గజ టెక్ కంపెనీలు మన మార్కెట్‌లోకి వచ్చాయి. వాటితో పోటీ పడడం అంత సులభం ఏమీ కాదు. మంచి టైమ్ రావాలంటే ఆ టైమ్ ఎప్పుడు వస్తుందో ఓపిగ్గా ఎదురుచూడాలి. అర్నవ్ కిశోర్ అదే చేశాడు. సరియైన సమయం చూసి మార్కెట్‌లోకి దిగి విజయం సాధించాడు.

తొలి సంవత్సరం....'మన టైమ్ వచ్చేసింది' అనుకున్నాడు.

రెండో సంవత్సరం....'ఈ ఫైర్ ఇలాగే కొనసాగాలి' అనుకున్నాడు.

గత సంవత్సరం ఫైర్-బోల్ట్ నాయిస్ మన దేశంలోనే అతి పెద్ద స్మార్ట్ వాచ్ బ్రాండ్‌గా అవతరించింది.

ఆన్‌లైన్‌లోనే కాదు ఆఫ్‌లైన్ లోనూ సరసమైన ధరల్లో అందుబాటులో ఉండేలా చేయడమే కాదు, ఇన్నోవెటివ్, మార్కెట్-ఫస్ట్ ఫీచర్స్ కూడా కంపెనీ ఉత్పత్తులు విజయం సాధించడానికి ప్రధాన కారణం.

కంపెనీ ప్రొడక్ట్ లైన్‌లోనికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటి) డివైజ్‌లు, వైర్‌లెస్ ఇయర్ ఫోన్‌లు...మొదలైనవి వచ్చి చేరాయి.

ఇండియన్ మార్కెట్‌లో విజయం సాధించిన అర్నవ్ అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు.

వ్యాపారవేత్త అయిన తండ్రి నుంచి కిశోర్ నేర్చుకున్న పాఠం...

'నిరాశతో ప్రయాణాన్ని ఆపవద్దు. పరుగెత్తక పోయినా సరే, నడిస్తే చాలు. ప్రయాణంలోనే ఎన్నో విషయాలను నేర్చుకుంటాం. మంచి,చెడులను తెలుసుకుంటాం'

నిజానికి ప్రయాణ ప్రారంభంలోనే అర్నవ్ కిశోర్‌కి కోవిడ్ హాయ్ చెప్పి భయపెట్టింది. సంక్షోభ సమయంలో వ్యాపారవేత్త డీలా పడకూడదు. కిశోర్ ఆ సమయంలోనూ అధైర్య పడలేదు. వెనకడుగు వేయలేదు.

'ట్రెండ్స్ ఆఫ్ బ్యాండ్' ఏమిటి?

'పాపులారిటీ కోల్పోయిన బ్యాండ్స్ ఏమిటి?' అనే అంశంపై అవగాహన ఉన్న కిశోర్ 2021లో కొత్త స్ట్రాటజీతో ముందుకు వచ్చాడు. టెంప్టింగ్ ట్యాగ్‌తో నింజా సిరీస్ స్మార్ట్ వాచ్‌లను తీసుకువచ్చి విజయం సాధించాడు.

'రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్ అండ్ డీ), డిజైన్ మార్కెట్‌లో మాకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగించాయి' అంటాడు కిశోర్.

యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు అందుకున్నాడు అర్నవ్ కిశోర్.

సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా అర్నవ్ కిశోర్ ఇప్పుడు చేయాల్సింది....ఎప్పటిలాగే ఆట తెలివిగా ఆడటం. అతి ఆత్మవిశ్వాసం ఉంటే ఆట తారు మారు అవుతుంది. ఇలాంటి విషయాలు అర్నవ్ కిశోర్‌కు తెలియనివేమీ కాదు. ఎందుకంటే ఈ యువ వ్యాపారవేత్త తండ్రి నుంచి ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాడు.

● అవును... ఇది నిజమే!



- 'ది క్విక్ బ్రౌన్ ఫాక్స్ జంప్స్ వోవర్ ది లేజీ డాగ్' అనే వాక్యంలో ఆంగ్ల వర్ణమాలలోని అన్ని అక్షరాలు కనిపిస్తాయి.
- సంతోషంగా ఉండడం ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు? అయితే కొందరు మాత్రం సంతోషంగా ఉండడానికి భయపడతారు. దీనికి కారణం సంతోషంగా కనిపిస్తే కీడు జరుగుతుందనే మూఢ నమ్మకం. సంతోషంగా ఉండడానికి భయపడే లక్షణాన్ని చెరోఫోబియా అంటారు.
- ఒక దురలవాటు దూరం కావాలంటే గట్టిగా 21 రోజులు దాని జోలికి వెళ్లకుండా ఉంటే సరిపోతుందట.
- 'వోవర్ మారో' అంటే ఏమిటో కాదు ది డే ఆఫ్టర్ టుమారో(ఎల్లుండి) అని.

● టెక్.. టాక్



శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్9 అల్ట్రా

డిస్‌ప్లే: 14.60 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1848x2960 పిక్సెల్స్
కనెక్టివిటీ: 5జీ బ్యాటరీ: 11200 ఎంఏహెచ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్, 512జీబి 12జీబి ర్యామ్



హానర్ 90 5జీ

డిస్‌ప్లే: 6.70 అంగుళాలు బరువు: 183 గ్రా.
రిజల్యూషన్: 1200x2664 పిక్సెల్స్ వోఎస్: ఆండ్రాయిడ్ 13 ;
మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 256 జీబి 16జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ



స్క్రీన్ షాట్స్ కోసం...

మ్యాక్‌వోఎస్‌ను ఉపయోగించి ల్యాప్‌టాప్‌లో స్క్రీన్‌షాట్ తీసుకోవడానికి... 1) క్యాప్చర్ చేయాలనుకున్న యాప్ లేదా వెబ్‌సైట్‌ను ఓపెను చేయాలి. 2) ఎంటైర్ స్క్రీన్‌ను క్యాప్చర్ చేయడానికి... షిఫ్ట్+కమాండ్+3 ప్రెస్. 3) స్క్రీన్‌లో మీకు కావాల్సిన భాగాన్ని కాప్చర్ చేయడానికి: షిఫ్ట్+కమాండ్+4 డ్రాగ్ అండ్ సెలెక్ట్



ఇన్‌స్టాలో స్టోరీ హైలైట్స్ యాడ్ చేయడానికి...

1) ప్రొఫైల్‌లోకి వెళ్లాలి. 2) స్టోరీలో హైలైట్ ట్యాబ్ 'న్యూ'ను ట్యాప్ చేయాలి. 3) మీరు యాడ్ చేయాలనుకున్న స్టోరీలను ఎంపిక చేసుకోవాలి. 4) టాప్ రైట్ కార్నర్‌లో 'నెక్స్ట్' ట్యాప్ చేయాలి. 5) కవర్ ఫొటోను పిక్ చేసుకోవాలి.



యాన్ అప్‌హిల్ బ్యాటిల్/స్ట్రగుల్

ఈ పని చేయడం ఎంతో కష్టం. ఆట లేదా మరేదైనా విషయంలో విజయం సాధించడం అసాధ్యం అనుకునే సందర్భంలో ఉపయోగించే మాట యాన్ అప్‌హిల్ బ్యాటిల్/స్ట్రగుల్/టాస్క్

ఉదా: అన్‌లెస్ యూ హ్యావ్ ఏ గోల్ యువర్ లెర్నింగ్ విల్ బి యాన్ అప్‌హిల్ స్ట్రగుల్

నిప్ ఇట్ ఇన్ ది బడ్

నిప్ ఇట్ ఇన్ ది బడ్ అనేది మొగ్గలోనే తుంచివేయడంలాంటి మాట. ఏ చెడు అలవాటుగానీ, ప్రమాదకరమైన పరిస్థితి తలెత్తకుండా ముందుగా జాగ్రత్త పడడం.

ఉదా: మెనీ సీరియస్ ఇల్‌నెసెస్ కెన్ బి నిపుడ్ ఇన్ ది బడ్ ఇఫ్ దే ఆర్ డిటెక్టెడ్ ఎర్లీ ఎనఫ్.

● గేమింగ్




ఆ గ్రహంలో ఆగ్రహంతో కదిలాడు

యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ స్టార్‌ఫీల్డ్ ఇటీవల విడుదలైంది. ఒక నగరం నుంచి మరో నగరానికి వెళ్లినంత సులభంగా ఈ గేమ్‌లో ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి వెళ్లవచ్చు. ప్లేయర్ అన్వేషణలో నాన్‌ప్లేబుల్ క్యారెక్టర్స్(ఎన్‌పీసీ) ఎదురవుతుంటాయి. వాటిలో కొన్ని ప్లేయర్ సైన్యంలో చేరవచ్చు. ప్లేయర్ ఎంపికపై తమ నిర్ణయాన్ని ప్రకటించవచ్చు. ప్రతి క్యారెక్టర్‌కు తమవైన శక్తిసామర్థ్యాలు ఉంటాయి. స్పేస్-థీమ్డ్ సెట్టింగ్స్‌లో జరిగే గేమ్ ఇది. ఫస్ట్-పర్సన్, థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడవచ్చు. వెయ్యికి పైగా ప్లానెట్స్‌లో ప్లేయర్ ల్యాండ్ కావచ్చు. న్యూ అట్లాంటిస్ అనేది ఈ గేమ్‌లో అతి పెద్ద నగరం.

ఇంజిన్: క్రియేషన్ ఇంజిన్ 2 ప్లాట్‌ఫామ్స్: విండోస్ ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్-ప్లేయర్

సినిమా


● కార్తీ

డబ్బింగ్ షురూ

కార్తీ హీరోగా నటించిన అడ్వెంచరస్ థ్రిల్లర్ మూవీ 'జపాన్'. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సునీల్, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ కీలక పాత్రల్లో నటించారు. 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ చిత్రం దీపావళికి విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయని వెల్లడిస్తూ, ఇందుకు సంబంధించిన ఓ వీడియోను చిత్ర యూనిట్ షేర్ చేసింది. ''కార్తీ పుట్టినరోజు (మే 25) సందర్భంగా విడుదల చేసిన 'జపాన్' గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈ చిత్రంలో కార్తీ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా 'జపాన్' చిత్రంలో గోల్డ్ స్మగ్లింగ్ చేసే వ్యక్తి పాత్రలో కార్తీ కనిపిస్తారని కోలీవుడ్ టాక్.

సింగిల్‌గా ఉండు మామా..

'హే సింగిల్‌గా ఉండు మామా.. గాళ్‌ఫ్రెండ్ ఎందుకు?..హైదరాబాద్.. సికింద్రాబాద్..పొరెంట బడితే నువ్వు బరాబాత్' అంటూ మొదలవుతుంది 'మ్యాడ్' చిత్రంలోని 'ప్రౌడ్స్ బోలో ఐయామ్ సింగిల్' పాట. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సునీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో ఎస్. హారిక, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'ప్రౌడ్స్ బోలో ఐ యామ్ సింగిల్..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సారథ్యంలో రఘురామ్ సాహిత్యం అందించారు. నకాష్ అజీజ్‌తో కలిసి భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించారు.


● 'మ్యాడ్' పోస్టర్


● కళ్యాణ్ రామ్, సంయుక్తా మీనన్

మాయే చేసే...

'బింబిసార' వంటి హిట్ మూవీ తర్వాత కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'డెవిల్'. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 24న విడుదల కానుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'మాయే చేసే..' అనే పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. సత్య ఆర్‌వీ సాహిత్యం అందించిన ఈ పాటను, సిద్ శ్రీరాం పాడారు. అభిషేక్ నామా మాట్లాడుతూ– ''పీరియాడిక్ స్పై థ్రిల్లర్ మూవీ 'డెవిల్'. నటుడిగా కల్యాణ్ రామ్‌లోని ఓ కొత్త కోణాన్ని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూస్తారు. సినిమా కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి'' అన్నారు. ఈ చిత్రానికి సీఈఓ: వాసు పోతిని, కెమెరా: సౌందర్ రాజన్ ఎస్.

భయపెట్టే తంతిరం

భార్యాభర్తల మధ్యలో ఓ ఆత్మ ప్రవేశించడం వల్ల వారి దాంపత్య జీవితం ఎలా ప్రభావితమైంది? అనే కథాంశంతో రూపొందిన హారర్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్ 'తంతిరం'. శ్రీకాంత్ గుర్రం, ప్రియాంక శర్మ జంటగా నటించారు. ముత్యాల మెహర్ దీపక్ దర్శకత్వంలో శ్రీకాంత్ కంద్రగుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఆడియన్స్‌కు గుర్తుండిపోయే చిత్రం ఇది'' అన్నారు శ్రీకాంత్ గుర్రం. ''ఈ సినిమా చూసి ఆడియన్స్ థ్రిల్ అవుతారు'' అన్నారు మెహర్ దీపక్. ''బడ్జెట్ ఎక్కువ అవుతున్నా రాజీ పడకుండా నిర్మించాం. ప్రేక్షకులు ఈ సినిమాను హిట్ చేయాలి'' అన్నారు శ్రీకాంత్ కంద్రగుల.


● ప్రియాంక, శ్రీకాంత్


● సాయి పల్లవి

బాలీవుడ్ భులాయా?

దక్షిణాదిలోని అగ్రకథానాయికల్లో ఒకరిగా ప్రేక్షకుల్లో పేరు సంపాదించుకున్నారు సాయిపల్లవి. ఈ బ్యూటీ బాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటికప్పుడు కొత్త వార్తలు తెరపైకి వస్తూనే ఉన్నాయి. ఈ కోవలోనే తాజాగా మరోసారి సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ బీ టౌన్‌లో చర్చనీయాంశమైంది. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ ఇటీవల ఓ ప్రేమకథకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ఈ చిత్రంలోనే సాయిపల్లవి హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ హిందీ పరిశ్రమలో ప్రచారంలోకి వచ్చింది. ఆమిర్ సన్నిహితుల్లో ఒకరైన సునీల్ పాండే దర్శకత్వం వహిస్తారని, ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని భోగట్టా. ఇక ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తే, హిందీలో ఆమెకు తొలి చిత్రం అవుతుంది. మరి.. సాయిపల్లవిని బాలీవుడ్ భులాయా (పిలిచిందా?) లేదా అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

అక్టోబరులో 800


● మధుర్ మిట్టల్


శ్రీలంకన్ ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం '800'. మురళీధరన్ పాత్రలో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' ఫేమ్ మధుర్ మిట్టల్ నటించగా, ఆయన భార్య మదిమలర్ పాత్రలో మహిమా నంబియార్ కనిపిస్తారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో వివేక్ రంగాచారి ఈ బయోపిక్‌ను నిర్మించారు. ఈ సినిమా దేశవ్యాప్త థియేట్రికల్ రిలీజ్ హక్కులను నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సొంతం చేసుకున్నారు. ఈ సినిమాను అక్టోబరు 6న విడుదల చేస్తున్నట్లుగా గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''తమిళ, తెలుగు, హిందీ భాషల్లో '800' సినిమాను వచ్చే నెల 6న విడుదల చేస్తున్నాం. ముత్తయ్య మురళీధరన్ జీవితంలోని క్రికెట్ అంశాలను గురించి మాత్రమే కాదు.. ఆయన బాల్యంలో జరిగిన ఘటనలను కూడా ఈ చిత్రంలో చూపిస్తాం. కేవలం క్రికెట్ ప్రేమికులనే కాదు.. ప్రేక్షకులందరినీ ఆకట్టుకునే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు. ''ఈ సినిమా పట్ల శ్రీపతి అంకిత భావం, పట్టుదల చూసి ఈ సినిమాకు ఓకే చెప్పాను. ప్రజలంతా ఈ సినిమా చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు ముత్తయ్య మురళీధరన్. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్.

దుల్కర్‌కు జోడీగా..?

తెలుగు పరిశ్రమలో కథానాయికగా మీనాక్షీ చౌదరికి అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే మహేశ్‌బాబు 'గుంటూరు కారం', వరుణ్‌తేజ్ 'మట్కా', విశ్వక్ సేన్ సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తున్నారీ బ్యూటీ. తాజాగా దుల్కర్ సల్మాన్ హీరోగా రూపొందనున్న 'లక్కీ భాస్కర్' చిత్రంలోని హీరోయిన్ చాన్స్ కూడా మీనాక్షీకే లభించిందని టాలీవుడ్ లేటెస్ట్ సమాచారం. పాన్ ఇండియా ఫిల్మ్‌గా ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్నారు. నవంబరులో షూటింగ్ ప్రారంభం కానుందట.



● మీనాక్షీ చౌదరి

ఆ నలుగురికీ రెడ్ కార్డ్?


● ధనుష్

తమిళ చలన చిత్ర నిర్మాతల మండలి సంచలన నిర్ణయం తీసుకుందని సమాచారం. నిర్మాతలకు సహకరించడం లేదనే ఆరోపణలతో హీరోలు ధనుష్, శింబు, అథర్వలకు, నిర్మాతల మండలికి చెందిన నిధుల అవకతవకల ఆరోపణలపై విశాల్‌కు రెడ్ కార్డ్ (ప్రవర్తన సరిగ్గా లేనప్పుడు జారీ చేయడం) జారీ చేయాలని నిర్ణయించిందట. చెన్నై అన్నాశాలైలోని నిర్మాతల మండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నిర్మాతల మండలి ఈ నిర్ణయం తీసుకుందని కోలీవుడ్ టాక్. ఈ సమావేశంలో పలు విషయాలను చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా హీరోలు ధనుష్, విశాల్, శింబు, అథర్వలపై రెడ్ కార్డ్ విధించాలని తీర్మానం చేశారట. ఇకపై వీరు ఏ సినిమాల్లోనూ నటించకుండా రెడ్ కార్డ్ ఇవ్వనున్నారని భోగట్టా. ఈ నిర్ణయం తమిళ చిత్ర పరిశ్రమనే కాదు.. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఇంతకీ ధనుష్, విశాల్, శింబు, అథర్వలకు రెడ్ కార్డ్ ఎందుకు జారీ చేయనున్నారనే విషయాలపై కొన్ని సంగతులు ప్రచారంలోకొచ్చాయి. ఆ వివరాల్లోకి వెళితే...


● విశాల్


● శింబు

- తేనాండాళ్ ఫిలిమ్స్ సంస్థలో ధనుష్ ఓ చిత్రం అంగీకరించి, 80 శాతం షూటింగ్ పూర్తి చేశారట. మిగిలిన 20 శాతం చిత్రీకరణ విషయంలో ధనుష్ సహకరించడం లేదట. ఈ కారణంగా నష్టాలు వచ్చాయంటూ నిర్మాత మదియళగన్ ఫిర్యాదు చేశారని సమాచారం. ఈ ఫిర్యాదుని పరిశీలించాక ధనుష్‌పై చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు నిర్మాతల మండలి పేర్కొందని టాక్.
- తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌కు విశాల్ అధ్యక్షుడిగా పని చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అసోసియేషన్‌కు సంబంధించిన నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై విశాల్‌కు రెడ్ కార్డ్ ఇవ్వనున్నారట.
- నిర్మాత మైఖేల్ రాయప్పన్‌తో ఏర్పడిన వివాదాల నేపథ్యంలో శింబుకు రెడ్ కార్డ్ జారీ చేయనుందట నిర్మాతల మండలి. ఈ వివాదంపై ఇప్పటికే పలుమార్లు శింబుతో చర్చలు జరిపినా ఫలితం రాలేదట. దీంతో మైఖేల్ రాయప్పన్ ఫిర్యాదు చేయడంతో శింబుకి రెడ్ కార్డ్ జారీ చేయాలనే నిర్ణయం తీసుకున్నారట.
- మదియళగ అనే నిర్మాణ సంస్థలో ఓ సినిమా చేసేందుకు అథర్వ ఒప్పందం కుదుర్చుకున్నారట. అయితే షూటింగ్ విషయంలో ఆయన దర్శక-నిర్మాతలకు ఏమాత్రం సహకరించడం లేదట. ఈ ఆరోపణలతో అథర్వకి రెడ్ కార్డ్ ఇవ్వనున్నారని టాక్.


● అథర్వ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
52	33
67,519	20,103

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి ముగింపు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	13,944	▲ 131
డోజోన్స్	34,923	▲ 348
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,673	▲ 147
డాక్స్	15,805	▲ 151
షాంఘై	3,123	▲ 3
నికాయ్	33,168	▲ 462

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	58,267
బంగారం (22 క్యారట్)	55,452
వెండి (కిలో)	77,112

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	101.97	105.34
€	యూరో	ఎస్‌బీఐ	87.68	90.79
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.49	57.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.10	54.43
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.00	61.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.17	22.80
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

కేంద్రానికి ఎల్‌ఐసీ రూ.1,831 కోట్ల డివిడెండ్



న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) గురువారం రూ. 1,831.09 కోట్ల డివిడెండ్ చెక్కును కేంద్రానికి అందజేసింది. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి ఈ డివిడెండ్ చెక్కును అందజేశారు. ఆర్థిక సేవల శాఖ అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల తదితర అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆగస్టు 22న జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో డివిడెండ్‌ను షేర్‌హోల్డర్లు ఆమోదించినట్లు ఒక ప్రకటనలో ఎల్‌ఐసీ పేర్కొంది. రూ.5 కోట్ల తొలి మూలధన పెట్టుబడితో 1956లో ఎల్‌ఐసీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులకు ద్వారాలు తెరచి రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ, భారత్ జీవిత బీమా మార్కెట్లో ఎల్‌ఐసీ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందని ఎల్‌ఐసీ ప్రకటన పేర్కొంది.

గ్రీన్ హైడ్రోజన్‌కు అదానీ జేవీ

జపాన్ కంపెనీతో జట్టు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా జపాన్ దిగ్గజం కోవా గ్రూప్‌తో చేతులు కలిపింది. సమాన వాటా(50:50)తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసింది. తద్వారా జపాన్, తైవాన్, హవాయ్ మార్కెట్లలో గ్రీన్ హైడ్రోజన్ విక్రయాలను చేపట్టనుంది. రానున్న దశాబ్ద కాలంలో దేశీయంగా సమీకృత గ్రీన్ హైడ్రోజన్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికలు ప్రకటించింది. దీనిలో భాగంగా తొలి దశలో మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి తెరతీయనుంది. తదుపరి దశలో సామర్థ్యాన్ని 3 మిలియన్ టన్నులకు పెంచనుంది. ఈ బాటలో తాజాగా సింగపూర్ అనుబంధ సంస్థ ద్వారా కోవా హోల్డింగ్స్ ఏషియా పీటీఈతో జేవీని నెలకొల్పింది. వెరసి గ్రీన్ అమోనియా, గ్రీన్ హైడ్రోజన్, వీటి డెరివేటివ్ అమ్మకాలు, మార్కెటింగ్ చేపట్టనుంది. శుద్ధ ఇంధన తయారీకి హైడ్రోజన్ ఉపయోగపడనుంది. ప్రధానంగా రిఫైనింగ్, కెమికల్ రంగాలలో వినియోగిస్తారు. అదానీ ఇప్పటికే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన కంపెనీగా ఆవిర్భవించింది. గుజరాత్, ముంద్రా సెజ్‌లోని సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాలను వార్షికంగా 10 గిగావాట్లకు పెంచుకునే ప్రణాళికల్లో ఉంది. ఇక్కడ మెటలర్జికల్ గ్రేడ్(ఎంజీ) సిలికాన్, పాలీసిలికాన్, ఇన్‌గాట్స్, వేఫర్స్, సెల్స్ తదితరాలను రూపొందించేందుకు వీలుంది. వీటిని సౌర ఇంధనం ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టే ప్రక్రియలో వినియోగిస్తారు.

మాస్టర్ కార్డ్ ఇండియా చైర్మన్‌గా రజనీష్ కుమార్

న్యూఢిల్లీ: మాస్టర్ కార్డ్ ఇండియా తన నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎస్‌బీఐ మాజీ సీఎండీ రజనీష్ కుమార్‌ను నియమించినట్లు గురువారం ప్రకటించింది. ఈ కీలక బాధ్యతల్లో భాగంగా దక్షిణాసియా అండ్ కంట్రీ కార్పొరేట్ ఆఫీసర్, ఇండియా డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్ అగర్వాల్ నేతృత్వంలోని మాస్టర్‌కార్డ్ సౌత్ ఆసియా ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ బృందానికి కుమార్ మార్గనిర్దేశం చేస్తారని మాస్టర్ కార్డ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. దేశీయ విస్తరణ బాటలో దూసుకుపోవడానికి స్థానిక లీడర్‌షిప్ బృందంతో తన వంతు కీలక చొరవలు చేపడతారని వెల్లడించింది.



టోకు ద్రవ్యోల్బణం అయిదో నెలా 'మైనస్'లోనే..

- ఆగస్టులో మైనస్ 0.52 శాతం
- కూరగాయలు, ఉల్లి, పప్పు దినుసుల ధరలు తీవ్రమే



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం వరుసగా అయిదో నెల కూడా మైనస్‌లోనే కొనసాగింది. ఆగస్టులో మైనస్ 0.52%గా నమోదయ్యింది. సూచీలో పెరుగుదల లేకపోవడాన్ని ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. టోకు బాస్కెట్ ధర పెరక్కపోగా.. మైనస్‌లో ఉన్నప్పటికీ, ఇందులో ఒక భాగంగా ఉన్న ఆహార బాస్కెట్ ధర మాత్రం తీవ్రంగా ఉంది.

ఫుడ్ బాస్కెట్ తీరిది...

ఫుడ్ బాస్కెట్ ధరల పెరుగుదల ఆగస్టులో 10.6 శాతంగా (2022 ఆగస్టుతో పోల్చి) ఉంది. జూలైతో (14.25 శాతం) పోల్చితే ధరల స్పీడ్ కొంత తగ్గడం ఊరటనిచ్చే అంశం. ఒక్క కూరగాయల ధరలు చూస్తే, 48.69 శాతం పెరుగుదల నమోదయ్యింది. జూలైలో ఈ పెరుగుదల రేటు ఏకంగా 62.12 శాతంగా ఉంది. పప్పు దినుసుల ధరల స్పీడ్ 10.45 శాతంకాగా, ఉల్లి ధరల విషయంలో ఈ రేటు 31.42 శాతంగా ఉంది. ధరల స్పీడ్ జూలైతో పోల్చితే తగ్గినప్పటికీ వార్షికంగా చూస్తే, ఇది చాలా ఎక్కువ పెరుగదలేనని నిపుణులు పేర్కొంటున్నారు.

తయారీ: సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగంలో జూలైలో ప్రతి ద్రవ్యోల్బణం మైనస్ 2.51 శాతం ఉంటే, ఆగస్టులో మైనస్ 2.37 శాతంగా నమోదయ్యింది.

ఇంధనం-విద్యుత్: ఈ రంగంలో జూలైలో ప్రతి ద్రవ్యోల్బణం మైనస్ 12.79 శాతం ఉంటే, ఆగస్టులో మైనస్ 6.03 శాతంగా ఉంది.

టాటా నెక్సాన్ ఈవీలో కొత్త వెర్షన్

ప్రారంభ ధర రూ. 14.74 లక్షలు



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తాజాగా తమ నెక్సాన్ వాహనానికి సంబంధించి కొత్త వెర్షన్స్ ఆవిష్కరించింది. నెక్సాన్ ఈవీలో కొత్త వెర్షన్ ధర రూ. 14.74–19.94 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా ఉంటుంది. ఇది ఒకసారి చార్జి చేస్తే గరిష్టంగా 465 కిలోమీటర్ల రేంజి ఇస్తుంది. అలాగే, నెక్సాన్‌లో పెట్రోల్, డీజిల్‌కు సంబంధించి కొత్త వెర్షన్లను టాటా మోటార్స్ ప్రవేశపెట్టింది. వీటి రేటు రూ. 8.09 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సంస్థ ఎండీ (ప్యాసింజర్ వెహికల్స్ విభాగం) శైలేష్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల పోర్ట్‌ఫోలియోలో నెక్సాన్, టియాగో, టిగోర్, ఎక్స్‌ప్రెస్-టీ ఈవీ ఉన్నాయి.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

ఇంట్రాడేలో సెన్సెక్స్ కొత్త రికార్డు



ముంబై: చివర్లో ఇంధన, మెటల్, కమోడిటీ షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించడంతో గురువారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. సెన్సెక్స్ 52 పాయింట్లు పెరిగి 67,519 వద్ద స్థిరపడింది. వరుసగా వరుసగా పదో రోజూ లాభాలు కొనసాగించిన ఈ సూచీ ఇంట్రాడేలో 304 పాయింట్లు బలపడి 67,771 వద్ద జీవితకాల రికార్డు నెలకొల్పింది. నిఫ్టీ 33 పాయింట్లు పెరిగి 20,103 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 98 పాయింట్లు ఎగసి 20,167 స్థాయిని తాకింది. ఇంట్రాడే, ముగింపులు ఈ సూచీకి జీవితకాల గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఎఫ్‌ఎంసీజీ, మీడియా, వినిమయ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ ఇండెక్సులు 1.15%, 1.02% లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ రెండు పైసలు పెరిగి 83.03 వద్ద స్థిరపడింది. అమెరికా ద్రవ్యోల్బణ డేటా అంచనాలకు మించిన నమోదవడంతో పాటు ఈసీబీ కఠిన ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపొచ్చనే ఊహాగానాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- వర్లి ప్రాంతంలో తన 22 ఎకరాల భూమిని జపాన్‌కు చెందిన సుమిటోమోకు రూ.5,200 కోట్లకు విక్రయించనుండటంతో బాంబే డైయింగ్ షేరు 9% లాభపడి రూ.153 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 20% ర్యాలీ చేసి రూ.168.50 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.
- ఆర్‌ఐఎన్‌ఎల్, ఎన్‌ఎల్‌ఎంసీ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకోవడంతో పాటు రూ.180 కోట్ల ఆర్డర్లను దక్కించుకోవడంతో ఎన్‌బీసీసీ షేరు 8% లాభపడి రూ.60.67 వద్ద ముగిసింది.
- బీఎస్‌ఈ రియల్టీ సూచీ 1.50%, ఆయిల్ గ్యాస్ 1.40%, మెటల్ 1.39%, కమోడిటీ 1.09%, ఆటో 0.94% ఇంధన 0.92%, యుటిలిటీ 0.82% చొప్పున పెరిగాయి.

కళామందిర్ @ రూ. 210-222

ఈ నెల 20–22 మధ్య ఐపీవో

సంప్రదాయ దుస్తుల రిటైలర్ సాయి సిల్క్స్ (కళామందిర్) పబ్లిక్ ఇష్యూకి రూ. 210–222 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 22న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 2.7 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. వెరసి రూ. 1,201 కోట్లను సమకూర్చుకోనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 67 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 280 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. కళామందిర్, వరమహాలక్ష్మి సిల్క్స్, మందిర్, కేఎల్‌ఎం ఫ్యాషన్ మాల్ బ్రాండ్లతో స్టోర్లను నిర్వహిస్తున్న హైదరాబాద్ కంపెనీ 2023 మార్చికల్లా రూ. 1,351 కోట్ల టర్నోవర్ సాధించింది. రూ. 98 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023 జులైకల్లా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో 54 స్టోర్లను నిర్వహిస్తోంది.

నకిలీ విక్రేతలపై టీటీకే ప్రెస్టీజ్ కఠిన చర్యలు

హైదరాబాద్: ప్రెస్టీజ్ బ్రాండు పేరుతో నకిలీ ఉపకరణాలు అమ్ముతున్న విక్రేతలపై టీటీకే ప్రెస్టీజ్ చట్టపరమైన చర్యలు చేపట్టింది. తెలుగు రాష్ట్రాల్లో బ్రాండ్‌ను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడుతున్న కొందరు విక్రేతలపై ఫిర్యాదు దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో శివసాయి కేంద్రం, తెలంగాణలో బెథల్ ఇండస్ట్రీస్‌పై ఫిర్యాదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ తక్షణం స్పందించిన పోలీసులు నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. 'టీటీకే బ్రాండ్ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. నకిలీలపై ఏమాత్రం అనుమానం ఉన్నా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి' అని సంస్థ ఒక ప్రకటనలో కోరింది.

బిర్లా 'ఓపస్' పెయింట్స్

- పెయింట్స్ విపణిలోకి గ్రాసిమ్
- రూ.10,000 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ రంగంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అయిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ఎంట్రీ ఇచ్చింది. ఈ మేరకు 'బిర్లా ఓపస్' బ్రాండ్‌ను గురువారం ఆవిష్కరించింది. డెకొరేటివ్ పెయింట్ల వ్యాపారంలో గ్రాసిమ్ రూ.10,000 కోట్లు వెచ్చించనున్నట్టు వెల్లడించింది. 2024 జనవరి–మార్చి కాలంలో బిర్లా ఓపస్ ఉత్పత్తులు మార్కెట్లోకి రానున్నాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ హరియాణా, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో పెయింట్ల తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 133.2 కోట్ల లీటర్లు. అధిక వృద్ధి ఉన్న విపణిలోకి ప్రవేశించడానికి కొత్త విభాగం వీలు కల్పిస్తుందని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా ఈ సందర్భంగా అన్నారు. విజయవంతమైన వ్యాపారాన్ని ప్రారంభించేందుకు రెండేళ్లుగా బలమైన పునాదిని నిర్మించినట్టు చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో రెండవ స్థానంలో నిలిచి లాభదాయక కంపెనీగా ఎదగడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. డెకొరేటివ్ పెయింట్స్ పరిశ్రమ భారత్‌లో రెండంకెల వృద్ధితో ఏటా రూ.70,000 కోట్లు నమోదు చేస్తోంది. 2022–23లో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ 23 శాతం వృద్ధితో రూ.1.17 లక్షల కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయాన్ని ఆర్జించింది. కాగా, గ్రాసిమ్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 0.12 శాతం క్షీణించి రూ.1,931.40 వద్ద స్థిరపడింది.



రాణించిన ఉనాద్కట్, జయంత్

ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో బరిలోకి దిగిన భారత క్రికెటర్లు జైదేవ్ ఉనాద్కట్, జయంత్ యాదవ్ ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. లెస్టర్‌షైర్ క్లబ్‌తో జరిగిన డివిజన్-2 మ్యాచ్‌లో ససెక్స్ జట్టు తరఫున ఆడిన ఉనాద్కట్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఉనాద్కట్ 23 పరుగులిచ్చి 3 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 94 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ససెక్స్ జట్టు 15 పరుగుల తేడాతో గెలిచింది. లాంకషైర్‌తో జరిగిన డివిజన్-1 మ్యాచ్‌లో మిడిల్‌సెక్స్ జట్టుకు ఆడిన జయంత్ యాదవ్ 131 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్ 'డ్రా' అయింది. తొలిసారి కౌంటీ క్రికెట్‌లో ఆడుతున్న భారత లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చహల్ (3/63, 2/43) కెంట్ తరఫున ఐదు వికెట్లు తీసుకున్నాడు.




ముగిసిన భారత్ పోరు



కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ... అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీలు ఓటమి చవిచూశాయి. గాయత్రి-ట్రెసా 8-21, 14-21తో అప్రియాని రహాయు-సితి ఫాదియా (ఇండోనేసియా)ల చేతిలో... అశ్విని-తనీషా 18-21, 7-21తో టాప్ సీడ్ మయు మత్సుమోటో-వకాన నగహారా (జపాన్)ల చేతిలో పరాజయం పాలయ్యారు. గాయత్రి, అశ్విని జోడీలకు 1,575 డాలర్ల (రూ. 1 లక్ష 30 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 3600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మోటార్ స్పోర్ట్ టీమ్ యజమానిగా నాగ చైతన్య

హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ సొంతం



సాక్షి, హైదరాబాద్: మోటార్ స్పోర్ట్ రేసింగ్‌లో తెలుగు హీరో అక్కినేని నాగచైతన్య భాగమయ్యాడు. ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్‌ఎల్)లో ఒక జట్టయిన 'హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్'ను అతను కొనుగోలు చేశాడు. ఇండియన్ రేసింగ్ లీగ్ గత సీజన్‌లో నాలుగు రేస్‌లు గెలిచిన ఈ టీమ్ త్వరలో తొలిసారి నిర్వహించనున్న 'ఎఫ్‌ఐఏ ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్'లో కూడా పాల్గొనబోతోంది. 2022 సీజన్‌లో బ్లాక్‌బర్డ్స్ జట్టుకే చెందిన అఖిల్ రవీంద్ర డ్రైవర్స్ టైటిల్ విజేతగా నిలిచాడు. టీమ్ చాంపియన్‌షిప్‌లో బ్లాక్ బర్డ్స్‌కు రెండో స్థానం దక్కింది. అఖిల్‌తో పాటు స్విట్జర్లాండ్‌కు చెందిన నీల్ జానీ ఈ టీమ్‌లో మరో డ్రైవర్‌గా ఉన్నాడు. చిన్నప్పటి నుంచి మోటార్ రేసింగ్‌ను ఎంతో ఇష్టపడే తాను ఇప్పుడు టీమ్ యజమానిగా రేసింగ్ బృందంలో భాగం కావడం సంతోషంగా ఉందని నాగచైతన్య వ్యాఖ్యానించాడు.

జోరు కొనసాగించేందుకు...

- 'సూపర్-4' చివరి మ్యాచ్‌లో నేడు బంగ్లాదేశ్‌తో భారత్ 'ఢీ'
- మధ్యాహ్నం గం. 3:00 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



రోహిత్ శర్మ



షకీబ్

కొలంబో: ఆసియా కప్‌లో ఫలితం దృష్ట్యా ప్రాధాన్యత లేని చివరి లీగ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. 'సూపర్-4' దశలో భాగంగా నేడు జరిగే పోరులో భారత్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి. భారత్ ఇప్పటికే టోర్నీలో ఫైనల్‌కు చేరగా... బంగ్లాదేశ్ ఫైనల్ రేసు నుంచి ముందే నిష్క్రమించింది. ఇరు జట్లకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆటగాళ్లను పరీక్షించడం లేదా విశ్రాంతి మాత్రమే ఈ మ్యాచ్‌కు సంబంధించి ప్రధానంగా మారాయి. ద్వైపాక్షిక సిరీస్‌లు కాకుండా మూడు అంతకుమించి దేశాలు పాల్గొన్న టోర్నీల్లో బంగ్లాదేశ్ చేతిలో ఏనాడూ ఓడని టీమిండియా ఆడిన ఐదు మ్యాచుల్లోనూ విజయం సాధించింది. పిచ్ నెమ్మదిగా ఉండే అవకాశం కనిపిస్తుండగా మ్యాచ్ రోజు వర్షసూచన లేకపోవడం విశేషం.

అయ్యర్ బరిలోకి...

మ్యాచ్‌కు ప్రాధాన్యత లేకపోయినా భారత్ అనవసరపు మార్పులు చేయకపోవచ్చు. రాబోయే వరల్డ్ కప్ సన్నాహాలను దృష్టిలో ఉంచుకొని చూస్తే పూర్తి స్థాయి రెగ్యులర్ జట్టుతోనే బరిలోకి దిగవచ్చు. టాప్-3 రోహిత్, గిల్, కోహ్లి ఇప్పటికే సిరీస్‌లో తమ సత్తా ప్రదర్శించగా, ఇషాన్ కిషన్ కూడా ఆకట్టుకున్నాడు. కేఎల్ రాహుల్ తన విలువేంటో పాక్‌తో మ్యాచ్‌లో చూపించడం మేనేజ్‌మెంట్‌కు బెంగ తగ్గింది. అయితే మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ పరిస్థితి మాత్రమే కాస్త ఇబ్బందికరంగా ఉంది. గాయంతో అతను రెండు మ్యాచ్‌లు ఆడలేదు. అతడి బ్యాటింగ్‌ను పరీక్షించడం ఇప్పుడు కీలకం. గురువారం నెట్స్‌లో అందరికంటే ఎక్కువగా సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్ చేసిన అతను మ్యాచ్‌కు సిద్ధమైనట్లుగా కనిపిస్తోంది. అయ్యర్‌ను ఆడించాలనుకుంటే కిషన్‌ను పక్కన పెట్టవచ్చు. టోర్నీలో బుమ్రా మరీ ఎక్కువగా ఏమీ బౌలింగ్ చేయలేదు కాబట్టి విశ్రాంతి అనవసరం. అయితే మ్యాచ్ ప్రాక్టీస్ కోసం సిరాజ్ స్థానంలో షమీని ఎంచుకునే అవకాశం ఉంది. ఆపై పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని శార్దుల్, అక్షర్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. టోర్నీలో మొత్తంలో అఫ్గానిస్తాన్‌పై ఒక మ్యాచ్ గెలవడం మినహా బంగ్లాదేశ్ ఏ రకంగానూ ఆకట్టుకోలేకపోయింది. గత కొన్నాళ్లుగా వన్డేల్లో ఆ జట్టు ప్రదర్శన చూస్తే టోర్నీలో మంచి పోటీ ఇవ్వగలదని భావించినా అంతా తలకిందులైంది. కెప్టెన్ షకీబ్ సహా ఏ ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోయారు. తొలి రెండు మ్యాచ్‌లలో చెలరేగిన నజ్ముల్ గాయంతో స్వదేశం తిరిగి వెళ్లగా, వికెట్ కీపర్ ముష్ఫికర్ కూడా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేడు. ఈ నేపథ్యంలో కొత్త ఆటగాళ్లను ఆ జట్టు పరీక్షించే అవకాశం ఉంది. అయితే ఎవరు ఎలా ఆడినా షకీబ్ ప్రదర్శనపైనే ఆ జట్టు విజయావకాశాలు ప్రధానంగా ఆధారపడి ఉన్నాయనేది వాస్తవం.

ఇంగ్లండ్ ఘనవిజయం



లండన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 181 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 369 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన న్యూజిలాండ్ 39 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్లెన్ ఫిలిప్స్ (72; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. లివింగ్‌స్టోన్ (3/16), క్రిస్ వోక్స్ (3/31), రీస్ టాప్లే (2/31) న్యూజిలాండ్‌ను దెబ్బతీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 368 పరుగులకు ఆలౌటైంది. భారీ సెంచరీ చేసిన బెన్ స్టోక్స్‌కు (124 బంతుల్లో 182; 15 ఫోర్లు, 9 సిక్స్‌లు) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం లభించింది. సిరీస్‌లో చివరిదైన నాలుగో వన్డే నేడు లార్డ్స్ మైదానంలో జరుగుతుంది.

ఫైనల్లో శ్రీలంక

పాకిస్తాన్‌పై 2 వికెట్లతో విజయం • ఆదివారం భారత్‌తో టైటిల్ పోరు



కుశాల్ మెండిస్

కొలంబో: ఆసియా కప్ ఫైనల్ మరోసారి భారత్, శ్రీలంక మధ్య జరగనుంది. గురువారం హోరాహోరీగా సాగిన 'సూపర్-4' మ్యాచ్‌లో లంక 2 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించి ఈ టోర్నీలో 11వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన సమరంలో చివరకు లంకదే పైచేయిగా నిలిచింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ముందుగా 45 ఓవర్లకు, ఆ తర్వాత 42 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 42 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (73 బంతుల్లో 86 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (69 బంతుల్లో 52; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇఫ్తికార్ అహ్మద్ (40 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఒకదశలో జట్టు స్కోరు 130/5 కాగా... రిజ్వాన్, ఇఫ్తికార్ ఆరో వికెట్‌కు 108 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం లంక లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ ద్వారా 42 ఓవర్లలో 252 పరుగులుగా నిర్దేశించారు. లంక సరిగ్గా 42 ఓవర్లలో 8 వికెట్లకు 252 పరుగులు సాధించి గెలిచింది. కుశాల్ మెండిస్ (87 బంతుల్లో 91; 8 ఫోర్లు, 1 సిక్స్), సదీరా సమరవిక్రమ (51 బంతుల్లో 48; 4 ఫోర్లు), అసలంక (47 బంతుల్లో 49 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ గెలుపుతో శ్రీలంక నాలుగు పాయింట్లతో 'సూపర్-4' దశలో రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నిష్క్రమించాయి.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి) మదుషన్ (బి) పతిరణ 52; ఫఖర్ (బి) మదుషన్ 4; బాబర్ (స్టంప్డ్) మెండిస్ (బి) వెలలాగె 29; రిజ్వాన్ (నాటౌట్) 86; హారిస్ (సి అండ్ బి) పతిరణ 3; నవాజ్ (బి) తీక్షణ 12; ఇఫ్తికార్ (సి) షనక (బి) పతిరణ 47; షాదాబ్ (సి) మెండిస్ (బి) మదుషన్ 3; షాహీన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (42 ఓవర్లలో 7 వికెట్లకు) 252. వికెట్ల పతనం:** 1-9, 2-73, 3-100, 4-108, 5-130, 6-238, 7-243. **బౌలింగ్:** మదుషన్ 7-1-58-2, తీక్షణ 9-0-42-1, షనక 3-0-18-0, వెలలాగె 9-0-40-1, పతిరణ 8-0-65-3, ధనంజయ 6-0-28-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి అండ్ బి) షాదాబ్ 29; పెరీరా (రనౌట్) 17; మెండిస్ (సి) హారిస్ (బి) ఇఫ్తికార్ 91; సమరవిక్రమ (స్టంప్డ్) రిజ్వాన్ (బి) ఇఫ్తికార్ 48; అసలంక (నాటౌట్) 49 ; షనక (సి) నవాజ్ (బి) ఇఫ్తికార్ 2; ధనంజయ (సి) వసీమ్ (బి) షాహీన్ 5; వెలలాగె (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 0; మదుషన్ (రనౌట్) 1; పతిరణ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (42 ఓవర్లలో 8 వికెట్లకు) 252. వికెట్ల పతనం:** 1-20, 2-77, 3-177, 4-210, 5-222, 6-243, 7-243, 8-246. **బౌలింగ్:** షాహీన్ 9-0-52-2, జమాన్ 6-1-39-0, వసీమ్ 3-0-25-0, నవాజ్ 7-0-26-0, షాదాబ్ 9-0-55-1, ఇఫ్తికార్ 8-0-50-3.



రిజ్వాన్

క్లుప్తంగా...

మహోన్నత వ్యక్తి 'గాడిచర్ల'

- గవర్నర్ అబ్దుల్‌నజీర్



మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

చిలకలపూడి (మచిలీపట్నం): గాడిచర్ల హరిసర్వోత్తమరావు బహుముఖ పాత్ర పోషించి మహోన్నత వ్యక్తిగా నిలిచారని గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి సందర్భంగా గాడిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త, బహుభాషా కోవిదుడు, పాత్రికేయుడు, నాటక రచయితగా గాడిచర్ల బహుముఖ పాత్రలు పోషించారన్నారు. ఆంధ్రపత్రికకు తొలి ఎడిటర్‌గా ఆయన సేవలు అందించారన్నారు. యంగ్ ఇండియా పత్రికలో ప్రచురితమైన ఓ వ్యాసంలో గాడిచర్లను మహాత్మాగాంధీ ధైర్యశాలిగా కీర్తించారన్నారు. గ్రంథాలయాల ఏర్పాటు, నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ఆయన ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. తెలుగు భాషాభిమాని మండలి బుద్ధప్రసాద్‌కు గాడిచర్ల ఫౌండేషన్ తరపున పురస్కారం అందించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షులు హేమచంద్రారెడ్డి, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ కల్కురా, కార్యదర్శి రావి శారద, కలెక్టర్ రాజాబాబు, వర్సిటీ వీసీ జ్ఞానమణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 30 వరకు పెంచినట్లు వర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.అజంతకుమార్ గురువారం తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన వారు, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో పాసైన వారు నేరుగా డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చన్నారు. పీజీలో చేరేందుకు మూడేళ్ల డిగ్రీ పాసైనవారు అర్హులని పేర్కొన్నారు. లైబ్రరీ సైన్స్ కోర్సులో చేరడానికి డిగ్రీ పూర్తి చేసినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మదింపు బూటకం.. నివేదిక నాటకం

'స్కిల్' ప్రాజెక్ట్‌ను తాము పరిశీలించనే లేదన్న 'సీఐటీడీ'

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన సెక్షన్లు సరైనవేనని నిర్ధారిస్తూ పది గంటలపాటు విచారించిన అనంతరం న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. ఎల్లో మీడియా మాత్రం దీనికి విరుద్ధంగా సొంత తీర్పులు ఇచ్చేస్తూ పతాక శీర్షికల్లో కథనాలను ప్రచురించడం విస్మయపరుస్తోంది. టీడీపీ హయాంలో తెరపైకి తెచ్చిన ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్ సరైందేనంటూ 'సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)' థర్డ్ పార్టీగా మదింపు జరిపి నివేదిక సమర్పించిందంటూ వక్రీకరించి ప్రజల్ని నమ్మించేందుకు రామోజీ నానా పాట్లు పడ్డారు. అయితే తాము ఇచ్చింది మూడో పార్టీ నివేదికే కాదని... అది కేవలం ఏపీఎస్‌ఎస్‌డీసీ ఇచ్చిన పత్రాల పరిశీలన మాత్రమేనని 'సీఐటీడీ' స్పష్టం చేయడం గమనార్హం. మదింపు నివేదిక ఇవ్వాలంటే ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. కానీ తాము అసలు ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌ను పరిశీలించనే లేదని సీఐటీడీ తేల్చి చెప్పింది. పోనీ ఈనాడు చెబుతున్నట్టుగా సీఐటీడీ మదింపు



సీమెన్స్ ప్రాజెక్టు నిజం

నివేదిక ఇచ్చిందని భావించినా సరే.. అంతకంటే కంటే ముందుగానే నిబంధనలకు విరుద్ధంగా డిజైన్ టెక్ కంపెనీకి చంద్రబాబు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఈ ప్రాజెక్ట్‌లో అవినీతిని రుజువు చేస్తోంది.

అది కేవలం పత్రాల పరిశీలనే

ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌పై తాము ఎలాంటి మదింపు నివేదిక ఇవ్వలేదని సీఐటీడీ స్పష్టం చేసింది. మదింపు నివేదిక ఇవ్వాలంటే తమ బృందం స్కిల్ డెవలప్‌మెంట్ క్లస్టర్లను స్వయంగా పరిశీలించి అక్కడి సాఫ్ట్‌వేర్, మౌలిక వసతులను పరిశీలించి ప్రాజెక్ట్ వ్యయాన్ని అంచనా వేయాల్సి ఉంటుందని, కానీ తమను ఆ విధంగా మదింపు నివేదిక ఇవ్వాలని అసలు ఏపీఎస్‌ఎస్‌డీసీ కోరనే లేదని సీఐటీడీ తెలిపింది. ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులు, డిజైన్ టెక్ ప్రతినిధులు తమ వద్దకు వచ్చి ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పత్రాలను మాత్రమే అందించి పరిశీలించాలని కోరినట్లు పేర్కొంది. అంటే ఏపీఎస్‌ఎస్‌డీసీ జీవోలో పేర్కొన్నట్టుగా సీమెన్స్–డిజైన్ టెక్ కంపెనీలు రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌లో 90 శాతం నిధులను వెచ్చించాయో లేదో కూడా సీఐటీడీకి తెలియదు. ప్రభుత్వ వాటా రూ.370 కోట్లు విడుదల చేయవచ్చో లేదో కూడా ఆ సంస్థకు అవగాహనే లేదు. కేవలం ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులు ఇచ్చిన పత్రాల్లో ఉన్నవాటిని చూసి తాము నివేదిక ఇచ్చామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్ట్ రూ.3,330 కోట్లు విలువ చేస్తుందని తాము నిర్ధారించినట్టు కాదని, రూ.371 కోట్లు ప్రభుత్వ వాటా విడుదల చేసేందుకు సమ్మతించినట్లూ కాదని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్‌ను భౌతికంగా పరిశీలించకుండా మదింపు నివేదిక ఇవ్వడం సాధ్యం కాదని కూడా తేల్చి చెప్పింది. ఈమేరకు సీఐటీడీ ఉన్నతాధికారులు సీఐడీ విచారణలో స్పష్టమైన వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ముందే నిధుల విడుదల

పత్రాల పరిశీలనే మూడో పార్టీ నివేదిక అని బుకాయించేందుకు టీడీపీ, ఎల్లో మీడియా చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. పత్రాలన్నీ పరిశీలించి సీఐడీటీ నివేదిక ఇచ్చిన తరువాతే నిధులు విడుదల చేయాలి. టీడీపీ సర్కారు దీన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులు, డిజైన్ టెక్ ప్రతినిధులు కొన్ని పత్రాలు సమర్పించి నివేదిక ఇవ్వాలని సీఐటీడీని 2015 డిసెంబర్ 5న కోరారు. ఆ సంస్థ తన నివేదికను 2016 మార్చి 31న ఇచ్చింది. కానీ ఆ నివేదికతో నిమిత్తం లేకుండానే, అంతకంటే ముందే డిజైన్ టెక్‌కు టీడీపీ సర్కారు నిధులు విడుదల చేసేసింది. 2015 డిసెంబర్ 5న రూ.185 కోట్లు, 2016 జనవరి 29న రూ.85 కోట్లు, మార్చి 11న రూ.67 కోట్లు విడుదల చేశారు. మూడు విడతల్లో రూ.337 కోట్లు డిజైన్ టెక్ కంపెనీకి ఇచ్చేశారు. చివరగా 2016 మార్చి 31న మిగిలిన రూ.34 కోట్లు కూడా విడుదల చేశారు. అంటే సీఐటీడీ తన మదింపు నివేదికలో ఏం చెప్పిందో పరిశీలించకుండానే, సమీక్షించకుండానే నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో చంద్రబాబు అవినీతికి అదే నిదర్శనం.

2030 నాటికి ఇస్రో నుంచి స్పేస్ టూరిజం

ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి



స్పేస్ టూరిజం కోసం వ్యోమనౌక ఊహా చిత్రం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రయాన్–3, సూర్యయాన్ వంటి ప్రయోగాలను దిగ్విజయంగా నిర్వహించి ప్రస్తుతం గగన్‌యాన్ ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతోంది. మరోవైపు 2030 నాటికి స్పేస్ టూరిజానికి కూడా ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటోంది. గగన్‌యాన్ ప్రయోగంలో ముందుగా మానవ రహిత ప్రయోగాలను, అనంతరం మానవ సహిత ప్రయోగాలను నిర్వహించనుంది. మానవ సహిత ప్రయోగం విజయవంతంగా నిర్వహించిన వెంటనే స్పేస్ టూరిజం వైపు అడుగులు వేయనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. ఈ మేరకు ఇస్రో వెబ్‌సైట్‌లో గురువారం వివరాలు పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రయోగాల్లో మానవ సహిత ప్రయోగాల్లో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించి తిరిగి క్షేమంగా తీసుకువచ్చిన తర్వాత ఇస్రో స్పేస్ టూరిజం ప్రాజెక్ట్ చేపడుతుందని సోమనాథ్ తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్లే పర్యాటకులకు ఒక్కో టికెట్ ధర రూ.ఆరు కోట్లు ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే భారత్ అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరడం ఖాయమవుతుందని తెలిపారు. కాగా యువత శాస్త్రవేత్తలుగా ఎదిగి ఇస్రోలో చేరి దేశానికి సేవ చేయాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ బీవీ సుబ్బారావు సూచించారు. సూళ్లూరుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అంతరిక్ష రాకెట్ ప్రయోగాలు' అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీవీ సుబ్బారావు మాట్లాడుతూ భారత అంతరిక్ష యాత్ర.. నేడు చంద్రుడు, సూర్యుడిపై అధ్యయనం కోసం గ్రహాంతర ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించే స్థాయికి చేరిందని వివరించారు.

రన్‌వేపై జారిన విమానం

రెండు ముక్కలైన విమానం.. ముగ్గురికి స్వల్ప గాయాలు



సాక్షి ముంబై: ముంబై విమానాశ్రయంలో ఓ చార్టర్డ్ విమానం రన్‌వేపై దిగుతుండగా ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణహాని జరగకపోయినప్పటికీ ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం విశాఖపట్నం నుంచి గ్లోబల్ ఎల్‌జే 45 విమానం ముంబైకి బయల్దేరింది. అయితే ముంబై విమానాశ్రయంలోని ప్రధాన రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా జారిపోయింది. ఆ తర్వాత విమానం రెండు ముక్కలవడంతోపాటు విమానానికి మంటలు అంటుకున్నాయి. ఈ విమానంలో జేఎం భక్షి గ్రూప్ ఎండీ ధ్రువ్ కోటక్‌తో కలిపి మొత్తం ఆరుగురు ప్రయాణికులు, ఇద్దరు క్రూ మెంబర్స్ ఉన్నారు. వీరిలో ముగ్గురికి గాయాలయ్యాయి. భారీ వర్షం కారణంగా ముంబైలో విజిబిలిటీ బాగా పడిపోవడం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అభిప్రాయపడ్డారు.

నాలెడ్జ్ క్యాపిటల్‌గా తిరుపతి

- ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ భట్టాచార్య
- ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో సుస్థిర గ్రామీణ జీవనోపాధి సాధనపై జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ : తిరుపతి ఇప్పటికే నాలెడ్జ్ హబ్‌గా పేరుగాంచిందని, త్వరలో నాలెడ్జ్ క్యాపిటల్‌గా తయారవుతుందని ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య చెప్పారు. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం సుస్థిర గ్రామీణ జీవనోపాధి సాధనపై జరిగిన జాతీయ సదస్సుకు దేశంలోని పలు వెటర్నరీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వీసీలు, విభాగాల డైరెక్టర్లు, డీన్‌లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ అనేక ఏళ్లుగా జంతు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. దేశంలో జీవనోపాధికోసం గ్రామీణ ప్రజలు సగటున రోజుకు 30 మంది పట్టణ ప్రాంతాలకు వలస వెళుతున్నారని, సుస్థిర గ్రామీణ జీవనోపాధికోసం వర్సిటీలు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. జంతు సంరక్షణపై దృష్టి సారించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యాధి మూలాలకు పరిష్కార మార్గాలను కనుగొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సుకు హాజరైన వీసీలు మాట్లాడుతూ మొబైల్ యాప్స్ ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని అందించి వారి ప్రమాణాలను మెరుగుపర్చాలని సూచించారు. పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై జాతీయ సదస్సు దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. పరిశోధనల సంపుటిని ఆవిష్కరించి, అనంతరం శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు పలు అంశాలపై వక్తలు అవగాహన కల్పించారు. సదస్సులో కర్ణాటక బీదర్ వర్సిటీ వీసీ కేసీ వీరన్న, తిరుపతి పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ డి భారతి తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో ఐపీఎల్ తరహాలో జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ

అక్టోబర్ 12 నుంచి నిర్వహణ



సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను అక్టోబర్ 12 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి గురువారం తెలిపారు. అనంతపురంలోని ఆర్డీటీ ప్రధాన క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ తరహాలో టోర్నీని నిర్వహించనున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తమ సంస్థల ఐడీకార్డులతో పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఒక జిల్లాకు ఒకే జట్టు అనే నిబంధన లేదని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ జర్నలిస్టుకు ప్రత్యేక ఎంట్రీలు ఉంటాయన్నారు. టోర్నీ విజేతకు రూ.లక్ష బహుమతితో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. ఈ నెల 30లోగా ఎంట్రీలు పంపించాలని, రిజిస్ట్రేషన్ కోసం 9849152149, 9390997033, 7386958666 నంబర్లను సంప్రదించాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



16 నుంచి శత జయంత్యుత్సవాలు

విజయవాడ కల్చరల్: స్థానిక శివరామకృష్ణ క్షేత్రంలో శనివారం నుంచి కృష్ణమాచార్యులు శత జయంతి నిర్వహిస్తున్నట్లు కళాపీఠం ప్రధాన కార్యదర్శి బుచ్చయాచార్యులు తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



హరిసర్వోత్తమరావు జయంతి

చిలకలపూడి: కృష్ణా వర్సిటీలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు.

న్యూస్‌రీల్

బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులను పరిశోధనా రంగం వైపు ప్రోత్సహిస్తూ, బాల శాస్త్రవేత్తలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి క్యాంప్ ఆఫీసులో గురువారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీలో జరగనున్న ఓరియంటేషన్ కార్యక్రమానికి ప్రతి పాఠశాల నుంచి ఒక సైన్స్ టీచర్ హాజరై జిల్లా నుంచి అత్యుత్తమ ప్రాజెక్టులు తయారు చేయించాలని కోరారు. ఈ ఏడాది ఫోకల్ థీమ్ ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అని తెలిపారు. అలాగే మరో ఐదు సబ్ థీమ్స్‌లలో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేపట్టవచ్చని తెలిపారు. జిల్లా కో–ఆర్డినేటర్ మైనం హుస్సేన్, విజయవాడ డీవైఈఓ కుమార్, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత కృష్ణాజిల్లా



కంకిపాడు: అంతర్ రాష్ట్ర నైన్ ఏ సైడ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. మండలంలోని ఈడుపుగల్లులోని నలంద విద్యానికేతన్‌లో రాష్ట్రస్థాయి నైన్ ఏ సైడ్ జూనియర్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ గురువారం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఫుట్‌బాల్ జట్లు టోర్నమెంట్‌కు హాజరయ్యారు. హోరాహోరీగా సాగిన పోటీలో విజేతగా కృష్ణాజిల్లా జట్టు నిలిచింది. రెండో స్థానంలో నంద్యాల జిల్లా జట్టు నిలవగా, మూడో స్థానంలో పశ్చిమగోదావరి, నాలుగో స్థానంలో ఎన్టీఆర్ జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు నలంద విద్యానికేతన్ కరస్పాండెంట్ సుధ, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ.నరేష్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ బహుమతులు అందించారు. పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

దుర్గమ్మకు బంగారపు గొలుసు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు మహారాష్ట్రకు చెందిన మహారాష్ట్ర ఉప్పుగుండూరి ఎల్‌డీపీ శ్రీనివాస్, సునీత, ఇతర కుటుంబ సభ్యులు ఈవో భ్రమరాంబను కలిసి సుమారు రూ.1.44 లక్షల విలువైన 24 గ్రాముల బంగారపు గొలుసును కానుకగా సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

రెండు వెండి గంగాళాలు బహూకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు విజయవాడ కొత్తపేటకు చెందిన నోరి రామకృష్ణశాస్త్రి కుటుంబం 2.145 కిలోల వెండితో తయారు చేయించిన రెండు వెండి గంగాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి మహా నివేదనకు ఈ వెండి గంగాళాలను వినియోగించాల్సిందిగా దాతలు కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

నేడు మిర్చి యార్డు పాలకవర్గ సమావేశం

కొరిటిపాడు : గుంటూరు మార్కెట్ యార్డు పాలకవర్గ సమావేశం చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరుగుతుందని మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు.

మార్గం సుగమం

బెజవాడ తూర్పు బైపాస్‌కు తుది రూపు

- పొట్టిపాడు నుంచి కాజ వరకు 49.5 కిలోమీటర్ల మేర నిర్మాణం
- బందరు పోర్టుకు కనెక్టివిటీ
- రూ. 2,765.81కోట్ల అంచనాతో నాలుగులేన్ల రహదారికి ప్రతిపాదనలు
- కృష్ణా నదిపై 3.75 కి.మీ పొడవుతో వంతెన నిర్మాణం
- విజయవాడ నగర వాసులకు తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: బెజవాడకు తూర్పు బైపాస్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. కృష్ణా జిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు 49.51 కి.మీ పొడవునా నిర్మించే ప్రతిపాదనల వైపు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో ప్రత్యేకంగా చర్చించారు. బైపాస్ నిర్మాణం పూర్తయితే జాతీయ రహదారిపై వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండా ప్రయాణిస్తాయి. ఈస్ట్ బైపాస్‌కు సంబంధించి మూడు మార్గాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయగా 49.51 కి.మీ రహదారి వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

ఏ జిల్లాలో ఎంత..

కృష్ణా జిల్లా పరిధిలో 27.71 కిలో మీటర్లు, గుంటూరు జిల్లాలో 19.80 కిలోమీటర్ల మేర రహదారి ఉండనుంది. ఇందులో కృష్ణానదిపై 3.750 కిలోమీటర్ల వంతెన నిర్మాణం చేయనున్నారు. 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించేందుకు వీలుగా నాలుగు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ఆరు వరుసల రహదారి విస్తరణకు వీలుగా 60 మీటర్ల వెడల్పుతో ఎలైన్‌మెంట్‌ను సిద్ధం చేశారు.



రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం..

రాష్ట్ర ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి అన్ని విధాలా సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. తొలుత భూసేకరణ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని తొలుత కేంద్రం కోరింది. అయితే దీనికి బదులుగా ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే వివిధ ఖనిజాలకు తీసుకొనే సీనరేజీ చార్జీలు, నిర్మాణ సామగ్రికి రాష్ట్ర జీఎస్టీని మినహాయించాలని కేంద్రం సూచించింది. జాతీయ రహదారి, రైల్వే లైన్‌కు దగ్గర మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుకు 100 ఎకరాలు ఉచితంగా కేటాయించాలని కోరింది. వీటన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. దీంతో భూసేకరణ కేంద్రమే చూసుకుంటోంది.

హైవే ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం..

చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి(ఎన్‌హెచ్–16) విజయవాడలో నుంచి వెళ్తుండటంతో దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. అయితే చంద్రబాబు ప్రభుత్వం ట్రాఫిక్ సమస్యకు తక్షణ పరిష్కారం గురించి యోచించకుండా గ్రాఫిక్స్‌తో కనికట్టు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విజయవాడలో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించింది. బందరు పోర్టు నిర్మాణం పూర్తి అయితే రాకపోకలు సాగించే భారీ వాహనాలతో విజయవాడ వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రం అవుతాయని గుర్తించింది. కేంద్రంతో చర్చించి తూర్పు బైపాస్ నిర్మాణం దిశగా కార్యాచరణ చేపట్టింది. బందర్ పోర్టు వాహనాలు కూడా విజయవాడ నగరంలోకి రాకుండా జాతీయ రహదారి బైపాస్ మీదుగా అటు చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ వైపు వెళ్లవచ్చు.



ప్రతిపాదిత విజయవాడ తూర్పు బైపాస్ మ్యాప్ (గ్రీన్ లైన్)

రహదారి వెళ్లే ప్రాంతాలు

కృష్ణా జిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాలు.. గుంటూరు జిల్లాలో కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి మండలాల మీదుగా కాజ.

తూర్పు బైపాస్‌కు డీపీఆర్ సిద్ధం..



విజయవాడ బైపాస్‌కు ఎలైన్‌మెంట్‌కు సంబంధించిన డీపీఆర్ సిద్ధం అయ్యింది. ఈ రహదారికి సంబంధించి మూడు ప్రతిపాదనలు వచ్చాయి. దీనికి సంబంధించిన నిధులు త్వరితగతిన విడుదల చేసేందుకు కేంద్ర పెద్దలు, అధికారులతో చర్చిస్తా. బందరు పోర్టు కనెక్టివిటీకి ఇది బాగా ఉపయోగపడుతుంది.

– బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ

అంచనాలు ఇలా..

బైపాస్‌కు అవసరమైన భూమి	: 222.80 హెక్టార్లు
ఈ భూసేకరణకు వ్యయం	: రూ.890.57 కోట్లు
రహదారి నిర్మాణ పనులకు ఖర్చు	: రూ.1349.30 కోట్లు
కంటిన్‌జెన్సీ చార్జీలు	: రూ.478.33 కోట్లు
మొత్తం ప్రాజెక్టు అంచనా విలువ	: రూ. 2765.81కోట్లు

రహదారి నిర్మాణం ఇలా..

ఈ 49.51కి.మీ బైపాస్ రహదారికి సంబంధించి కృష్ణానదిపై వంతెనతో కలిపి ప్రధాన బ్రిడ్జిలు 05, మైనర్ బ్రిడ్జిలు 28, ఆర్వోబీలు 02, కల్వర్టులు 149, ఫ్లై ఓవర్‌లు 02, ఇంటర్ చేంజ్‌లు 02 ఉన్నాయి. విజయవాడ–విశాఖపట్నం రైల్వే లైన్‌లో ఒక క్రాసింగ్, గుంటూరు జిల్లాలో ఓ రైల్వే క్రాసింగ్ ఉంది. దవులూరు వద్ద మచిలీపట్నం–విజయవాడ రహదారి మీదుగా వెళ్లేలా ఎలైన్‌మెంట్‌ను సిద్ధం చేశారు. ఈ డీపీఆర్‌ను చైతన్య, కేజీఎం ఇంజినీరింగ్ సంస్థ రూపొందించింది. ప్రతిపాదనలను నేషనల్ హైవే అథారిటీకీ పంపామని, ఎలైన్‌మెంట్‌కు సంబంధించి ఇంకా ఫైనల్ కాలేదని ఆర్వో ఆర్‌కే సింగ్ తెలిపారు.

మరింత అభివృద్ధి..



వేగంగా అభివృద్ధి చెందుతున్న గన్నవరం నియోజకవర్గంలో నుంచి తూర్పు బైపాస్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతుండడం శుభపరిణామం. ఇప్పటికే చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణం ఎక్కువ భాగం గన్నవరం నియోజకవర్గంలోనే ఉంది. ప్రస్తుతం ఈ బైపాస్ నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

– డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎమ్మెల్యే, గన్నవరం

చాలా ప్రాధాన్యం..



బందరు పోర్టు నిర్మాణం నేపథ్యంలో తూర్పు బైపాస్ నిర్మాణం చాలా ముఖ్యమైంది. జిల్లా అభివృద్ధికి బైపాస్ ఎంతగానో దోహదపడుతుంది. ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల రాకపోకల విషయంలో బైపాస్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి వేగంలో తూర్పు బైపాస్ నిర్మించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర అభివృద్ధిలో ఇది మైలురాయిగా నిలిచిపోతుంది.

– కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే, పెనమలూరు

ట్రాఫిక్ కష్టాలకు చెక్..



ముఖ్యమంత్రి విజయవాడ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు వీలుగా ఇప్పటికే బెంజిసర్కిల్‌కు ఇరువైపులా ఫ్లై ఓవర్ నిర్మాణాలను చేపట్టారు. దీంతో పాటు తూర్పు బైపాస్ నిర్మాణానికి వీలుగా అన్ని చర్యలు తీసుకొంటున్నారు. ఇది శుభపరిణామం.

– దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి

ఆరోగ్య ఖిల్లా

ఒక కళాశాల సాధారణంగా ఏం చేస్తుంది.. విద్యార్థులకు పాఠాలు చెప్పి.. వారి ఉజ్వల భవిష్యత్తు బాటలు వేస్తుంది. అయితే మెడికల్ కళాశాలను మాత్రం కేవలం దీనితో నిర్వచించలేం. ఎందుకంటే వైద్యవిద్యతో విద్యార్థులకు మాత్రమేకాక సమాజానికి మేలు జరుగుతుంది. ఎంతో మంది డాక్టర్లు బయటకు వస్తారు. అంతేకాక పేదలకు స్పెషాలిటీ సేవలు సమీపంలోనే అందుతాయి. అటువంటి గొప్ప ఆరోగ్య దేవాలయాలు రాష్ట్ర వ్యాప్తంగా కొలువుదీరుతున్నాయి. అందులో భాగంగా బందరులో ఇప్పటికే మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవానికి ముస్తాబైంది.

ప్రారంభానికి సిద్ధమైన మచిలీపట్నం మెడికల్ కళాశాల



బందరుకు తలమానికంగా మెడికల్ కళాశాల

- నేడు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- కార్యక్రమానికి హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఏర్పాట్లు పరిశీలించిన కృష్ణా జేసీ అపరాజితాసింగ్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): భారతదేశంలోనే అతిపురాతన మునిసిపాలిటీగా పేరొందిన బందరుకు పాలకులు ఎంత మంది మారినా ఇప్పటి వరకు ఎలాంటి మార్పూ లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో బందరు ప్రాంతానికి ఉన్నత స్థాయి సంస్థలు అనేకం వస్తుండటంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన బందరు పోర్టు నిర్మాణంతో పాటు హార్బర్ నిర్మాణ పనులు ఇప్పటికే కోట్లాది రూపాయలతో పనులు జరుగుతుండగా.. ఇప్పటికే పూర్తయిన మెడికల్ కళాశాల నిర్మాణం బందరు ప్రాంతానికి తలమానికం కానుంది.

65 ఎకరాల విస్తీర్ణంలో..

కళాశాల నిర్మాణానికి రూ. 325 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. మచిలీపట్నంలోని కరగ్రహారంలో సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో ఏడు బ్లాక్‌లలో అడ్మినిస్ట్రేటివ్, ల్యాబ్‌లు, తరగతి గదులు, డిపార్ట్‌మెంటల్ బ్లాక్, ఎగ్జామినేషన్ బ్లాక్, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాలు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తి కావటంతో ఈ ఏడాది అకడమిక్ ఇయర్‌కు సంబంధించి 150 ఎంబీబీఎస్ సీట్లకు గానూ 118 సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి. ఇటీవల ఆలిండియా కోటాలో మరో ఐదు సీట్లు భర్తీ కాగా ఈ మాసంలో ప్రారంభం కానున్న రెండో విడత కౌన్సెలింగ్‌తో మిగిలిన సీట్లు మొత్తం భర్తీ చేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. వసతి గృహంలో ఇప్పటి వరకు చేరిన విద్యార్థుల్లో బాలురు –22, బాలికలు –28 మంది ఉంటున్నారు. వీరికి అధునాతన బెడ్లతో పాటు బీరువాలు, రీడింగ్ టేబుల్స్ ఏర్పాటుతో పాటు బాత్‌రూమ్‌లలో గీజర్, వాషింగ్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.



కళాశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్

పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ..

మచిలీపట్నం ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రవేశించిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించేందుకు ఫ్యాకల్టీ నియామకం పూర్తయ్యింది. మొదటి సంవత్సరానికి సంబంధించి ఏడుగురు ప్రొఫెసర్లు, 19 మంది అడిషనల్ ప్రొఫెసర్లు, 34 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. శుక్రవారం నుంచి తరగతులు పూర్తిస్థాయిలో నిర్వహించనున్నారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 15వ తేదీన విజయనగరం మెడికల్ కళాశాలను ప్రారంభించిన అనంతరం అక్కడి నుంచి వర్చువల్ పద్ధతిలో మచిలీపట్నంలోని మెడికల్ కళాశాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి మెడిసిన్ చదివేందుకు చేరిన విద్యార్థులతో మాట్లాడనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితా సింగ్ గురువారం ఉదయం మెడికల్ కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మెడికల్ కళాశాల ప్రాంగణం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేయనున్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏర్పాట్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సంబంధిత అధికారులతో జేసీ సమావేశం నిర్వహించి చర్చించారు.

చాలా సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా మెడికల్ కళాశాల ప్రారంభం కానుండటం సంతోషదాయకం. అందుకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశాం. 150 సీట్లకు గానూ ఇప్పటి వరకు 118 సీట్లు భర్తీ అయ్యాయి. రెండో కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లు మొత్తం పూర్తి స్థాయిలో భర్తీ చేస్తాం.

– డాక్టర్ కె. విజయకుమారి, ప్రిన్సిపాల్

ఆశ్చర్యం కలిగించింది



ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రవేశించిన వెంటనే నూతన హంగులతో తీర్చిదిద్దన భవనాలు, తరగతి గదులను చూసి ఆశ్చర్యం కలిగించింది. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఈ కళాశాలను తీర్చిదిద్దారు. వసతి గృహంలో మంచి సౌకర్యాలు కల్పించారు. నాణ్యమైన ఆహారం పెడుతున్నారు. ఇన్ని సౌకర్యాలు ఉంటాయని నేను ఊహించలేదు.

– జి. అభిషేక్, మెడిసిన్ విద్యార్థి, తణుకు

భవిష్యత్తు బాగుంటుంది



ఎన్నో సంవత్సరాల తర్వాత బందరు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. దీనికి ఈ మెడికల్ కళాశాల ఒక నిదర్శనం. వైద్య కళాశాల ఏర్పాటుతో మరో మెట్టు ఎక్కినట్టే. ఇది ఎంతో ఆనందదాయకం, గర్వించదగ్గ విషయం. ఏటా 150 మంది వైద్యులను దేశానికి అందించటం బందరు ఖ్యాతిని ఇనుమడింపజేస్తుంది.

– బి. శ్రీనివాసాచార్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త ఆరోగ్య పథకానికి శ్రీకారం చుట్టనుంది. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేరుతో అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి, వారికి వైద్య సేవలు అందించే ప్రక్రియకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంపై జిల్లా ప్రోగ్రామ్స్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి ఈ నెల 29 వరకూ ఇంటింటి సర్వే వార్డు, గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి వలంటీర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు వారి క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ సందర్శించి ఆయా కుటుంబాలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆవశ్యకత, దాని ప్రయోజనాలు గురించి తెలియజేస్తారన్నారు. వారి ఆరోగ్య వివరాలు సేకరిస్తామన్నారు. అనంతరం మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు పర్యవేక్షణలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలు, స్పెషాలిటీ సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

పులి లాంటి పిల్లి!

చేపలే ఆహారం.. రాత్రివేళే యుద్ధం

- కృష్ణా, బాపట్ల రేంజ్‌లో పెరుగుతున్న బావురుపిల్లి జాతి
- గుర్తింపునకు సీసీ కెమెరాలు ఏర్పాటు
- అక్టోబర్ నుంచి కౌంటింగ్‌కు ప్రత్యేక చర్యలు



నాగాయలంక అభయారణ్య ప్రాంతంలో సీసీ కెమెరాకు చిక్కిన బావురు పిల్లి(ఫైల్)



కృష్ణాడెస్క్: దక్షిణ ఆగ్నేయ ఆసియా దేశాల్లో మాత్రమే కనిపించే అరుదైన జాతి బావురు పిల్లి అంతరించిపోతున్న జాబితాలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రెండువేల లోపే ఈ జాతి పిల్లులు ఉన్నట్టు అంచనా. కృష్ణా, బాపట్ల అభయారణ్యం ప్రాంతంలో వీటిజాడ గతంలో కంటే ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వీటిని మనుషులు వేటాడకుండా తీర ప్రాంత గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

11 దేశాల్లో మాత్రమే..

చేపలను వేటాడి జీవించే ఈ అరుదైన జాతి పిల్లిని ప్రాంతాలను బట్టి బావురుపిల్లి, పులి బావుర, మరక పిల్లి, నీటి పిల్లి, ఫిషింగ్ క్యాట్ అని పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం ప్రైనైలూరుస్ వైవెర్రినస్ (prionailurus viverrinnus). మడ అడవులు, చిత్తడి నేలలలో ఎక్కువగా ఇవి జీవిస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా 11 దేశాల్లో మాత్రమే వీటి జాడను కనుగొన్నారు. 2013లో మడ అడవులపై రీసెర్చ్ చేస్తున్న తరుణంలో సముద్ర తీరం వెంబడి వీటి ఆచూకీ తెలిసింది. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 1500 నుంచి 2000 వరకూ ఉండొచ్చని అంచనా. ఈ జాతులు ప్రత్యుత్పత్తి చెందకపోతే త్వరలోనే అంతరించి పోతాయని అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి హెచ్చరించింది.

రాత్రివేళల్లోనే వేట..

78 సెం.మీ పొడవు, 8.8 కిలోల వరకూ బరువు పెరిగే ఈ బావురు పిల్లి రాత్రి వేళలో మాత్రమే చేపలను వేటాడి జీవిస్తుంది. మన ఇళ్లలో తిరిగే పిల్లుల కంటే పెద్దవిగానూ చిరుత పులికంటే చిన్నదిగానూ ఉంటుంది. అచ్చు చిరుత పులిని పోలి ఉంటుంది. ఇది చేపల వేటకు వెళ్లే సమయంలో ఆ పరిసరాల్లో మల, మూత్ర విసర్జన చేస్తుంది. ఈ వాసన గమనించిన ఇతర జాతి పిల్లులు, జంతువులు ఆ పరిసరాలకు రావు.

పర్యావరణ పరిరక్షణకు దోహదం..

సముద్రంలో ఉండే పలు రకాల చేపలు పెట్టే గుడ్లు, కొన్ని రకాల చేపలను తినే పలు రకాల చేపలను ఈ బావురు పిల్లి తింటుంది. దీనివల్ల ఇది సంచరించే ప్రాంతంలో మత్స్య సంపద పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుంది.

తీర ప్రాంత ప్రజలకు అవగాహన..

అంతరించి పోతున్న ఈ జాతిని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఏటా వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ మధ్య కృష్ణా, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని ఆటవీ తీర గ్రామాల్లో అటవీశాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

అక్టోబర్‌లో లెక్కింపునకు చర్యలు..

అటవీ తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో వీటి జాడను కనుగొన్నామని అవనిగడ్డ ఫారెస్ట్ రేంజ్ అధికారి రాఘవరావు తెలిపారు. అక్టోబర్ నుంచి వీటి సంఖ్యను లెక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

క్లుప్తంగా

మాక్సిల్లో ఫేషియల్ ప్రీ కాన్ఫరెన్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా(ఏఓఎంఎస్ఐ) రాష్ట్ర సదస్సు శుక్ర, శనివారాల్లో పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో జరగనుంది. అందులో భాగంగా గురువారం మాక్సిల్లో ఫేషియల్ ప్రీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 100 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫేషియల్ ఈస్తటిక్స్, ముఖం శస్త్ర చికిత్సపై అవగాహన కల్పించారు. ముంబాయి నుంచి వచ్చిన డాక్టర్ అరుణ్ పాండా బృందం, చెన్నై నుంచి వచ్చిన డాక్టర్ ప్రభు, డాక్టర్ కన్నన్ బలరామ్ బృందం వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓఎంఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాదెళ్ల కోటేశ్వరరావు, డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, డాక్టర్ మెహబూబ్ షేక్, డాక్టర్ పీఎల్ వసుంధర్, డాక్టర్ కేవై గిరి, డాక్టర్ మిథిలేశ్వర్ పాల్గొని ఫేషియల్ సర్జరీల్లో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీ పర్యవేక్షించారు.

ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

- పండ్ల తోటల పెంపకంపై రైతుల ఆసక్తి
- ఎన్టీఆర్ జిల్లాలో 425 ఎకరాల్లో సాగు


నవాబుపేటలో సాగులో ఉన్న నిమ్మ తోట

పెనుగంచిప్రోలు: సన్న, చిన్నకారు రైతులు మెట్ట భూముల్లో పండ్ల తోటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఉద్యానవన పంటలకు ఉపాధి పథకం సైతం అనుసంధానం చేయటంతో రైతులకు వ్యయ భారం తగ్గింది. దీంతో ఎన్టీఆర్ జిల్లాలోని రైతులు మామిడి, నిమ్మ, దానిమ్మ, జామ, నేరేడు, మునగ, కొబ్బరి లాంటి పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి వారికి ఉపాధి హామీ పథకం ఊతం ఇస్తోంది. గుంతలు తవ్వి మొక్కలు నాటడంతో పాటు మూడేళ్ల వరకు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ఉపాధిహామీ పథకం కిందనే చేపడుతున్నారు. దీంతో రైతు చీడ పీడల నుంచి పంటను కాపాడుకుని జాగ్రత్త చేసుకుంటే సకాలంలో కాపు వచ్చి దిగుబడులను సాధించవచ్చు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో 425 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి.

ఐదు ఎకరాల లోపు భూమి ఉండాలి..

సన్న, చిన్నకారు రైతులకు 50 సెంట్ల నుంచి 5 ఎకరాలలోపు భూమి ఉండాలి. నేల స్వభావాన్ని బట్టి మొక్కలు పెంచుకునేలా ఉద్యానవన శాఖాధికారులు సూచనలు ఇస్తారు. వీటిలో మామిడి, సీతాఫలం, జామ, నిమ్మ, నేరుడు, సపోట, మునగ, కొబ్బరి, బత్తాయి, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి 13 రకాల పండ్ల తోటలతో పాటు పూల సాగు, జున్నుగడ్డి సాగు కూడా చేపట్టవచ్చు. నిమ్మ ఎకరానికి 110 మొక్కలు, కొబ్బరి, మామిడి 70 మొక్కలు, సపోట, జామ అయితే ఎకరానికి 110 మొక్కలు చొప్పున ఇస్తారు. పథకంలో భాగంగా పండ్ల తోటలు పెంచుకునేందుకు రైతుకు సుమారుగా రూ.1.50 లక్షలు వస్తుంది. మొదటి ఏడాది రూ.60 వేలు, రెండు, మూడో ఏడాది రూ.30 వేల చొప్పున ఇస్తారు. అయితే రూ.30 వేల వరకు గుంతలు తీసినందుకు, మొక్కలు వేసినందుకు కూలీలకు వేతనం చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ రైతులే ఆ పని చేసుకుంటే వేతనం కూడా వారికే వస్తుంది.

ఏటా ఆదాయం వస్తోంది..



మెట్టలో ఎకరం పొలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా 99 మామిడి మొక్కలను మూడేళ్ల క్రితం నాటాం. మొక్కలు కాపునకు వచ్చాయి. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు పథకంలో భాగంగా మొక్కల సంరక్షణకు ఇచ్చారు. మామిడితో ఏటా ఆదాయం వస్తోంది.

–యానాల వినయవతి, రైతు, అనిగండ్లపాడు

పంపిణీకి మొక్కలు సిద్ధం..



సన్న, చిన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం కింద 13 రకాల పండ్ల తోటలు పెంచటానికి అవసరమైన మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అయితే భూమి స్వభావాన్ని బట్టి సాగు చేపట్టాలి. ఏ పంట సాగు చేయాలో అధికారులను అడిగి తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలి.

–సునీత, డ్వామా పీడీ, ఎన్టీఆర్ జిల్లా

ఆంధ్రా తిలక్.. హరిసర్వోత్తమరావు

- కృష్ణా యూనివర్సిటీలో ఘనంగా గాడిచర్ల జయంతి
- మండలి బుద్ధప్రసాద్‌కు గాడిచర్ల అవార్డు ప్రదానం
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్


మండలి బుద్ధప్రసాద్‌కు గాడిచర్ల అవార్డును అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు

కోనేరుసెంటర్: వందేమాతరం ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ కావటం ద్వారా గాడిచర్ల హరి సర్వోత్తమరావు ఆంధ్రా బాలగంగాధర తిలక్‌గా పేరు గడించారని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతిని గాడిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. జాతీయతావాది, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, బహుభాషా కోవిదుడిగా, పాత్రికేయుడిగా, కవిగా, నాటక రచయితగా, రాజకీయవేత్తగా బహుముఖ పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి హరిసర్వోత్తమరావు అని కొనియాడారు. మహాత్మాగాంధీకి స్థిరమైన అనుచరుడిగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. 1908లో పూణెలో తిలక్ అరెస్ట్ అయిన సమయంలోనే బందరులో గాడిచర్ల అరెస్ట్ అయ్యారన్నారు. యంగ్ ఇండియా పత్రికలో ప్రచురితమైన ఒక వ్యాసంలో మహాత్మాగాంధీ గాడిచర్లను ధైర్యశాలిగా కొనియాడారన్నారు. స్వరాజ్య వారపత్రిక నిర్వహించటమే కాకుండా ఆంధ్ర పత్రికకు తొలి ఎడిటర్‌గా సేవలను అందించారన్నారు.

శ్రీబాగ్ ఒప్పందంలో గాడిచర్ల విశేష కృషి

గాడిచర్ల అవార్డు గ్రహీత, తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మాతృభాషలో విద్యా విధానం ఉండాలని ఆనాడే గాడిచర్ల బలంగా చెప్పారన్నారు. 1908లో శిక్షకు గురైన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని గాడిచర్ల జయంతిని మచిలీపట్నంలో నిర్వహించటం అభినందనీయమన్నారు. ఆనాడు మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డిలు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారన్నారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మచిలీపట్నంలో కృష్ణా యూనివర్సిటీని ఏర్పాటు చేశారని చెప్పారు. జాతికి దారి చూపే దీపస్తంభంలా యూనివర్సిటీ విద్యార్థులను తయారుచేయాలన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. 1937లో రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి దోహదపడే శ్రీబాగ్ ఒప్పందంలో గాడిచర్ల విశేష కృషి చేశారన్నారు. ఆనాడు ఆంధ్రలో అరెస్ట్ కాబడిన తొలి పాత్రికేయుడు గాడిచర్ల అన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూరా మాట్లాడుతూ.. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాల ద్వారా ఉత్తేజం పొందిన గాడిచర్ల జాతీయ ఉద్యమంలోకి వెళ్లారన్నారు. రాష్ట్రంలో ఎంఏ డిగ్రీ పొందిన రెండో వ్యక్తి గాడిచర్ల అన్నారు. అనంతరం గాడిచర్ల ఫౌండేషన్ కార్యదర్శి రావి శారద గాడిచర్ల జీవిత చరిత్రను వివరించారు. అనంతరం మండలి బుద్ధప్రసాద్‌ను గవర్నర్ సన్మానించి గాడిచర్ల అవార్డును ప్రదానం చేశారు. కలెక్టర్ పి.రాజాబాబు, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి, రిజిస్ట్రార్ డాక్టర్ బ్రహ్మచారి, రెక్టార్ ఆచార్య సూర్యచంద్రరావు, జిల్లా అధికారులు, గాడిచర్ల ఫౌండేషన్ సభ్యులు, యూనివర్సిటీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంతమంది కలిసి వచ్చినా సీఎం వైఎస్ జగన్‌దే విజయం

మంత్రి జోగి రమేష్



గూడూరు: ఎంతమంది కలిసి, కట్ట కట్టుకుని వచ్చినా 2024 ఎన్నికల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే విజయమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును ములాఖత్‌లో కలిసిన పవన్ కళ్యాణ్‌పై మంత్రి జోగి రమేష్ స్పందించారు. చంద్రబాబుతో ములాఖత్‌కు వెళ్లి ఏం పంచుకోవాలన్న అంశాలపై చర్చించారన్నారు. బయటకు వచ్చి ఇద్దరం కలిసే పోటీ చేస్తానని ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టడమేనని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు 2014లో కలిసి పోటీ చేశారు... కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. మళ్లీ ఈ రోజు కలిసి పోటీ చేస్తామంటున్నారు. మీరిద్దరూ గతం నుంచి కలిసే ఉన్నారు కదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై యుద్ధం చేయడమంటే ప్రజలపై యుద్ధం చేయడమే. చంద్రబాబునాయుడు, లోకేష్, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్‌లు పక్క రాష్ట్రంలో ఉంటూ వైఎస్ జగన్‌పై యుద్ధం చేయడం అంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. పేద ప్రజలకు అండగా ఉన్నందుకు వైఎస్ జగన్‌పై యుద్ధం చేస్తారా అని నిలదీశారు. ఏపీని ప్రపంచ పటంలో చూపిస్తానన్న చంద్రబాబు నేడు అవినీతిలో రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టారని దుయ్యబట్టారు. మీరంతా కలిసి కట్ట కట్టుకు వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. ప్రజల మనసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత స్థానం సంపాదించారన్నారు. మీరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. మిమ్మల్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి జోగి రమేష్ ధీమా వ్యక్తం చేశారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భార్య గొంతు నులిమి హత్య చేసిన కేసులో నిందితుడైన భర్తకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజాదేవి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం బొసు దుర్గారావు భార్య, కుమారుడితో కలిసి నగరంలోని పాయకాపురం, సుందరయ్యనగర్‌లో నివాసముంటున్నారు. దుర్గారావు చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. దీంతో భార్య కుమారుడిని తీసుకుని వించిపేటలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిపోయింది. భార్య, బిడ్డను బాగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో చెప్పి వారిని ఇంటికి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో 2017 సెప్టెంబర్ 25వ తేదీన తన భార్య చనిపోయినట్లు ఆమె తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. ఆమె వెళ్లి చూడగా కుమార్తె ఒంటిపై గాయాలు ఉండటంతో అల్లుడే తన కూతురిని గొంతు నులిమి హత్యచేసినట్లు నున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి నార్త్ ఏసీపీ వి.వి.నాయుడు దుర్గారావును అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏసీపీ వి.వి.నాయుడు, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పర్యవేక్షణలో 27 మంది సాక్షులను విచారించగా నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

నేటి నుంచి సివిల్ సర్వీసెస్ మెయిన్స్

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 15వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలకు చేపట్టిన ఏర్పాట్లపై గురువారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలు నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఈనెల 15, 16, 17, 23, 24 తేదీల్లో ఐదు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 171 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు.

పటిష్ట బందోబస్తు

పరీక్షల నిర్వహణకు 26 మంది ఇన్విజిలేటర్‌లను నియమించామని జేసీ చెప్పారు. ముగ్గురు విభిన్న ప్రతిభావంతులు పరీక్షలకు హాజరుకానున్న క్రమంలో పరీక్ష కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు వెన్యూ సూపర్‌వైజర్లు, ఐదుగురు అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించామని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, అవసరమైన మందులతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థుల హాల్ టికెట్లలో నమోదు చేసిన పరీక్ష కేంద్రం పేరు, అభ్యర్థి రాసే పరీక్ష కేంద్రం ఒకే విధంగా ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. పరీక్ష కేంద్రంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ ఆయా రూట్లలో బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి, పరీక్షల కస్టోడియన్ అధికారి జి.వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. సమావేశంలో యూపీఎస్సీ ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీ రేష్ దీపక్ శర్మ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, లెక్చరర్ డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వెన్నెల శ్రీను, ఎం.వెంకటరామయ్య ఉన్నారు.


తుది ఓటర్ల జాబితా తయారీకి పార్టీలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తుది ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల పునర్విభజనకు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు జిల్లా యంత్రాంగానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్ కుమార్ కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ – 2024లో భాగంగా ఇంటింటి పరిశీలనలో తొలగించిన ఓటర్లు, రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై గురువారం ఆయన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 2024 జనవరి 5న ప్రచురించే తుది ఓటర్ల జాబితా రూపొందించేందుకు అవసరమైన ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం – 2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకువచ్చిన ఫిర్యాదులు, క్లెయిమ్స్‌కు సంబంధించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పరిశీలన పూర్తి చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,200 ఓటర్లు మించి ఉంటే కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈఆర్వోలు తమ నియోజకవర్గ పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాల పునర్విభజనలకు సంబంధించి ప్రతిపాదనలు, అభ్యంతరాలను తెలియజేయవచ్చునన్నారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ తదితర వివరాలను తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి వై.అంజనేయరెడ్డి, టీడీపీ, కాంగ్రెస్ ప్రతినిధులు ఎల్.శివరాం ప్రసాద్, పి.ఏసుదాసు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ డీటీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు అత్యంత అరుదైన శస్త్రచికిత్స


ఆంధ్రా హాస్పిటల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామారావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): 15 రోజుల నవజాత శిశువుకు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో అత్యంత అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. శిశువుకు గ్లూకోజ్ లెవల్స్ బాగా పడిపోవడం, ఇన్సులిన్ లెవల్స్ ఎక్కువగా ఉండటంతో వాటిని క్రమబద్ధీకరించేందుకు పాంక్రియాస్‌ను 90 శాతం తొలగించారు. ఈ తరహా శస్త్రచికిత్స రాష్ట్రంలోనే తొలిసారి నిర్వహించినట్లు హాస్పిటల్ పిడియాట్రిక్ విభాగం చీఫ్ డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో శస్త్ర చికిత్స వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన వెంకట శివనాగరాజు, దుర్గ దంపతులకు శిశువు పుట్టినప్పుడు 4.47 కేజీల బరువు ఉంది. ఆరో రోజు నుంచి శిశువు పాలు సరిగా తీసుకోకపోవడం, పరీక్షల్లో గ్లూకోజ్ లెవల్స్ తగ్గడం, ఇన్సులిన్ లెవల్స్ ఎక్కువ ఉన్నట్లు స్థానిక వైద్యులు గుర్తించారు. ఆ శిశువును ఆంధ్రా హాస్పిటల్‌కు తీసుకురాగా రక్తంలోకి గ్లూకోజ్ ఎక్కించి, మందులు వాడారు. అయినప్పటికీ సుగర్ లెవల్స్ తగ్గడం, ఇన్సులిన్ పెరుగుతుండటంతో ఎంఆర్ఐ, పెట్‌స్కాన్‌లు చేయగా పాంక్రియాస్ గ్రంథిలో ఇన్సులినోమా అనే గడ్డ ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో పిడియాట్రిక్ సర్జన్ డాక్టర్ మేఘన నియర్ టోటల్ పాంక్రియాటక్టమీ అనే శస్త్రచికిత్స చేసి ఇన్సులిన్‌ని తయారు చేసే పాంక్రియాస్‌ను 90 శాతం తొలగించామన్నారు. ఆపరేషన్ తర్వాత గ్లూకోజ్ లెవల్స్ మామూలు స్థాయికి వచ్చాయి. రెండు రోజులు వెంటిలేటర్, 14 రోజులు చికిత్సతో పూర్తిగా కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేశారు. సమావేశంలో నియోనాటాలజిస్ట్ డాక్టర్ భూజాత, శిశువు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనారోగ్య కారణాలతో బాలిక ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్య కారణాలతో బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత రాజరాజేశ్వరిపేటలో గురువారం చోటుచేసుకుంది. ఘటనపై మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతరాజరాజేశ్వరిపేటకు చెందిన జయలక్ష్మీనగర్ 3వ లైన్‌కు చెందిన కె.పార్వతి, కేశవులు భార్యాభర్తలు. వీరు ఏలూరులాకులు వద్ద చెరుకు రసం మిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తుంటారు. వీరికి ముగ్గురు సంతానం కాగా, పెద్ద కుమార్తె ఆంధ్ర లయోలా కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది.

రెండో కుమార్తె స్థానికంగా ఉన్న స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. బుధవారం ఉదయం స్కూల్‌కు వెళ్లిన బాలిక ఒంట్లో బాగోలేదని ఇంటికి తిరిగి వచ్చేసింది. సాయంత్రం కేశవులు పెద్ద కుమార్తెను తీసుకుని ఇంటికి రాగా అప్పటికే బాలిక ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. దీంతో వెంటనే భార్యను ప్రభుత్వాస్పత్రికి రమ్మని చెప్పి, కొన ఊపిరితో ఉన్న కుమార్తెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, కొద్ది సేపటికే బాలిక మృతి చెందింది. దీంతో ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే.. దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

నలంద విద్యా నికేతన్ ప్రైమరీ స్కూల్ బ్లాక్,
డోర్ నం.40-9-44, ఆచార్య రంగా నగర్,
బెంజ్ సర్కిల్ దగ్గర విజయవాడ-520010
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 99126 71555

క్లుప్తంగా

ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు



గుణదల (విజయవాడ తూర్పు):దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు చేయూతనందిస్తున్నామని ట్రస్ట్ వైస్ చైర్మన్ దేవినేని సుధీర అన్నారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో 8వ డివిజన్‌కు చెందిన వెల్లంకి రామారావు అనే వ్యక్తికి జీవనోపాధి నిమిత్తం ఇస్త్రీ బండి అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజా సేవ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో అనేక మంది పేదలకు తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, బడ్డీ కొట్లు అందించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వై. సిద్ధార్థ, సొంగా రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు):రాణిగారితోట, 17వ డివిజన్ పరిధిలో కొత్తగా 60 పింఛన్లు మంజూరయ్యాయని కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని వార్డు సచివాలయాల్లో గురువారం కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రామిరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో డివిజన్ పరిధిలో రెండు విడతల్లో కొత్తగా 100 పింఛన్లు వచ్చాయన్నారు. అనంతరం లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న జోగిని శ్యామల



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మను నటి, జోగిని శ్యామల గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జోగిని శ్యామలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందచేయగా, చైర్మన్ రాంబాబు అమ్మవారి ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు.

ఎస్ఎన్ఈఏ నేతల సంబరాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):ఈ నెల 12న దేశ వ్యాప్తంగా జరిగిన బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్స్ 3వ సభ్యత్వ ధ్రువీకరణ ఎన్నికల్లో సంచారనిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఘన విజయం సాధించింది. సంచారనిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్‌కు, ఆలిండియా గ్రాడ్యుయేట్ ఇంజినీర్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ మధ్య పోటీ జరిగింది. గురువారం జరిగిన ఓట్ల లెక్కింపులో రాష్ట్ర వ్యాప్తంగా 1743 ఓట్లకు గానూ ఎస్ఎన్ఈఏకు 924 ఓట్లు, ఏఐజీఈటీఓఏకు 713 ఓట్లు వచ్చాయి. దీంతో సంచారనిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఘన విజయం సాధించినట్లు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఎస్ఎన్ఈఏ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఎస్ఎన్ఈఏ నాయకులు జె.ఉమామహేశ్వరరావు, ఆర్. మహేశ్వరరావు, ఎం.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తమ యూనియన్ ఘన విజయం సాధించటం ఆనందంగా ఉందన్నారు. తమకు ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు ఇవ్వటం వల్ల ఇంతటి ఘన విజయం సాధించగలిగామన్నారు.

చండీ హోమం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయంలోని అర్ధనారీశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి స్వామి వారికి విశేష పూజాభిషేకాలు, అలంకరణ చేశారు. స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

పేదల చెంతకే వైద్య సేవలు



ప్రారంభం కానున్న యూపీహెచ్‌సీ



ఫార్మసీ రూమ్

- డివిజన్ వాసులకు చేరువైన వైద్యం
- 17న ప్రారంభంకానున్న యూపీహెచ్‌సీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):పేద ప్రజల చెంతకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లకు శ్రీకారం చుట్టారు. డివిజన్ స్థాయిలో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తూ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేశారు. అందులో భాగంగా రాణిగారితోట, 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్స్‌లో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీన కేంద్రాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ డివిజన్‌లో ఇప్పటివరకు ఆరోగ్య కేంద్ర లేకపోవడంతో పక్క డివిజన్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు డివిజన్ ప్రజలకు అందుబాటులో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ ఆస్పత్రి ప్రారంభించనున్నారు. ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక లాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్టు, ఒక డీఈవో, ఒక ఎల్‌జీఎస్ ఉండడంతో రోగులకు నాణ్యమైన కార్పొరేట్ వైద్య సేవలు అందనున్నాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం చేయనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఈసీజీతో పాటు 73 రకాల రక్త పరీక్షలు చేయనున్నారు. బీపీ, షుగర్, హెచ్‌బీ, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, సీబీపీ పరీక్షలు, డ్రెస్సింగ్ వంటి సేవలు అందనున్నాయి. 172 రకాల మందులు అందుబాటులో లభించనున్నాయి.

నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేయాలి



షాపుల యజమానులతో మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్

కృష్ణలంక(విజయవాడతూర్పు):బందరురోడ్డులోని షాపుల యజమానులు వారి షాపుల ముందు విధిగా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సీఐ ఎం.వి.దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం స్టేషన్ పరిధిలో బెంజిసర్కిల్ నుంచి పశువుల ఆసుపత్రి వరకు బందరు రోడ్డులోని షాపుల యజమానులతో సమావేశం నిర్వహించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ బందరు రోడ్డులో షాపుల వద్దకు వచ్చే వాహనాలను షాపుల ముందు రోడ్డు మీద పార్కింగ్ చేయకుండా షాపు యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు మీద ఎటువంటి వాహనాలను పార్క్ చేయరాదని, సెల్లార్‌లో గానీ, పక్క రోడ్డులో గానీ పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. బందరు రోడ్డులో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, షాపుల యజమానులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ దుర్గారావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసనకారులపై కేసు నమోదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంక్షలు ఉల్లంఘించిన తెలుగు మహిళలపై కేసు నమోదైంది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును స్కిల్ స్కామ్ కేసులో అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం పలు కాలనీలకు చెందిన చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన మహిళలు ట్రెండ్‌సెట్ మాల్‌కు వేర్వేరుగా చేరుకున్నారు. రాత్రి 7.30 గంటల సమయంలో అందరూ ఒక్కసారిగా బెంజిసర్కిల్ రోడ్డుపైకి వచ్చి, ప్లకార్డులు ప్రదర్శించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తుండగా, అప్రమత్తమైన పోలీసులు వారిని సర్వీసు రోడ్డులోకి పంపారు. కొద్దిసేపు నిరసన తెలిపిన తర్వాత వెళ్లిపోయారు. వారిలో టీడీపీకి చెందిన కార్పొరేటర్‌లు, తూర్పు ఎమ్మెల్యే అనుచరులు సైతం ఉన్నారు. నగరంలో అమలులో ఉన్న 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌లను ఉల్లంఘించిన వారిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ.. పవన్ వేర్వేరు కాదు.. ఇద్దరూ ఒకటే

మాజీ మంత్రి వెలంపల్లి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ.. పవన్ వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని, చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టాడని.. పవన్ కళ్యాణ్‌కు దమ్ము ధైర్యం ఉంటే తనపై పోటీ చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ సవాల్ విసిరారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పవన్ కళ్యాణ్‌పై నిప్పులు చెరిగారు. తన అన్నకి సపోర్ట్‌గా నిలవలేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. చంద్రబాబుకి దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ జైలు బయట తన ముసుగు తీశాడన్నారు. చంద్రబాబు నేరం చేశాడని రిమాండ్ విధిస్తే పవన్ కళ్యాణ్ వెనకేసుకు రావటం దిక్కుమాలిన చర్య అన్నారు. నమ్మిన జనసేన నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా పవన్ కళ్యాణ్ సిగ్గులేకుండా చంద్రబాబు కోసమే పరితపిస్తున్నారన్నారు. ఎవరు ఎంత మంది కలిసి వచ్చినా తాము సింగిల్‌గానే పోటీ చేసి సత్తా చూపిస్తామని చెప్పారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్‌ను నమ్ము కున్నాడని తాము మాత్రం ప్రజలనే నమ్ముకున్నామని తెలిపారు. ఒకరితో పెళ్లి మరొకరితో సహజీవనం చేసే వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు కోసం పని చేస్తున్నాడని జనసైనికులు ఒకసారి ఆలోచన చేయాలని హితవు పలికారు. జనసైనికులు కూడా పవన్ కళ్యాణ్‌ను తిరస్కరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావుకు నివాళి

మధురానగర్(విజయవాడసెంట్రల్):స్వతంత్ర సంగ్రామంలో సర్వోత్తముడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం గాడిచర్ల జయంతి నిర్వహించారు. హరి సర్వోత్తమరావు చేసిన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పీవీ సుబ్బరాజు, సహాయ కార్యదర్శి వి.సింగంరాజు, కోశాధికారి టి. శ్రీనివాసరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వరరాజు, కార్యదర్శి కె.ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ స్టార్‌కు డీల్ కుదిరింది

ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాజకీయాల్లో ఉనికి కోల్పోయిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోమారు టీడీపీ ప్యాకేజీలకు అమ్ముడు పోయాడని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్ రెడ్డి విమర్శించారు. విజయవాడలో గురువారం గౌతమ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ములాఖ్ పేరుతో పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో బేరం కుదుర్చుకున్నట్లు తేటతెల్లమైందన్నారు. పవన్ కళ్యాణ్ మీద నమ్మకం పెట్టుకున్న అభిమానులు, కాస్తో కూస్తో నమ్మిన వాళ్లకు భ్రమలు తొలగిపోయాయని పేర్కొన్నారు. జనసేన, టీడీపీలను మూకుమ్మడిగా రాష్ట్రం నుంచి తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీతో జనసేన ఒక అక్రమ కలయిక అని ధ్వజమెత్తారు. ఒంటరిగా పోటీచేయలేమని చెప్పకనే చెప్పారన్నారు. రాష్ట్రంలో కోట్లాది మందికి ఏదో ఒక రూపేణా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. అందుకే ఆయన తిరుగులేని ప్రజాదరణ కలిగిన నేతగా ఎదిగారన్నారు.
రాష్ట్రంలో 5.50 కోట్ల మంది ఉంటే దాదాపు 5 కోట్ల మందికి ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాలు దరిచేరాయన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడిందంతా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాసిచ్చిన స్క్రిప్టేనన్నారు. అందులో ఎక్కడా కూడా తన సొంత నిర్ణయం ఏదీ ఉన్నట్లుగా కనిపించడం లేదన్నారు.

ప్యాకేజీ బంధం బయటపడింది

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన



భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ – జనసేన ప్యాకేజీ బంధం బట్టబయలైందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్న అవినీతి చక్రవర్తి చంద్రబాబును కలిసిందే ప్యాకేజీని పెంచుకోవడానికని ఎద్దేవా చేశారు. టీడీపీతో పొత్తును ఖాయం చేసుకున్న పవన్ కల్యాణ్‌పై ఇన్నాళ్లూ నమ్మకం పెట్టుకున్న అభిమానులు, కాస్తోకూస్తో అతన్ని నమ్మినవారి భ్రమలను తొలగించేశాడని చెప్పారు. ఇకపై పొత్తులకు, ప్రజలకు మధ్య యుద్ధం జరుగబోతుందని తెలిపారు. పొత్తుల బ్యాచ్‌ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

చంద్రబాబు అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి...

అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు దశాబ్దాలుగా కోర్టుల ద్వారా స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు వ్యవస్థలను ఎలా మేనేజ్ చేశాడో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. చంద్రబాబు పట్ల ప్రజల్లో సానుభూతి లేకపోవడంతో టీడీపీ నాయకులే మొక్కుబడిగా నాలుగు గోడల మధ్య ఉద్యమాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఉచిత యోగా, ప్రాణాయామం శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో సాధన చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పైపుల కంపెనీ సెంటర్‌లోని భగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం శ్రీభగవత్ శక్తి అసోసియేషన్ యోగా, ధ్యాన్య కేంద్రం ఆధ్వర్యాన ఉచిత యోగా, ప్రాణాయామం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మందిర గౌరవ అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు పెరిగిపోతున్న ఒత్తిడి అనారోగ్య సమస్యలను అధిగమించటానికి ఈ ఉచిత శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని చెప్పారు. నిపుణులైన శిక్షకులచే తరగతులు నిర్వహించటం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉదయం 5.50 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధురానగర్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు, యోగ, ప్రాణాయామం సాధన చేయాలనుకునే వారు పాల్గొనవచ్చని కోరారు. ఆసక్తికలిగిన వారు 9154028198, 7382623057 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కృష్ణమాచార్యుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ



విజయవాడ కల్చరల్: కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు శ్రీమాన్ ఎస్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శతజయంతి సందర్భంగా 16 నుంచి ఐదురోజులపాటు శతజయంతి, సంగీత , సమ్మానోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ బుచ్చయాచార్యులు తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణమాచార్యులు బహుభాషా కోవిదుడని తెలిపారు. సుదీర్ఘకాలం విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేశారని పేర్కొన్నారు. వారి సేవలు నేటి తరానికి స్ఫూర్తి కలిగించడానికి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోజూ 12 గంటలపాటు సంగీత ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కృష్ణమాచార్య కళాపీఠం ఉపాధ్యక్షుడు టీకేవీ రామానుజా చార్యులు మాట్లాడుతూ ఆచార్యులవారి శిష్యప్రశిష్యులు సంగీత కచేరీలు నిర్వహిస్తారన్నారు. 20 వ తేదీ పద్మశ్రీ పురస్కార గ్రహీత యల్లా వెంకటేశ్వరరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ కోశాధికారి ఎస్‌సీహెచ్ శ్రీరామచక్రవర్తి, సంగీత విద్వాంసులు పోపూరి గౌరీనాథ్, సీవీకే శాస్త్రి, కౌశిక్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

లయోలలో ఘనంగా హిందీ దివస్



గుణదల (విజయవాడ తూర్పు):హిందీ భాష మన దేశానికి అధికార భాషగా చలామణి అవుతోందని, ప్రతి ఒక్కరూ హిందీ భాష పై పట్టు సాధించాలని మారిస్ స్టెల్లా కళాశాల హిందీ విభాగాధిపతి బి.కరుణ హారిక తెలిపారు. ఆంధ్ర లయోల కళాశాలలో హిందీ దివస్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరుణహారిక మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో భాషలకు ప్రత్యేక స్థానముందన్నారు. వివిధ భాషలు, సంప్రదాయాలు పాటించే ప్రజలు ఉన్న కారణంగా మన దేశానికి భిన్నత్వంలో ఏకత్వం , ఏకత్వంలో భిన్నత్వం అనే పేరు వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా హిందీ భాషకు రాజ భాషగా గుర్తింపు ఉందన్నారు. 1949, సెప్టెంబర్ 14వ తేదీన హిందీ రాజ భాషగా ఉండాలని రాజ్యాంగ పరమైన చర్చ జరిగిందని తెలిపారు. ఆ రోజునే హిందీ దివస్ గా ప్రకటించారన్నారు. ప్రస్తుతం మన దేశంలో ఎక్కువ మంది మాట్లాడుతున్న భాష హిందీ అని పేర్కొన్నారు. మన అధికార భాషను ప్రతి ఒక్కరూ గౌరవించి ఆదరించాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హిందీ భాష విశిష్టతను వివరించారు. లయోల కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్, అధ్యాపకులు కె.శేఖర్, శ్రీకుమార్, సహాయ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అంబేడ్కర్ స్మృతివనం పనులు



అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి, స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం పనులు చురుగ్గా సాగుతున్నాయని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్మృతివనం పనులను గురువారం ఆమె పరిశీలించారు. ప్రాజెక్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. రాత్రిళ్లు చేస్తున్నారని, నిర్దేశించిన సమయానికి పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. గ్రౌండ్స్ చుట్టూ ఉన్న ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లు మరింత అందంగా బ్యూటిఫికేషన్ చేస్తున్నామని చెప్పారు. నవంబర్ 26న స్మృతివనం ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు వీలుగా డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మిస్తామన్నారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే వాటర్ ఫౌంటేన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

సబ్ కలెక్టర్ అతిథి సింగ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అతిథి సింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ నగర పాలక సంస్థ, రూరల్ ప్రాంతాల్లోని గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనాలకు సంబంధించి బందోబస్తు తదితర అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సబ్ కలెక్టర్ అతిథి సింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తు పై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, వీఎంసీ, మెడికల్, ఫిషరీస్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి గణేష్ ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేషన్, రూరల్ పరిధిలో మూడు వేల విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతులు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు, మతపరమైన సమస్యలు లేకుండా అనుమతులు ఇవ్వాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన మూడు, ఐదు, తొమ్మిది, 11వ రోజులలో గణేష్ నిమజ్జనాలు జరుగుతాయని ఆఖరి రోజు ఎక్కువ మంది భక్తులు కృష్ణా నది ఘాట్లకు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ లాండ్ ఆర్డర్ కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘాట్లలో సౌకర్యాలు కల్పించాలి...

ఘాట్ల సౌకర్యాల ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యల కోసం ఇరిగేషన్, వీఎంసీ, రెవిన్యూ, విద్యుత్, ఫిషరీస్, ఫైర్ శాఖలు ముందుగా జాయింట్ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రకాశం బ్యారేజి ఎగువ ప్రాంతాల్లోని ఘాట్లలో బారికేడ్లు ఏర్పాట్లలో ఇరిగేషన్ శాఖ, కార్పొరేషన్ సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన క్రేన్‌లను, సిబ్బందిని, వీఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. ఫిషరీస్ శాఖ బోట్ లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ఆయా ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోను, నిమజ్జనాలు నిర్వహించే ఘాట్ల వద్ద కంట్రోల్ రూమ్‌లను రెవెన్యూ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. లైవ్ జాకెట్‌లతో సిబ్బందిని ఏర్పాటు చేసి ఫైర్ వాహనం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మేజర్ విగ్రహాలు నిమజ్జనంలో కరెంట్ తీగల తొలగింపుపై విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఘాట్ల వద్ద లైటింగ్ ఏర్పాటుచేయాలన్నారు. కృష్ణ వేణి ఘాట్, పవిత్ర సంగమం వద్ద నిమజ్జనానికి తగు ఏర్పాట్లు చేయాలని ప్రకాశం బ్యారేజి దిగువ భాగాన నిమజ్జనానికి సంబంధించిన ఘాట్ల వద్ద నీటి సమస్య ఉన్నందున విగ్రహాల నిజ్జనానికి వీలుగా నీటి మడుగులు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ అతిథి సింగ్ ఆదేశించారు. డీఆర్వో జి. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో జగనన్న సురక్ష సర్వే

పటమట(విజయవాడతూర్పు): త్వరలో ప్రారంభమయ్యే జగనన్న సురక్ష హెల్త్ క్యాంపునకు పూర్తిస్థాయిలో సర్వే జరగాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి డివిజన్లలో ఉన్న ప్రతి ఇంటినీ సర్వే చేసి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా ప్రణాళికను రూపొందించామని చెప్పారు. మొదటి దశలో వలంటీర్లు, వార్డు సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తారని చెప్పారు. ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరగబోయే రోజు, తేదీతోపాటు ఏయే కార్యక్రమాలు చేపడతామో ప్రజలకు వివరిస్తామన్నారు. వీటితోపాటు ఆరోగ్యశ్రీ పథకంలో ఎంప్యానెల్ అయిన ఆసుపత్రులు ఎక్కడ ఉన్నాయి ? ఎలా వెళ్లాలి ? ఉచితంగా వైద్యం అందుకోవాలంటే ఆరోగ్యశ్రీని ఎలా వినియోగించుకోవాలన్న అంశాలపై ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రెండో దశలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఏరియా వలంటీర్లు డివిజన్లలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు 7 రకాల టెస్టుల గురించి తెలియజేస్తారని తెలిపారు. ఫేజ్ –3లో హెల్త్ క్యాంపునకు 3 రోజుల ముందు వలంటీర్, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు ఆ వార్డులో మరోసారి పర్యటిస్తారన్నారు. ఫేజ్ 4లో ప్రతి డివిజన్‌కు హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ పూర్తిగా బాధ్యత తీసుకుని ఆ వార్డుని మ్యాపింగ్ చేస్తారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి వార్డు వలంటీర్లు, సెక్రటరీలకు, ఆరోగ్య సిబ్బందికి ప్రజాలందరు సహకరించాలని కోరారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 15-9-2023

ఫ్యాషన్





విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్‌సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్ట్రన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.



విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్

ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పొట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.



షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్ట్రన్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.





మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.



వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు... వైవిధ్యభరితమైన మరెన్నో స్వీట్లను తినిపించి ప్రసన్నం చేసుకుందాం....



వంటిల్లు



పనస పాఠోలి

కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాతోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలుపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాతోలీ రెడీ.

బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.



పతి శప్త

కావలసినవి: మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.



సేమియా లడ్డు

కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.



స్వీట్ సందేశ్

కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతుల తోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేష్ రెడీ.



కేసి మిథోయ్

కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.

తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.



విత్య, నిత్య

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో' అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు. పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది. ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు. తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది. కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు. కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధ పడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్పించింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పితే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా.

ఇద్దరు కూతుళ్ల చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వా లేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీమణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.



తల్లి మీనాతో విత్య, నిత్య